


అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

23.08.2026

ఆదివారం | అనంతపురం

సంపుటి : 11 | సంచిక: 102

పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## అన్నయ్య హీరో కాకముందే నేను ఆయన అభిమానిని

- పవన్ కల్యాణ్ ఎమోషనల్ పోస్టు
- చిరంజీవికి బర్త్‌డే విషెష్
- చదువు కోసం అన్నయ్య ఇంటికి దూరంగా ఉన్నారు
- వెళ్లేటప్పుడు ఎంతో బాధపడే వాళ్లం

2లో..



## వికసిత్ భారత్ లక్ష్యానికి యువతే వెన్నెముక

- 40 ఏళ్ల తర్వాతే పాలిటిక్స్‌లోకి రావాలి
- అనుభవం.. స్థిరత్వం.. ఆ తర్వాతే రాజకీయాలు
- యువతకు గోవా సీఎం కీలక సూచన

**అమరావతి, ఆగస్ట్ 22, అనంత జనశక్తి న్యూస్**

వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ అన్నారు. దేశంలో దాదాపు 50 శాతం మంది యువత ఉన్నారని, వారి శక్తి, ప్రతిభను సరైన దిశలో వినియోగిస్తే వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని సాధించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పర్యటనలో మాట్లాడుతూ.. యువత రాజకీయాల్లోకి రావాలా? వస్తే ఎప్పుడు రావాలి? అనేది ప్రస్తుతం పెద్ద ప్రశ్నగా మారిందని ప్రమోద్ సావంత్ వ్యాఖ్యానించారు.

2లో..



# మెరిట్‌పైనే పోస్టులు ఇచ్చాం

## డీఎస్సీలో ఎలాంటి అవకతవకలు జరగలేదు: సీఎం చంద్రబాబు

- అనకాపల్లి ఇండస్ట్రియల్ హబ్‌గా మారుతుంది
- గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తరలిస్తాం
- మంచి పనులకు విమర్శలు సహజమే
- అమరావతికి క్వాంటమ్ కంప్యూటింగ్ గర్వకారణం
- ఈ నెల 31న వెలిగొండ తొలిదశ ప్రారంభం
- రెండేళ్లలో వెలిగొండకు రూ.2,250 కోట్లు ఖర్చు
- చంద్రబాబు వ్యాఖ్యలు డీఎస్సీ, అభివృద్ధి, వెలిగొండపై ఫోకస్



**అమరావతి, ఆగస్ట్ 22, అనంతజనశక్తి న్యూస్**

డీఎస్సీలో ఎలాంటి అవకతవకలు జరగలేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. యువతకు ఉద్యోగాలు ఇస్తే తనకు ఎక్కడ పేరు వస్తుందోనని వైసీపీ నేతలు కుట్ర పన్నారని ధ్వజమెత్తారు. ఈ రోజు (శనివారం) అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం ఎ.కోడూరులో నిర్వహించిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. మెగా డీఎస్సీ ఇచ్చి ఉద్యోగాలిస్తే.. వైసీపీ నేతలు తమ ప్రభుత్వంపై 350 పిటిషన్లు వేశారని మండిపడ్డారు. మెరిట్‌పైనే పోస్టులు ఇచ్చిన సంప్రదాయం తమది అని సీఎం వ్యాఖ్యానించారు. ఉపాధ్యాయులను అగౌరవపరిచే కుట్రకు వైసీపీ తెరలేపిందని ఆగ్రహించారు. పకడ్బందీగా చేయాల్సిన ఏపీపీఎస్సీని అస్తవ్యస్తం చేశారని దుయ్యబట్టారు. మంచి పనులు చేయాలంటే రాజకీయాల్లోనూ ప్రక్షాళన అవసరమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అనకాపల్లి కేవలం బెల్లానికి మాత్రమే పరిమితం కాదని, రాబోయే రోజుల్లో దేశంలోనే అత్యుత్తమ ఇండస్ట్రియల్ హబ్‌గా ఆవిర్భవిస్తుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. తాము చేస్తున్న అభివృద్ధిని ప్రజలు అభిమానిస్తే అదే తమకు అసలైన తృప్తినిస్తుందని పేర్కొన్నారు. సమాజానికి మంచి చేసే ప్రతి పనిలోనూ సవాళ్లు, విమర్శలు ఎదురవుతాయని.. అయితే అభివృద్ధి ప్రయాణం ఆగదని తేల్చి చెప్పారు.

2లో..



విశాఖకు గూగుల్ డేటా సెంటర్ వస్తే నీటి ఎద్దడి తలెత్తుతుందంటూ కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. డేటా సెంటర్ ఇంకా ప్రారంభమే కాకముందే నీళ్లు ఇంకిపోయాయని ప్రచారం చేయడం వారి అవగాహనా రాహిత్యానికి నిదర్శనమన్నారు.

ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందులో భాగంగా త్వరలోనే అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు గోదావరి జలాలను తరలిస్తామని హామీ ఇచ్చారు. సెప్టెంబర్ తొలి వారంలోనే ఈ పనులను పూర్తి చేసి చూపిస్తామని సీఎం ధీమా వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం ద్వారా గోదావరి జలాల తరలింపు వేగవంతం చేస్తామని చెప్పారు. అలాగే, అమరావతికి అత్యాధునిక క్వాంటమ్ కంప్యూటింగ్ సాంకేతికత రావడం రాష్ట్రానికే గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. మంచి పనులను అడ్డుకోవాలని చూసే విమర్శలను పక్కనపెట్టి, పరిశ్రమల స్థాపన, మౌలిక వసతుల కల్పనతో ప్రాజెక్టులను వేగంగా ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

## నిరుద్యోగులకు గుడ్ న్యూస్

- 10,060 ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ విడుదల
- జీవో ఎంఎస్ నంబర్ 81 జారీ
- నాలుగు దశల్లో ఈ పోస్టులను భర్తీ
- మొదటి దశలో 1,523 పోస్టులు భర్తీ
- సెప్టెంబర్ 15న రెండో దశలో 3,231 పోస్టులు

2లో..




**అమరావతి, ఆగస్ట్ 22, అనంతజనశక్తి న్యూస్**

రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుడ్ న్యూస్ వినిపించింది. 10,060 ఉద్యోగాలతో ఏపీ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ 2026ను విడుదల చేసింది. నాలుగు దశలలో 10 వేల 60 ఉద్యోగాల భర్తీకి ఆర్థిక శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

## మాజీ సీఎం జగన్‌కు డీఎస్సీ, ఏపీపీఎస్సీ తేడా తెలియదు

- అక్రమ కేసులన్నీ రద్దు చేస్తాం: మంత్రి నారా లోకేష్
- 'రెడ్ బుక్ తన పని తాను చేసుకుపోతుంది'
- మూడు పర్యాయాలు టీడీపీ అధికారంలో ఉండాలి
- స్థానిక ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యం

2లో..



**అమరావతి, ఆగస్ట్ 22, అనంతజనశక్తి న్యూస్**

టీడీపీ నియోజకవర్గ కేడర్ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ వైసీపీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలియని వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని ఎద్దేవా చేశారు. అలాంటి వ్యక్తి ముఖ్యమంత్రి ఎలా అయ్యారో తనకు అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. 'గొడ్డలి పార్టీ' చెప్పేది ఒకటి.. చేసేది మరొకటని విమర్శించారు.

## కమీషన్ల కోసమే వివాదాలు

- బాధితుల ఆస్తులు కాపాడుతామని బీఆర్ఎస్ హామీ
- రేవంత్ రెడ్డి సర్కార్‌పై హరీశ్ రావు ఫైర్

2లో..



**హైదరాబాద్, ఆగస్ట్ 22, అనంత జనశక్తి న్యూస్**

బోడుప్పల్ పరిధిలోని పలు కాలనీల ప్రజల భూములను 22A నిషేధిత జాబితాలో చేర్చడంపై బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన ఆయన, రేవంత్ రెడ్డి సర్కార్‌ను '30 శాతం కమిషన్ ప్రభుత్వం' అని ప్రజలే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారని ఆరోపించారు. నిషేధిత జాబితా పేరుతో ప్రజల ఆస్తులను కబ్జా చేసే హక్కు రేవంత్ రెడ్డికి ఎవరిచ్చారని ఆయన నిలదీశారు.

## హఫీజ్ సయీద్‌కు ఎన్ఐఏ సమన్లు

- పహల్గామ్ దాడి కేసులో కీలక పరిణామం
- విదేశీ మంత్రిత్వ శాఖ ద్వారా సమన్లు పంపే ఛాన్స్

2లో..

**ఇస్లామాబాద్, ఆగస్ట్ 22, అనంత జనశక్తి న్యూస్**

పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్‌ను పహల్గామ్ ఉగ్రదాడి కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ కోర్టు సమన్లు పంపడానికి సిద్ధమవుతోంది. 2025లో జరిగిన పహల్గామ్ ఉగ్రవాద దాడిలో కీలక నిందితుడిగా సయీద్‌ను చేర్చిన నేపథ్యంలో చర్యలకు సిద్ధమైంది. ఈ సమన్లను విదేశాంగ మంత్రిత్వ శాఖ ద్వారా హఫీజ్ సయీద్‌కు పంపనున్నారు. జమ్మూలోని ప్రత్యేక NIA కోర్టు ఎదుట విచారణకు హాజరుకావాలని సమన్లలో ఆదేశించనున్నారు.

## రామ్‌దేవ్ స్వదేశీ ప్రచారంలోకి నకిలీ ఉత్పత్తులు

- విదేశీ వస్తువులు చేరాయి
- బీజేపీ నేత, మాజీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్
- రామ్‌దేవ్ 'స్వదేశీ' ప్రచారంపై విమర్శలు

6లో..



## ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించాలి

- మంత్రి దామోదర రాజనర్సింహ
- వైద్య సిబ్బంది సమన్వయంతో పని చేయాలి
- మౌలిక వసతులను బలోపేతం చేయాలి
- అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంచాలి

6లో..



**హైదరాబాద్, ఆగస్ట్ 22, అనంతజనశక్తి న్యూస్**

ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరుపై మంత్రి దామోదర్ రాజనర్సింహ కీలక సమీక్షించారు. తెలంగాణలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలను మరింత మెరుగుపరచడం, ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవడంపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష నిర్వహించారు. వెంగళ్‌రావునగర్‌లోని IIHFWలో అన్ని జిల్లాల డీసీహెచ్ఎస్‌లతో మంత్రి సమావేశమయ్యారు. డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరుపై విస్తృతంగా చర్చించారు.



## ఫార్మా కంపెనీలో ప్రమాదం

- రియాక్టర్ పేలి ఇద్దరు మృతి
- 9 మందికి తీవ్ర గాయాలు
- యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘటన

6లో..

**హైదరాబాద్, ఆగస్ట్ 22, అనంతజనశక్తి న్యూస్**

తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. పోచంపల్లి మండలం పరిధిలోని ధోతిగూడెం గ్రామంలో ఉన్న 'హేజెలో లాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్' ఫార్మా కంపెనీలో హఠాత్తుగా సంభవించిన భారీ పేలుడు తీవ్ర విషాదాన్ని నింపింది.

## తెలంగాణ అభివృద్ధికి అడ్డంకులు

- మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్
- విదేశీ పర్యటనకు వెళ్తే అడ్డుకుంటారా?
- సీఎం టూర్‌కు అనుమతి ఎందుకు ఇవ్వలేదు?
- ఇది కేంద్ర ప్రభుత్వం నిరంకుశ పాలన

2లో..



# హఫీజ్ సయీద్‌కు ఎన్ఐఏ సమన్లు

(మొదటి పేజీ తరువాయి)



ఇదిలా ఉంటే, ఇప్పటికే హఫీజ్ సయీద్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. ఈ దాడికి సూత్రధారుల్లో ఒకరిగా ఇతను ఉన్నట్లు ఎన్ఐఏ ఆరోపించింది. జూలైలో దాఖలు చేసిన అనుబంధ ఛార్జిషీట్‌లో సయీద్‌ను ఎన్ఐఏ నిందితుడి పేర్కొంది. నిషేధిత లష్కరే తోయిబా, దాని ప్రాక్సీ అయిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) అధిపతిగా మాత్రమే కాకుండా, వ్యక్తిగత హోదాలో అతడిని నిందితుడి చేర్చింది. సయీద్‌పై భారతీయ న్యాయ సంహిత 2023, చట్ట విరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం , 1967 కింద అభియోగాలు నమోద య్యాయి. భారత్‌పై యుద్ధం చేయడం, పాకిస్థాన్ నుంచి దాడికి కుట్ర పన్నడం వంటి ఆరోపణలు ఉన్నాయి. గతంలో దాఖలు చేసిన 1,597 పేజీల ఛార్జ్‌షీట్‌కు కొనసాగింపుగా ఈ అనుబంధ ఛార్జ్‌షీట్‌ను సమర్పించింది. పాకిస్తాన్ కేంద్రంగా కుట్ర జరిగినట్లు, హఫీజ్ సయీద్ పాత్ర, దర్యాప్తులో సేకరించిన ఆధారాల వివరాలను NIA ఛార్జిషీట్‌లో పొందుపరిచింది. పాకిస్తాన్‌కు చెందిన అనుమానిత హ్యాండర్లు సజిద్ జట్, 2025 జూలైలో ఆపరేషన్ మహాదేవ్‌లో హతమైన ముగ్గుర ఉగ్రవాదులు, అరెస్టైన ఇద్దరు నిందితులను NIA ఛార్జిషీట్‌లో పేర్కొంది. దాడి ప్రణాళిక, సహకారం, అమలులో పాత్ర ఉందనే ఆరోపణలతో లష్కరే తోయిబాను కూడా ఛార్జిషీట్‌లో పేర్కొన్నారు. 2025 ఏప్రిల్ 22న పహల్గామ్‌లో ఈ ఉగ్రదాడి జరిగింది. పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు ప్లాన్ ప్రకారం పర్యాటకుల్ని లక్ష్యంగా చేసుకుని 25 మందిని చంపారు. ఈ దాడిపై ముందుగా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ దర్యాప్తును NIAకి అప్పగించింది. ఈ కేసులో హఫీజ్ సయీద్‌కు సంబంధించిన చట్టపరమైన చర్యలు పూర్తైన తర్వాత కూడా కోర్టుకు హాజరుకాకుంటే, బీఎన్ఎస్ సెక్షన్ 356 కింద అతడిని పరారీలో ఉన్న నిందితుడిగా చూపిస్తూ కోర్టు విచారణ కొనసాగించే అవకాశం ఉంది.

# అన్నయ్య హీరో కాకముందే నేను ఆయన అభిమానిని

**అమరావతి, ఆగస్ట్ 22, అనంత జనశక్తి న్యూస్**

సినీ రాజకీయ ప్రముఖుల నుంచి మెగాస్టార్ చిరంజీవికి బర్త్‌డే విషెష్ వెలువెత్తుతున్నాయి. తెలుగు సినీ చరిత్రలో తనకంటూ ఓ ప్రత్యేక అధ్యాయం రాసుకున్న చిరు పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియాలో సందడి నెలకొంది. ఆయన సినిమా అప్‌డేట్స్, సినీప్రముఖుల విషెస్‌తో నిండిపోయింది. ఇక, అన్నయ్యతో ఉన్న అనుబంధాన్ని పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ గుర్తుచేసుకున్నారు. అందరికీ ఆయన మెగాస్టార్ అయితే తనకు మాత్రం 'ఏకైక హీరో' అని కొనియాడారు. ప్రస్తుతం ఈ పోస్టు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

**చిరు బర్త్‌డే వేళ పవన్ ఎమోషనల్ పోస్టు**

'కాలేజీ చదువు కోసం అన్నయ్య ఇంటికి దూరంగా ఉన్నారు. వేసవి సెలవులకు ఆయన ఇంటికి రావడం మాకు ఒక పండగలా ఉండేది. తిరిగి కాలేజీకి వెళ్లేటప్పుడు ఎంతో బాధపడే వాళ్లం. ఆయన మళ్లీ సెలవులకు వచ్చే వరకు ఇంట్లో ఆ సందడి ఉండేది కాదు. నేను స్కూల్లో చదివే రోజుల్లో అన్నయ్య పక్కన నడవడం



కూడా నాకు గర్వంగా ఉండేది. ప్రపంచంలోనే గొప్ప వ్యక్తి పక్కన నడుస్తున్నానని భావించే వాడిని. ఆయన హీరో కాకముందే నాకు హీరో. నేను ఆయనకు అభిమానిని. షూటింగ్‌ల కోసం ఇతర దేశాలు వెళ్లినప్పుడు ఎన్నో బహుమతులు తెచ్చేవాడు. ఎప్పుడూ మా సంతోషాన్నే కోరుకుంటాడు' అని పవన్ పేర్కొన్నారు.

అన్నయ్యకు పెళ్లి అయినప్పుడు ఎక్కడ మాకు దూరమవుతారేమోనని భయపడి ఒక గదిలో నిశ్శబ్దంగా ఏడ్చాను. అప్పుడు ఆయన వదినను నా దగ్గరకు తీసుకువచ్చి, 'ఇలా రా ఈరోజు నీకు ఒక పెద్ద మనిషిని పరిచయం చేస్తాను' అన్నారు. నేను ఎందుకు ఏడుస్తున్నానో చూసి వాళ్లిద్దరూ నవ్వుకున్నారు. అప్పటి నుంచి వాళ్లిద్దరూ నాపై చూపిస్తున్న ప్రేమను చెప్పడానికి నాకు పదాలు సరిపోవు. అన్నయ్య ఎన్నోసార్లు షూటింగ్‌లలో గాయపడ్డాడు. చెన్నై వేడి, ఉక్కపోతలో 18 గంటల కష్టపడి పనిచేసి అర్ధరాత్రి నిలబడటానికి కూడా ఓపిక లేని స్థితిలో ఇంటికి వచ్చేవాడు. ఆయన కష్టంపై ఆధారపడి బతుకుతున్నందుకు అప్పుడు చాలా బాధపడేవాడిని. ఎప్పుడూ నన్ను ఒక్కమాట కూడా అనలేదు. నాకు ఆయన మాత్రమే హీరో'' అంటూ చిరంజీవికి విషెస్ చెప్పారు.

**మీరే మా అందరికీ స్ఫూర్తి - అన్నా లెజినోవా**

అదే విధంగా పవన్ సతీమణి అన్నా లెజినోవా కూడా చిరంజీవికి పుట్టినరోజు శుభాకాంక్షలను తెలిపారు. 'ఎవరికి ఏ చిన్న సమస్య వచ్చినా ముందుగా గుర్తొచ్చేది చిరంజీవేనన్నారు. ఆయన పంచే ప్రేమ, బాధ్యత మా అందరికీ స్ఫూర్తి'గా నిలుస్తుందని ఈ సందర్భంగా అన్నా కొణిదెల పేర్కొన్నారు.

# వికసిత్ భారత్ లక్ష్యానికి యువతే వెన్నెముక

(మొదటి పేజీ తరువాయి)

అయితే రాజకీయాల్లోకి రావడానికి ముందు అనుభవం, స్థిరత్వం ఎంతో ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. 40 ఏళ్ల వయసు తర్వాత రాజకీయాల్లోకి రావడం మంచిదని, ముందుగా జీవితంలో అనుభవం, స్థిరత్వాన్ని సాధించుకుని ఆ తర్వాత రాజకీయాల్లోకి అడుగుపెట్టాలని సూచించారు.

వికసిత్ భారత్‌కు యువశక్తి, నారీశక్తి, కిసాన్ శక్తి, గరీబ్ కళ్యాణ్ నాలుగు ప్రధాన మూలస్తంభాలని ప్రమోద్ సావంత్ అన్నారు. గతంలో దేశంలోని ఎంతోమందికి బ్యాంకు ఖాతాలు కూడా లేవని, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం జనధన్ ఖాతాల ద్వారా ఆర్థిక వ్యవస్థలోకి ప్రజలను తీసుకువచ్చిందని పేర్కొన్నారు. ప్రస్తుతం 5G కనెక్టివిటీ కూడా అందుబాటులోకి వచ్చిందని, దేశం వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వ హయాంలో భారత్ వికసిత్ భారత్ 2047 లక్ష్యం వైపు అడుగులు వేస్తోందని సావంత్ అన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించడంలో యువతదే కీలక పాత్ర అని స్పష్టం చేశారు. కేవలం రాజకీయాల్లోకి రావడమే కాకుండా దేశ అభివృద్ధికి అవసరమైన విధానాల రూపకల్పనలోనూ యువత భాగస్వాములు కావాలని సూచించారు.

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాయి ప్రణీత్ రైతులకు సహాయం చేసేందుకు శ్రీకాకుళంలో పనిచేసిన విషయాన్ని కూడా ప్రస్తావించారు ప్రమోద్ సావంత్... ప్రజలకు, ముఖ్యంగా రైతులకు ఉపయోగపడేలా యువత పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి అభివృద్ధి, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ విషయంలో స్పష్టమైన విజన్‌తో ముందుకు వెళ్తున్నారని ప్రమోద్ సావంత్ పేర్కొన్నారు. ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాల్లో యువత కూడా భాగస్వాములు కావాలని అన్నారు.

దేశానికి పొలిటికల్ నాలెడ్జ్ ఉన్న యువత చాలా అవసరమని సావంత్ తెలిపారు. కేవలం రాజకీయాల్లోకి ప్రవేశించడం కాకుండా మంచి పాలసీలను రూపొందించగలిగే స్థాయికి యువత ఎదగాలని సూచించారు. సమాజంలో మార్పు తీసుకురావడంతో పాటు ఫలితాలు సాధించేలా పనిచేసే యువత అవసరమన్నారు. భవిష్యత్తులో యువత ఎంట్రప్రెన్యూర్లు, పాలసీ మేకర్లు, రాజకీయ నాయకులుగా ఎదగాలని ప్రమోద్ సావంత్ ఆకాంక్షించారు. దేశం కోసం బాధ్యతతో పనిచేసే, పారదర్శకతను పాటించే, ప్రజల పట్ల నిబద్ధత కలిగిన యువతే భారత్‌ను




ముందుకు తీసుకెళ్లగలదని ఆయన అన్నారు. యువశక్తిని సరైన విధంగా వినియోగించుకున్నప్పుడే వికసిత్ భారత్ 2047 లక్ష్యం సాకారం అవుతుందని పేర్కొన్నారు గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్..

# మెరిట్‌పైనే పోస్టులు ఇచ్చాం




(మొదటి పేజీ తరువాయి)

వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితుల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. సీఎం చంద్రబాబు నాయుడు ప్రాజెక్టు నిర్వాసితుల కోసం మూడో విడత కింద రూ.250 కోట్ల చెక్కును అందజేశారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 31వ తేదీన వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను ప్రారంభించబోతున్నామని అధికారికంగా ప్రకటించారు. 30 ఏళ్ల క్రితం అసాధ్యమనుకున్న వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణాన్ని సుసాధ్యం చేసి చూపించామని సీఎం పేర్కొన్నారు. 1996లో తానే స్వయంగా ఈ ప్రాజెక్టుకు శిలాఫలకం వేశానని, 2026లో దీనిని ప్రారంభించుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. 1995లో ముఖ్యమంత్రిగా ఆ ప్రాంతంలో పర్యటించినప్పుడు స్థానిక రైతులు సాగు, తాగునీరు అందించాలని విజ్ఞప్తి చేశారని గుర్తు చేసుకున్నారు. ప్రజల దాహార్తిని, సాగునీటి అవసరాలను తీర్చాలనే సంకల్పంతోనే గడచిన రెండేళ్ల కాలంలో ప్రాజెక్టు పనుల కోసం రూ.2,250 కోట్లు ఖర్చు చేసినట్లు స్పష్టం చేశారు. గతంలో ఎన్టీఆర్ ఫౌండేషన్ వేసిన పలు ప్రాజెక్టులను పూర్తి చేసి జాతికి అంకితం చేసే అవకాశం తనకు దక్కడం ఎంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం వల్ల రాజ్యంలో 50 శాతం లోటు వర్షపాతం నమోదైందని, శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాలకు ఆశించిన స్థాయిలో నీరు చేరలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అయినప్పటికీ.. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు నీరందించాలనే పట్టుదలతో పనిచేస్తున్నామని చెప్పారు.

# నిరుద్యోగులకు గుడ్ న్యూస్

(మొదటి పేజీ తరువాయి)




సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో వీటికి సంబంధించిన నోటిఫికేషన్లు విడుదల కానున్నాయి. గ్రూప్ 1లో 149 , గ్రూప్ 2లో 673 పోస్టులు ఉన్నాయి. విద్యాశాఖలో టీచర్ పోస్టులు సహా 2,995 ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు. అలాగే పోలీస్, అగ్నిమాపక శాఖ, జైళ్లు, అటవీ, పశు సంవర్ధక, విద్యుత్, ఎక్సైజ్, ఇంజినీరింగ్ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నాలుగు దశల్లో 10 వేల 60 ఉద్యోగాలు భర్తీ చేయనుండగా.. తొలిదశలో 1523 పోస్టులను భర్తీ చేయనున్నారు. దీనికి సంబంధించి ఏపీ ఉన్నత విద్యాశాఖ మే15నే నోటిఫికేషన్ జారీ చేసింది. రెండో దశలో 3,231 ఉద్యోగాలు భర్తీ చేస్తారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ సెప్టెంబర్ 15న విడుదల కానుంది. గ్రూప్ 1లో 149 పోస్టులతో పాటుగా, పోలీస్, అటవీ, పశుసంవర్ధక వంటి శాఖల్లో ఖాళీలను ఈ దశలో భర్తీ చేస్తారు. ఇక అక్టోబర్ 15న మూడో దశ నోటిఫికేషన్ విడుదల కానుంది. దశలో మొత్తం 2,311 పోస్టులను భర్తీ చేస్తారు. ఇందులో గ్రూప్2లో 673 పోస్టులతో పాటు, విద్యుత్, ఎక్సైజ్, ఇంజినీరింగ్ శాఖల్లోని ఖాళీలు భర్తీ చేస్తారు. నాలుగో దశలో 2,995 పోస్టులను భర్తీ చేస్తామని ప్రభుత్వం తెలిపింది. అక్టోబర్ 15వ తేదీన నాలుగో దశ నోటిఫికేషన్లు విడుదల కానున్నాయి. డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా టీచర్ పోస్టులతో పాటు మరికొన్ని పోస్టులను నాలుగోదశలో భర్తీ చేయనున్నారు. మరోవైపు సెప్టెంబర్ 15న విడుదల చేసే నోటిఫికేషన్ల ద్వారా (రెండో దశ) డిప్యూటీ కలెక్టర్, డీఎస్పీ, మున్సిపల్ కమిషనర్ వంటి పోస్టులను భర్తీ చేస్తారు. అలాగే 542 కానిస్టేబుల్ పోస్టులు, 182 ఎస్ఐ ఉద్యోగాలను భర్తీ చేస్తారు. 196 అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. మూడో దశలో 200 డిప్యూటీ తహసీల్దార్ పోస్టులు, 400 ఎక్సైజ్ కానిస్టేబుల్ ఉద్యోగాలు,224 ఏఈఈ పోస్టులను భర్తీ చేస్తారు. అలాగే విద్యుత్ సంస్థల్లో 629 ఏఈఈ ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు.

# మాజీ సీఎం జగన్‌కు డీఎస్సీ, ఏపీపీఎస్సీ తేడా తెలియదు

(మొదటి పేజీ తరువాయి)

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ శ్రేణుల్లో చాలామందిపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించిన లోకేశ్.. ఎక్కడెక్కడ అక్రమ కేసులు నమోదు చేశారో వాటన్నింటినీ రద్దు చేస్తామని స్పష్టం చేశారు. మరోసారి అధికారంలోకి వచ్చేందుకు వైసీపీ ప్రయత్నాలు చేస్తోందని, అయితే టీడీపీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. 'రెడ్ బుక్ తన పని తాను చేసుకుపోతుంది' అని వ్యాఖ్యానించారు.

మూడు పర్యాయాల పాటు టీడీపీ అధికారంలో ఉంటేనే రాష్ట్రంలో అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని సూచించారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కేడర్ సమావేశం అనంతరం 202324 సంవత్సరంలో 'భవిష్యత్ గ్యారంటీ' కార్యక్రమాన్ని విజయవంతం చేసి ఉత్తమ పనితీరు కనబరిచిన 100 మంది టీడీపీ కార్యకర్తలకు నారా లోకేశ్ ప్రశంసాపత్రాలు అందజేశారు. పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా కేడర్‌లో మరింత ఉత్సాహం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

**ఈ ఏడాది మరో 3వేల టీచర్ పోస్టుల భర్తీ: మంత్రి లోకేశ్**

రాష్ట్రంలో ఈ ఏడాది డీఎస్సీ ద్వారా మరో 3వేల పోస్టులు భర్తీ చేయబోతున్నామని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. విద్యామంత్రిగా తాను బాధ్యతలు చేపట్టాక రాష్ట్రంలో 10వేల స్కూళ్లలో వన్ క్లాస్ వన్ టీచర్ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చామని తెలిపారు. ఇప్పటికే డీఎస్సీ ద్వారా 16వేల టీచర్ పోస్టులు భర్తీచేశామని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థను దేశంలో నంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఉద్ఘాటించారు ఇందుకోసం ఉపాధ్యాయులు, అధికారులు, ప్రజాప్రతినిధులంతా కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈరోజు (శనివారం) విజయనగరం దాసన్నపేట జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి మంత్రి లోకేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు.

**అభ్యసనా ఫలితాలపైనే ఉపాధ్యాయులంతా దృష్టి సారించాలి..**

విద్యావ్యవస్థలో ప్రజాప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలు పూర్తి అయ్యాయని మంత్రి లోకేశ్ వెల్లడించారు. ఇక పూర్తిగా అభ్యసనా ఫలితాలపైనే ఉపాధ్యాయులంతా దృష్టిసారించాలని సూచించారు. ఇకపై నెలకోసారి క్లస్టర్ కాంప్లెక్స్ మీటింగ్‌లో పాల్గొని ఉపాధ్యాయుల క్షేత్రస్థాయి సమస్యలు తెలుసుకుంటానని చెప్పుకొచ్చారు. సంస్కరణల కారణంగా గత ఏడాది అద్భుతమైన ఫలితాలు వచ్చాయని వివరించారు. ఇది తొలిమెట్టు మాత్రమేనని అన్నారు. నూరుశాతం ఫలితాల సాధనపై దృష్టిసారించాలని ఆదేశించారు. ఇన్నోవేటివ్ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఒత్తిడి లేని విధంగా మెళకువలు నేర్పాలని దిశానిర్దేశం చేశారు.



**యువగళం పాదయాత్ర సమయంలో ఈ సంస్కరణల ఆలోచన..**

యువగళం పాదయాత్ర సమయంలో కర్నూలు జిల్లాలో తాను పర్యటిస్తున్న సమయంలో ఉపాధి కోసం పిల్లాపాపలతో వలస వెళ్లే కుటుంబాలను చూశానని మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. 'పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను గమనించాను. విద్యారంగంలో సంస్కరణలు తీసుకురావాలని ఆనాడే నిర్ణయించుకున్నా. అత్యంత సవాళ్లతో కూడిన విద్యాశాఖ ఎందుకని చాలామంది సన్నిహితులు నన్ను అడిగారు. సమాజంలో మార్పు తీసుకురావడం విద్య ద్వారానే సాధ్యమని నమ్మే వ్యక్తిని నేను. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులు గ్రామీణ పాంతాల్లో విభిన్న నేపథ్యం కలిగిన వారు అధికంగా ఉంటారు. వారిని జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది. విశాఖపట్నంలో ఓ ప్రైవేటు స్కూలు టీచర్ చిన్నారిపై చేయి చేసుకోవడంతో చిన్నారి చనిపోయిన బాధాకరమైన ఘటన నన్ను కలచివేసింది. పిల్లలను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉంది. కాలం మారింది. విద్యార్థులు ప్రశ్నించే రోజులు వచ్చాయి. క్రిటికల్, ఎనలిటిక్ థింకింగ్, అసెస్‌మెంట్, కరిక్యులమ్ మార్పులు, బెస్ట్ ప్రాక్టీసెస్ కోసం క్లస్టర్ మీటింగ్స్ నిర్వహిస్తున్నాం. చిన్నారులకు గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ అందించాల్సిన బాధ్యత మనపై ఉంది. ఉపాధ్యాయులు సమ్మేటివ్, ఫార్మేటివ్ టెస్ట్, ఫలితాలపై శ్రద్ధ వహించాలి' అని లోకేశ్ సూచించారు.

**ప్రతి శనివారం నో బ్యాగ్ డే గా ప్రకటించాం..**

'రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను సింగపూర్, ఫిన్లాండ్ పంపాం. అక్కడ టీచర్ల నేర్చుకున్న ఉత్తమ బోధనా పద్ధతులను రాష్ట్రంలో అమలుచేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి శనివారం నో బ్యాగ్ డే గా ప్రకటించాం. సంస్కరణల ఫలితంగా గత ఏడాది అద్భుతమైన ఫలితాలు సాధించాం, ఇది తొలిమెట్టు మాత్రమే. నూరుశాతం ఫలితాల సాధనే లక్ష్యంగా ప్రతి ఉపాధ్యాయుడు పనిచేయాలి. పిల్లలు ఆనందకరమైన, ఆటపాటల వాతావరణంలో చదువుకోవాలన్నదే నా ఆలోచన. మన ఆలోచనలు, విధానాలు విద్యార్థి కేంద్రంగా మాత్రమే ఉండాలి. లీప్ యాప్‌లో ప్రతి టీచర్ తమ సలహాలను నమోదు చేయాలి. క్రియేటివ్ క్లబ్, లీడర్‌షిప్ క్లబ్, లాంగ్వేజ్ క్లబ్, మ్యాథ్, సైన్స్ క్లబ్, గ్రీన్ క్లబ్, స్పోర్ట్స్ క్లబ్, యాంటీ డ్రగ్స్ క్లబ్ (ఈగల్ క్లబ్)లపై ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలి. క్రమం తప్పకుండా వృత్తిపరమైన అభివృద్ధి సెషన్ల ద్వారా ఉపాధ్యాయులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి' అని లోకేశ్ సూచించారు.

**మారుతున్న చిన్నారుల ఆలోచనను పసిగట్టాలి..**

'ఇటీవల ఒక కొడుకు సొంత తల్లిని చంపేశాడు. మరో చోట పిల్లలు టీచర్‌పై దాడిచేసిన ఘటన కూడా చోటు చేసుకుంది. జనరేషన్ల మధ్య సెన్సిటివిటీ పెరిగింది. మూడుతరాలు మారాయి. పిల్లలు మారుతున్నారు. వారి ఆలోచన విధానాన్ని అర్థం చేసుకోవాలి. ఇలాంటి పరిస్థితుల్లో నైతిక విలువల ఆవశ్యకతను గుర్తించి, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు ద్వారా విలువలతో కూడిన విద్యపై ప్రత్యేక పాఠ్యాంశాలు తయారు చేయించాం. ఇదే సమయంలో తల్లి దండ్రులు, మహిళలను గౌరవించడంపై విద్యార్థులకు చిన్నతనం నుంచే శిక్షణ ఇవ్వాలి. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించే టెక్నిక్స్‌పై టీచర్లు శ్రద్ధ వహించాలి. చేపట్టిన సంస్కరణల్లో కొన్నింటిలో లోపాలు ఉండొచ్చు. ఉపాధ్యాయులు లీప్ యాప్ ద్వారా తెలియజేస్తే సరిదిద్దుకుంటాం. ఇప్పటివరకు పకడ్బందీగా సంస్కరణలు తీసుకువచ్చాం, ఇక సంస్కరణలు ఉండవు, పూర్తిగా ఫలితాలపై మాత్రమే అందరూ దృష్టి పెట్టాలి. ప్రభుత్వ స్కూళ్లలో పనిచేసేవాళ్లంతా క్వాలిఫైడ్ టీచర్లు. అనేక కారణాల వల్ల జగన్ హయాంలో ఇబ్బందులు పడ్డారు. గత రెండేళ్లుగా ఉపాధ్యాయులపై బోధనేతర భారాన్ని పూర్తిగా తగ్గించాం. ప్రతి శుక్రవారం ఉపాధ్యాయుల సమస్యలు వింటున్నాం. ఇప్పుడు ఇక లెర్నింగ్ అవుట్ కమ్స్ పైనే శ్రద్ధ వహించాలి. కొంతమేర ఫలితాలు వచ్చాయి. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ ఫలితాలపై సంతృప్తి చెందడం లేదు. నూరుశాతం ఫలితాల సాధనే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలి, మీకు అండగా నేనుంటా, రాబోయే ఐదేళ్లలో దేశంలోని ఇతర రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా అత్యుత్తమ విద్యావిధానానికి అందరూ కలసికట్టుగా పనిచేయాలి' అని మంత్రి లోకేశ్ సూచించారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# కమీషన్ల కోసమే వివాదాలు

(మొదటి పేజీ తరువాయి)

బోడుప్పల్ పరిధిలోని తిరుమల మెడోస్, లక్ష్మీ గణపతి కాలనీ, హేమానగర్ కాలనీలకు చెందిన వందలాది మంది బాధితులు హరీష్‌రావును కలిసి తమ ఆవేదనను పంచుకున్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ, సర్వే నంబర్ 215, 215 పార్ట్‌లలో గత 30 ఏళ్లుగా ఎలాంటి వివాదాలు లేకుండా సుమారు 1,500 కుటుంబాలు ప్రశాంతంగా జీవిస్తున్నాయని తెలిపారు. అయితే, ఈ ఇళ్లను రాత్రికి రాత్రే కాంగ్రెస్ ప్రభుత్వం అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద 22A నిషేధిత జాబితాలో చేర్చడం అత్యంత దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. అత్యవసర కష్టాల్లో ఇళ్లను అమ్ముకుందామని రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వెళ్లినప్పుడు ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నాయని తెలియడంతో ప్రజలు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**కమీషన్ల కోసమే కృత్రిమ వివాదాలు.. బీఆర్ఎస్ పోరాట హెచ్చరిక**

చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ అయిన ఆస్తులను అడ్డుపెట్టుకుని ప్రజలపై ఒత్తిడి తెచ్చి 30 శాతం కమీషన్లు దండుకునేందుకే ప్రభుత్వం ఇలాంటి కృత్రిమ వివాదాలు సృష్టిస్తోందని హరీష్ రావు విమర్శించారు. దశాబ్దాలుగా నివాసముంటున్న ప్రజలకు 22A భయం చూపిస్తూ, బినామీలతో సెటిల్మెంట్లు చేసుకునే దందాకు తెరలేపారని ఆయన ధ్వజమెత్తారు. బోడుప్పల్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బాధితులెవరూ అధైర్యపడవద్దని, ఈ వసూళ్ల సర్కార్ మెడలు వంచైనా బాధితుల ఆస్తులను కాపాడే బాధ్యతను బీఆర్ఎస్ తీసుకుంటుందని హామీ ఇచ్చారు. మాటలు పక్కనబెట్టి, తక్షణమే ఆయా కాలనీలను 22A నిషేధిత జాబితా నుంచి తొలగించి ప్రజలకు న్యాయం చేయాలని, లేకపోతే బాధితుల పక్షాన పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# తెలంగాణ అభివృద్ధికి అడ్డంకులు

**హైదరాబాద్, ఆగస్ట్ 22, అనంతజనశక్తి న్యూస్**

తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందంటూ బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సీరియస్ అయ్యారు. రాష్ట్ర అభివృద్ధి కోసం విదేశీ పర్యటనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెళ్తే అనుమతి నిరాకరించడం కేంద్రం నిరంకుశత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ సందర్భంగా కేంద్రం తీరుపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. దీనిపై బీజేపీ రాష్ట్ర నాయకత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. 'పల్లె పల్లెకు పొన్నం అన్న పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలో మంత్రి పొన్నం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెబుతున్న 'వికసిత్ భారత్2047' లక్ష్యం నెరవేరాలంటే ప్రతి రాష్ట్రం అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. ఈ మేరకు తెలంగాణకు న్యాయంగా రావాల్సిన ఆర్థిక సహకారం, నిధుల విషయంలో కేంద్రం సానుకూలంగా వ్యవహరించాలని అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల కోసం రాష్ట్ర బీజేపీ నాయకులు ఎందుకు గళమెత్తడం లేదని మంత్రి ప్రశ్నించారు. కేంద్రం పక్క రాష్ట్రాలకు నిధులు ఇస్తున్నప్పుడు తెలంగాణకు నిధులు ఎందుకు ఇవ్వడం లేదని వారిని సూటిగా ప్రశ్నించారు. రాజకీయాలకు అతీతంగా తెలంగాణ ప్రయోజనాల కోసం కేంద్రంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు మంత్రి తెలిపారు. అదే విధంగా కేంద్రం కూడా రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం 'పల్లె పల్లెకు పొన్నం అన్న పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమాన్ని



చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో ప్రజలతో ముఖాముఖి సమావేశాలు నిర్వహించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు మంత్రి పొన్నం వెల్లడించారు.

# కంటిలో మూడు.. బాడీలో 200 పెల్లెట్లు..

## బాధితుడితో కలిసి పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగిన రాహుల్ గాంధీ

నీట్ యూపీ ప్రశ్నాపత్రం లీక్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ నాయకత్వంలో జరిగిన విద్యార్థుల ఆందోళనలతో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిన వచ్చిన సంగతి తెలిసిందే. అయితే, జులై 20 పార్లమెంట్ ముట్టడికి ప్రయత్నించిన విద్యార్థులు.. జంతర్ మంతర్ నుంచి ర్యాలీగా బయలుదేరడం ఉద్రిక్తతలకు దారితీసింది. ఈ సమయంలో విద్యార్థులపై లాఠీఛార్జ్, టియర్ గ్యాస్, పెల్లెట్లు ప్రయోగించారు. ఈ ఘటనపై తాజాగా బాధితుడితో కలిసి రాహుల్ గాంధీ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.



నీట్ యూజీ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా జులై 20న జరిగిన నిరసనల్లో విద్యార్థులపై లాఠీఛార్జ్, పెల్లట్లు ఉపయోగించమని ఎవరు ఆదేశాలిచ్చారో చెప్పాలని డిమాండ్ చేస్తూ ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు బాధితుడితో కలిసి వెళ్లారు. ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసేవరకు అక్కడ నుంచి కదిలేది లేదని ఆయన స్పష్టం చేశారు. అయితే, కేసు నమోదు చేయడానికి పోలీసులు నిరాకరించడంతో బాధితుడు సాహిల్ లోచాబ్‌తో కలిసి పోలీస్ స్టేషన్ వెలుపల రాహుల్ ధర్నాకు దిగారు. విద్యార్థుల నిరసన సమయంలో పోలీసులు, పారామిలిటరీ బలగాలు క్రూరంగా వ్యవహరించారనే ఆరోపణలపై పరిశీలనకు సుప్రీం కోర్టు ఒక ఉన్నతాధికార నిపుణుల కమిటీని ఏర్పాటు చేసినట్టు ఈ సందర్భంగా ఢిల్లీ పోలీసులు తెలిపారు. అయితే, ఎఫ్ఐఆర్ నమోదు అయ్యే వరకు కదలేది లేదని కాంగ్రెస్ ఎంపీ ఉద్ఘాటించారు.

''మేము విద్యార్థుల కోసం నిలబడతాం. న్యాయం కోసం పోరాడతాం. మేము మౌనంగా ఉండం.. ఎఫ్ఐఆర్ నమోదు చేసే వరకు డీసీపీ ఆఫీస్ వద్ద ధర్నా కొనసాగుతుంది'' అని కాంగ్రెస్ ఎక్స్ (ట్విట్టర్) లో పేర్కొంది. ఈ ధర్నాలో ప్రియాంకా గాంధీ కూడా పాల్గొన్నారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. జులై 20న జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సాహిల్‌పై పోలీసులు పెల్లెట్ గన్‌తో దాడి చేశారని, దానివల్ల అతడు ఒక కంటిని కోల్పోయే స్థితిలో ఉన్నాడని తెలిపారు. అయితే, నిరసనకారులపై పెల్లెట్ గన్‌లు తాము వాడలేదని ఢిల్లీ పోలీసులు ఖండించారు.

కానీ, వీటిని ఉపయోగించడంపై సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ ఇంకా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. కశ్మీర్‌లో నిరసనకారులపై 2010లో తొలిసారిగా ఉపయోగించిన పెల్లెట్ గన్‌లు, షాక్ బ్యాటన్‌లు జంతర్ మంతర్ వద్ద మోహరించిన సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ అల్లర్ల నియంత్రణ విభాగమైన రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఆయుధ సామగ్రిలో భాగం. ఢిల్లీ నిరసనల సమయంలో వీటి వాడకంపై సీఆర్పీఎఫ్ మౌనం వహించింది.

ఒక పెల్లెట్ గన్, 600 వరకు లోహపు లేదా రబ్బరు తూటాలు నింపిన కాట్రిడ్జ్‌లను పేలుస్తుంది. ఇవి సెకనుకు 1,000 అడుగుల వేగంతో విస్తృతంగా వ్యాపిస్తాయి. ప్రామాణిక కార్యాచరణ విధానం ప్రకారం.. ఈ గన్‌ను కనీసం 500 అడుగుల దూరం నుంచి కాల్చాలి. వీటిని గురిపెట్టే వారి నడుము కింది భాగాన్ని లక్ష్యంగా చేసుకోవాలి.

మీడియా సమావేశంలో రాహుల్ గాంధీ ఒక చిన్న ప్లాస్టిక్ బాక్స్‌లో ఉన్న పెల్లెట్లను చూపుతూ.. ''ఇవి ఆ బాధితుడి శరీరం నుంచి తీసిన పెల్లెట్లు. అతడి కంటిలో మూడు, శరీరంలో 200కి పైగా దూసుకెళ్లాయి'' ఎయిమ్స్, లేడీ హార్డింజ్ ఆసుపత్రి మెడికల్ రిపోర్టులను ఆధారంగా చూపించారు.

మరోవైపు, బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ రాహుల్ గాంధీ అరాచక రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. దీనిపై ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదై విచారణ జరుగుతోందని, సుప్రీంకోర్టు కమిటీ కూడా ఏర్పాటు చేసిందని, రాహుల్ గాంధీ చట్టాన్ని గౌరవించడం లేదని ఆరోపించారు.

అంతకుముందు, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు రాహుల్ గాంధీ లేఖ రాస్తూ.. శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులపై జరిగిన క్రూరమైన దాడికి జవాబుదారీతనం కోరారు. అలాగే, యువతపై పెల్లెట్ గన్‌లు సహా లాఠీఛార్జ్‌కు ఆమోదించారా? అని కూడా ప్రశ్నించారు. గత నెల వర్షాకాల సమావేశాల మొదటి రోజైన జులై 20న నీట్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తోన్న విద్యార్థులు పార్లమెంటువైపు మార్చ్ సందర్భంగా భద్రతా సిబ్బంది పెల్లెట్ గన్‌తో జరిపిన కాల్పుల్లో గాయపడిన సచిల్ లోచాబ్ (19)ను గాంధీ మీడియా ముందు ప్రదర్శించారు.

పోలీసుల క్రూరత్వానికి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ పోలీస్ స్టేషన్ ఎదుట చేపట్టిన ధర్నాను మీరు ఎలా భావిస్తున్నారు? మీ అభిప్రాయాన్ని కామెంట్లలో తెలియజేయండి.

# 10 ఇంచ్‌లు పిజ్జా ఆర్డర్ చేస్తే 7 ఇంచ్‌ల పిజ్జా డెలివరీ..

## రూ.10, 520 జరిమానా విధించిన కమిషన్

ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ యాప్‌లలో కనిపించే ఆఫర్లు, యాడ్స్ చూసి చాలా మంది తమకు నచ్చిన ఆహార పదార్థాలను ఆర్డర్ పెట్టుకుంటారు. అచ్చంగా ఇలాగే ఓ 10 ఇంచ్‌ల పెద్ద పిజ్జాను ఆర్డర్ పెట్టుకున్న ఓ వ్యక్తికి.. కేవలం 7 ఇంచ్‌ల పిజ్జాను మాత్రమే డెలివరీ చేశారు. దీంతో సదరు వినియోగదారుడు.. వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేయగా.. విచారణ జరిపి రెస్టారెంట్‌కు, ఫుడ్ డెలివరీ చేసిన యాప్‌కు భారీ జరిమానా వేసింది. ముఖ్యంగా రూ.10,520 ఫైన్ విధించింది. ఈ డబ్బును మొత్తం సదరు వినియోగదారుడుకే ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రకటనలో చూపించిన కొలతల కంటే తక్కువ సైజు వస్తువును అందించడం సేవా లోపంతో పాటు అనుచిత వ్యాపార విధానం కిందకే వస్తుందని కమిషన్ స్పష్టం చేసింది.

**అసలేం జరిగిందంటే..?**

ఉత్తరాఖండ్‌కు చెందిన ఓ వినియోగదారుడు ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ యాప్ ద్వారా రూ.505 విలువైన 10 ఇంచ్‌ల పిజ్జాను ఆర్డర్ చేశాడు. తీరా డెలివరీ అయిన తర్వాత చూస్తే అది కేవలం 7 ఇంచ్‌ల సైజు మాత్రమే ఉంది. అయితే ఆర్డర్ చేసిన దానికంటే 3 ఇంచ్‌లు చిన్నగా ఉండగా.. దీనిపై ఆయన వెంటనే డెలివరీ యాప్ సపోర్ట్ చాట్ ద్వారా ఫిర్యాదు చేశాడు. రీఫండ్ ఇవ్వాలని కోరాడు. అయితే అతనికి తక్కువ సైజు పిజ్జా వచ్చినప్పటికీ.. రీఫండ్ ఇచ్చేందుకు డెలివరీ సంస్థ నిరాకరించింది. ఈ ధోరణితో నిరాశ చెందిన వినియోగదారుడు జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్ (ఎన్‌సీహెచ్), అలాగే సీపీగ్రామ్స్ పోర్టల్ ద్వారా ఫిర్యాదులు చేయడమే కాకుండా లీగల్ నోటీసు కూడా పంపాడు. అక్కడ కూడా తనకు తగిన పరిష్కారం లేదా రీఫండ్ లభించకపోవడంతో.. చివరకు కస్టమర్ ఫోరమ్‌ను ఆశ్రయించి పిటిషన్ దాఖలు చేశాడు. ఈ కేసు విచారణ సమయంలో ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ తమ వాదనను వినిపిస్తూ.. తాము కేవలం రెస్టారెంట్లకు, వినియోగదారులకు నడుమ మధ్యవర్తిగా (ఇంటర్‌ఫేస్) మాత్రమే వ్యవహరిస్తున్నామని పేర్కొంది. ఆహారాన్ని తయారు చేయడం, ప్యాక్ చేయడం లేదా అమ్మడంలో తమకు నేరుగా ఎలాంటి పాత్ర లేదని సమర్థించుకునే ప్రయత్నం చేసింది. అయితే కమిషన్ అధ్యక్షుడు గగన్ కుమార్ గుప్తా, సభ్యులు డాక్టర్ అమరేష్ రావత్, రంజనా గోయల్‌లతో కూడిన ధర్మాసనం ఈ వాదనను తోసిపుచ్చింది. ఆర్డర్ చేసిన వస్తువుకు, చేరిన సరుకుకు తేడా ఉండటం స్పష్టమైన సేవా లోపమేనని నిర్ధారించింది. అందువల్ల రెస్టారెంట్, డెలివరీ యాప్ రెండూ



సంయుక్తంగా బాధ్యత వహించాలని స్పష్టం చేసింది.

**రూ.10,520 జరిమానా విధించిన కమిషన్**

మఖ్యంగా మానసిక, శారీరక వేధింపులకు గురిచేసినందుకుగాను నష్ట పరిహారంగా రూ.5,000, కోర్టు, లీగల్ ఖర్చుల కింద మరో రూ.5,000, పిజ్జా ధర రూ.505తో పాటు డెలివరీ ఛార్జీలు రూ.15 కలుపుకుని.. మొత్తంగా రూ.10,520 జరిమానా విధించారు. అయితే ఆర్డర్ చేసిన రోజు నుంచి 45 రోజుల్లోగా ఈ డబ్బు మొత్తాన్ని వినియోగదారుడికి ఇవ్వాలని రెస్టారెంట్ సహా డెలివరీ యాప్‌కు ఆదేశాలు జారీ చేసింది.

మీకు కూడా ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీలో ఇలాంటి సైజు తేడాలు ఎదురైన అనుభవం ఉందా? దయచేసి మీ అభిప్రాయాన్ని కామెంట్ బాక్స్‌లో పంచుకోండి.

# ఒక్క రోజే.. 400 కేసుల పరిష్కారం



: ఒక్క రోజులోనే సుప్రీంకోర్టు ప్రత్యేక లోక్ అదాలత్ 400 కేసులను పరిష్కరించింది. వేగవంతమైన న్యాయ పరిష్కారాలు అందించేందుకు సర్వోన్నత న్యాయ స్థానం మూడు రోజుల ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. 'సమాధాన్ సమరోహ్ 2026' పేరుతో చేపట్టిన ఈ ప్రత్యేక డ్రైవ్ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్మార్గదర్శకత్వంలో పని చేస్తోంది. ఇందులో భాగంగా మొదటి రోజైన శుక్రవారం 400 కేసుల్లో పరిష్కారాలు చూపింది. ఆదివారంతో ఈ లోక్ అదాలత్ ముగియనుంది.

పెండింగ్‌లో ఉన్న వివాదాలను స్నేహపూర్వకంగా పరిష్కరించుకోవడానికి వీలు కల్పించడమే ఈ ప్రత్యేక లోక్ అదాలత్ లక్ష్యమని సుప్రీంకోర్టు వెల్లడించింది. సర్వోన్నత న్యాయస్థానానికి చెందిన ఇద్దరు సిట్టింగ్ న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు, అడ్వొకేట్ ఆన్‌రికార్డ్ (AORలు), ఇతర న్యాయవాదులతో కూడిన 16 ప్రత్యేక లోక్ అదాలత్ బెంచ్‌లు ఈ డ్రైవ్‌లో పాల్గొన్నట్లు తెలిపింది. లోక్ అదాలత్‌లో మొదటి రోజు 600కు పైగా కేసులు పరిష్కారం కోసం లిస్ట్ కాగా.. వాటిలో 400కు పైగా కేసులను సామరస్యంగా పరిష్కరించినట్లు పేర్కొంది. వీటిలో వైవాహిక, ఆస్తి, వాహన ప్రమాద క్లెయిమ్‌లు, నష్టపరిహారం, కార్మిక వివాదాలు వంటివి ఉన్నాయి.

# సీఎం యోగి సహా 52మంది నేతలకు బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు..!

వచ్చే ఏడాది ఉత్తర్‌ప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలుజరగనున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కీలక నేతల భద్రతపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 52 మంది రాజకీయ నాయకులకు బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు సమకూర్చినట్లు సమాచారం. ఈ జాబితాలో సీఎం యోగి ఆదిత్యనాథ్ సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, బీఎస్పీ అధినేత్రి మాయావతి సహా పలువురు నేతలు ఉన్నట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి.

ఒక్కో బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధర రూ.10 లక్షలు ఉంటుందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. వీటిని పొందిన నేతల లిస్టులో 11 మంది రాష్ట్ర మంత్రులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని మరో 98 మంది నేతలు, ప్రముఖ వ్యక్తులకు వివిధ స్థాయిల్లో భద్రత కల్పించనున్నట్లు తెలిపాయి. మరోవైపు ఎన్నికల సన్నాహాల్లో భాగంగా వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిని, అభ్యర్థుల అవకాశాలను అంచనా వేయడానికి భాజపా సర్వేలు నిర్వహిస్తోంది.





# అత్యాచార కేసులో రూ.5 కోట్ల డిమాండ్.. సీఎం భార్యపై సంచలన ఆరోపణలు

పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ భార్య గుర్‌ప్రీత్ కౌర్‌పై సంచలన ఆరోపణలు వచ్చాయి. ఓ అత్యాచారం కేసులో నిందితుడికి అనుకూలంగా వ్యవహరించేందుకు ఆమె రూ.5 కోట్లు డిమాండ్ చేశారని పంజాబ్-హరియాణా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రంజిత్ సింగ్ ఆరోపించారు. ఈ మేరకు జాతీయ మానవ హక్కుల కమిషన్ కు ఆయన ఫిర్యాదు చేశారు. దీనిపై కమిషన్ స్పందించింది.

ఆరోపణలపై విచారణ జరిపి రెండు వారాల్లో నివేదిక సమర్పించాలని పంజాబ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీని ఆదేశించింది. ఈ అంశాన్ని కేంద్ర హోంశాఖలోని మహిళా భద్రత విభాగానికి సైతం పంపింది. అయితే.. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఈ ఆరోపణలపై పూర్తి వివరాలను పరిశీలించాలని ఎన్‌హెచ్ఆర్‌సీ సూచించింది.



ఈ కేసులో పోలీసులు తీసుకున్న చర్యలు, దర్యాప్తు జరిగితే దాని పురోగతి ఏంటి? తదితర అంశాలను నివేదికలో పొందుపరచాలని ఆదేశించినట్లు సమాచారం. నివేదిక అందిన తర్వాత తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోనున్నట్లు ఎన్‌హెచ్ఆర్‌సీ పేర్కొంది. ఈ ఆరోపణలపై గుర్‌ప్రీత్ కౌర్ అధికారికంగా స్పందించలేదు.

# ఝార్ఖండ్‌లో మరిన్ని ఉద్యోగ నియామకాల రద్దుపై హైకోర్టు స్టే



అక్రమాల ఆరోపణల నేపథ్యంలో ఝార్ఖండ్‌లో పలు ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను రద్దు చేసిన రాష్ట్ర సర్కారుకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఝార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ (జేఎస్ఎస్‌సీజీఎల్) పరీక్ష ద్వారా జరిగిన నియామకాలు, శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారుల (సీడీపీవోలు) నియామకాలను రద్దు చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లపై ఝార్ఖండ్ హైకోర్టు శుక్రవారం స్టే విధించింది. ఈ వ్యవహారంలో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసేందుకు ప్రభుత్వానికి సెప్టెంబరు 7 వరకు గడువిచ్చింది. అదే నెల 15కు తదుపరి విచారణను వాయిదా వేసింది. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్‌సీ) 11వ, 13వ విడత పరీక్షల ద్వారా జరిగిన నియామకాల రద్దు నోటిఫికేషన్ల అమలును హైకోర్టు గురువారం నిలిపివేసిన సంగతి తెలిసిందే. జేఎస్ఎస్‌సీజీఎల్ పరీక్ష ద్వారా నియమితులైన దాదాపు రెండు వేల మందికి, సీడీపీవోలకు న్యాయస్థానం తాజా ఉత్తర్వులతో ఊరట లభించినట్లయింది. ఉద్యోగ నియామకాలను రద్దు చేస్తూ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లతో ఇరకాటంలో పడ్డవారు రాంచీలో రాష్ట్ర సచివాలయం ఎదుట శుక్రవారం కూడా నిరసన కొనసాగించారు. 'మాకు న్యాయం చేయండి.. లేకపోతే ఉరి తీయండి' అంటూ నినాదాలు చేశారు.

# 'ఐఎన్ఎస్ జలాశ్వ'కు నవీకరణ పనులు



భారత నౌకా దళానికి చెందిన ప్రతిష్ఠాత్మక ల్యాండింగ్ ప్లాట్‌ఫాం డాక్ (ఎల్‌పీడీ) 'ఐఎన్ఎస్ జలాశ్వ' విశాఖలోని 'హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్)'కు చేరుకుంది. దాదాపు రెండు దశాబ్దాల నుంచి రక్షణ విభాగంలో సేవలందించిన ఈ నౌకలో హెచ్ఎస్ఎల్ అధునాతన సాంకేతికత అమర్చి నవీకరించనుంది. ఇది మొదట్లో అమెరికా నౌకా దళానికి చెందినది. ఆస్టిన్ శ్రేణి ల్యాండింగ్ ప్లాట్‌ఫాం డాక్ 'యూఎస్ఎస్ ట్రెంటన్' పేరు గల ఈ నౌక 1968 ఆగస్టు 3న జలప్రవేశం చేసింది. ఈ శ్రేణికి చెందినవి సైనికులు, యుద్ధ వాహనాలను సముద్ర మార్గం ద్వారా రవాణా చేసేందుకు వినియోగిస్తారు. దీన్ని భారత్ 2007లో అమెరికా నుంచి కొనుగోలు చేసింది. ఇందుకోసం దాదాపు రూ.228 కోట్ల వరకు వెచ్చించింది. భారత్‌కు తెచ్చిన తర్వాత 'యూఎస్ఎస్ ట్రెంటన్'కు 'ఐఎన్ఎస్ జలాశ్వ'గా పేరు పెట్టారు. 2007 జూన్ 22న కమిషనింగ్ చేసి, జాతికి అంకితం చేశారు. దీని బరువు 16,600 టన్నులు కాగా, పొడవు 173.7 మీటర్లు, వెడల్పు 28 మీటర్లు. ఇది ఆరు సీకింగ్ హెలికాప్టర్లు కలిగి ఉంటుంది. లోపల నాలుగు ఆపరేషన్ థియేటర్లు, 12 పడకల మెడికల్ వార్డు ఉంటాయి. వెయ్యి మందికి పైగా సైనికులుంటారు. ఈ నౌక 2004లో సునామీ విపత్తు సమయంలో సహాయ చర్యల్లో పాల్గొంది. 2011లో లిబియాలో ఐఎన్ఎస్ మైసూరు నౌకతో కలిసి సహాయ సేవలు అందించింది. 2020 కొవిడ్ సమయంలో మాల్దీవుల్లో (మాలే) చిక్కుకున్న భారతీయులను సురక్షితంగా తరలించింది. ప్రస్తుతం దీనికి హెచ్ఎస్ఎల్ యాజమాన్యం.. నౌకాదళ అధికారుల సమన్వయంతో ఆధునిక సాంకేతికత సమకూర్చి, పునర్వినియోగానికి సిద్ధం చేయనున్నారు.

# కణం వయసును అంచనా వేసే పరికరం



ఒక కణంలోని జన్యువుల క్రియాశీలతను విశ్లేషించడం ద్వారా దాని జీవసంబంధ వయసును అంచనా వేయగల పరికరాన్ని స్వీడన్‌కు చెందిన కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్, స్టాక్‌హోమ్ విశ్వవిద్యాలయ పరిశోధకులు రూపొందించారు. కణంలో ఏ జన్యువులు చురుగ్గా ఉన్నాయి, ఏవి నిశ్చలంగా ఉన్నాయో పాస్టా అనే ఈ పరికరం నిర్ధారించగలదు. ఇది కణాల వృద్ధాప్యాన్ని ప్రభావితం చేసే పదార్థాలను గుర్తించడంతోపాటు వయసు మళ్లిన, బలహీన కణాలను, స్టెమ్ సెల్ లాంటి కణాలను వేరు చేసి చూపగలదు. వృద్ధాప్యం అనేక వ్యాధులకు ప్రధాన కారకం అని తెలిసినా, కణాలు ఎంత వేగంగా వృద్ధాప్యానికి గురవుతున్నాయో సమర్థంగా అంచనా వేయగల పద్ధతులు కొరవడ్డాయని పరిశోధకులు తెలిపారు. అధిక జీవసంబంధ వయసున్న కణాలలో డీఎన్ఏ నష్టానికీ, కణంపై ఒత్తిడికి కారకమైన జన్యువులు.. ఎక్కువ చురుకుదనం ప్రదర్శిస్తున్నట్లు వారు కనుగొన్నారు. భవిష్యత్తులో వృద్ధాప్య సంబంధ వ్యాధులు, క్యాన్సర్ చికిత్సల కోసం అభ్యర్థులను గుర్తించడంలో పాస్టా పరికరం సహాయపడుతుందని పరిశోధకులు తెలిపారు.

# ముఖంపై తియ్యని మేలు సందేశం

ముఖానికి తేనెటీగలు కప్పేసిన ఈ దృశ్యం చూడగానే ఒళ్లు గగుర్పొడుస్తుంది. తేనెటీగల ప్రాముఖ్యత, మానవాళికి, వ్యవసాయ రంగానికి అవి చేసే మేలును ప్రపంచానికి తెలియజేయాలన్న ఉద్దేశంతో తమిళనాడులోని తిరునెల్వేలి జిల్లాకు చెందిన ఇసక్కిముత్తు అలియాస్ మురుగన్ అనే వ్యక్తి తన ముఖంపై ఇలా వేల తేనెటీగలను వాల్చుకుని రికార్డు నెలకొల్పారు. తిరునెల్వేలిలోని మరియా ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ఇందుకు వేదికైంది. ఐదు గంటల మూడు నిమిషాల పాటు వాటితో ఈయన ఇలాగే ఉన్నారు. ఇది



చైనా వరల్డ్ బుక్, చోళన్ వరల్డ్ బుక్‌లలో నమోదైంది. తగిన శిక్షణ లేకుండా ఎవరూ ఇలాంటి సాహసాలు చేయొద్దని ఆయన సూచించారు.



# పునరావృతం చేయలేరు

జరిగిన ఘటనలను పునరావృతం చేయాలని చాలా మంది అనుకుంటారు. ఆశించినట్లుగా వాటిని పునరావృతం చేయలేరు. అయినా ప్రయత్నాలను ఆపరు. మానవ ప్రవర్తనలో దీన్ని సహజమే అనుకోవచ్చు. వైఫల్యాలను పునరావృతం చేయాలని మనం ఎవ్వరమూ అనుకోం. కానీ కులాల లెక్కింపు విషయంలో మాత్రం ఇప్పుడు ఆ ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటివరకూ అనధికారికంగా వెల్లడైన సమాచారాన్ని పరిశీలిస్తే దీన్నంత తేలికగా కొట్టేయలేం. దేశంలో మంచు అధికంగా ఉండే ప్రాంతాల్లో రెండో దశ జనాభా లెక్కల ప్రక్రియ త్వరలో ప్రారంభం అవుతోంది. అక్కడ జనాభా సంఖ్యతో పాటు ఏ కులానికి చెందిన ప్రజలు ఎందరున్నారన్న సమాచారాన్ని కూడా సేకరించాలి. సెప్టెంబరు ఒకటి నుంచి లద్దాఖ్, జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో కొన్ని ప్రాంతాల్లో ఇది జరగాలి. దాదాపు 15 రోజుల సమయమే ఇంకా మిగిలి ఉంది. ఇంతవరకూ కులాల సమాచారాన్ని ఏ విధంగా సేకరిస్తారన్న విషయాన్ని స్పష్టంచేస్తూ నోటిఫికేషన్ విడుదల చేయలేదు. గతంలో ఎప్పుడూ ఇంత జాప్యం జరగలేదు. బహుశా ప్రక్రియ ప్రారంభానికి ముందు చాలా తక్కువ వ్యవధిలో దాన్ని జారీచేస్తే వివాదాలను బాగా పరిమితం చేయగలమన్న ఉద్దేశమే దానికి కారణం కావొచ్చు.

నోటిఫికేషన్ ఆలస్యం చేస్తున్నా జనాభాగణనలో పాల్గొనే సిబ్బందికి వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వటం దాదాపుగా పూర్తయింది. శిక్షణ సందర్భంగా ఒక విషయాన్ని స్పష్టంచేశారు. షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగల (ఎస్సీ, ఎస్టీ) విషయంలో గతంలో చేసినట్టే ఆయా కులాల, తెగల సమాచారాన్ని సేకరిస్తారు. అంటే కేంద్ర ప్రభుత్వం గుర్తించిన రాష్ట్రాల వారీ ఎస్సీ, ఎస్టీ జాబితాను అనుసరించి ఎవరు ఏ కులానికి చెందితే అక్కడ వారి సమాచారాన్ని నమోదుచేస్తారు. తాము ఎస్సీ వర్గానికి చెందినవారమని ఒక కుటుంబం చెబితే ఆ వర్గంలో ఏ కులమో తెలుసుకుని ఫాంలో సంబంధిత బ్రాకెట్‌లో టిక్కు పెట్టుకుంటారు. ఎస్టీల విషయంలోనూ అదే చేస్తారు. మరి వెనుకబడిన కులాల (బీసీలు) విషయంలో దీన్నే చేస్తారా అంటే? ఇప్పటివరకూ వస్తున్న సమాచారం ప్రకారం అలా చేసే అవకాశం కనపడటం లేదు. కేంద్ర జాబితాలో బీసీ కులాల సంఖ్యకు, రాష్ట్రాల జాబితాలోని బీసీ కులాల సంఖ్యకు చాలా తేడా ఉంది. ఉదాహరణకు తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం 133 కులాలను బీసీలుగా గుర్తిస్తే కేంద్ర జాబితాలో 90 కులాలు మాత్రమే ఉన్నాయి. మహారాష్ట్ర ప్రభుత్వం 346 కులాలను బీసీలుగా గుర్తిస్తే కేంద్రం మాత్రం 261నే పరిగణనలోకి తీసుకుంది. కాబట్టి తన జాబితా ప్రకారం బీసీల జనాభాను కులాల వారీగా గుర్తించటానికి కేంద్రానికి ఇబ్బందులు ఉన్నాయి. ఒకవేళ అలా చేస్తే కొన్ని వందల కులాలు ఆ జాబితాకు బయటే ఉండిపోతాయి. పోనీ రాష్ట్రాల వారీ బీసీల జాబితాను పరిగణనలోకి తీసుకుని వాటి ప్రకారం విడివిడి కులాల జనాభా లెక్కలను సేకరిస్తే వాళ్లందరినీ కేంద్ర బీసీ జాబితాలో చేర్చాలనే డిమాండు వెంటనే ఊపందుకుంటుంది. దాన్ని ఎదుర్కొని సమస్యను పరిష్కరించటానికి కేంద్రం సిద్ధంగా లేదు. బీసీల వర్గీకరణకు ఏర్పాటుచేసిన జస్టిస్ రోహిణి కమిషన్ ఇచ్చిన నివేదికకే ఇంతవరకూ అతీగతీ లేదు. 2017లో ఏర్పాటైన ఆ కమిషన్‌కు నివేదిక ఇవ్వటానికే ఆరేళ్లు పట్టింది. దాని సిఫార్సులు ఏమిటో ఇప్పటికీ బయటపెట్టలేదు. రిజర్వేషన్లకు బయట ఉన్న కులాలన్నిటినీ అగ్రకులాలే అనుకుంటే అవన్నీ వివిధ రాష్ట్రాల్లో వేర్వేరు పేర్లతో ఉన్నాయి. అక్కడి ఎస్సీ, ఎస్టీ, బీసీ జాబితాలను పరిగణనలోకి తీసుకుని ప్రతి రాష్ట్రానికి నిర్దిష్టంగా అగ్రకుల జాబితానో, నాన్ రిజర్వేషన్ కేటగిరీ జాబితానో రూపొందించాలి. దీనికి కేంద్రం ఆమోదముద్ర వేయాలి. దానికీ ఇప్పటికిప్పుడు సిద్ధంగా లేదని తెలుస్తోంది.

ఈ సమస్యలన్నిటినీ దృష్టిలో ఉంచుకుని గతాన్నే పునరావృతం చేయాలన్న నిర్ణయానికి కేంద్రం వచ్చినట్లు తెలుస్తోంది. 2011లో ఆనాటి యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (యూపీఏ) ప్రభుత్వం బీసీ జనాభా ఎంతో తేల్చాలన్న డిమాండుకు తలవొగ్గి సామాజిక, ఆర్థిక, కుల గణన (ఎస్ఈసీసీ)ను చేపట్టింది. ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ పెద్దను తమ కులం ఏమిటో చెప్పాల్సిందిగా కోరింది. తమ కులం పేరు గురించి తాము ఏమనుకుంటున్నారో అదే పొల్లుపోకుండా వారు చెప్పారు. వారు ఏది చెబితే దాన్ని గణన సిబ్బంది రాసుకున్నారు. కొందరు ప్రధాన కులం పేరు చెప్పారు. మరికొందరు ఉపకులం పేరు చెప్పారు. కులానికి చెందిన ప్రాంతనామాన్ని చెప్పినవారూ ఉన్నారు. గోత్రాన్ని చెప్పటానికే కొందరు పరిమితమయ్యారు. చాలామంది తాము ఫలానా వారమని ఇంటిపేర్లు చెప్పారు. ఇట్లా ప్రజలు ఏది చెబితే దాన్ని నమోదుచేసుకున్నారు. వాటన్నిటినీ పరిశీలిస్తే 45 లక్షల పైచిలుకు పేర్లు వచ్చాయి. ఇవన్నీ మీ కులం ఏమిటి? అన్న సాధారణ ప్రశ్నకు వచ్చిన స్పందనలు. ఇట్లా ఎందుకు నమోదు చేసారంటే, ప్రజలు తమ కులం గురించి తాము చెప్పకున్న దాన్నే ప్రామాణికంగా తీసుకోవాలనీ, మీది ఫలానా కులమని చెప్పాలని ప్రభుత్వం వారిని బలవంతం చేయలేదనీ సమర్థించుకున్నారు. ప్రజలు చెప్పినదాన్ని యథాతథంగా నమోదుచేస్తే చిక్కులు రావా? అన్న ప్రశ్న ఆనాడూ వచ్చింది. ఆ చిక్కులను విడదీసి ప్రామాణికంగా కులాల లెక్కలను తేల్చటానికి నిపుణుల కమిటీని వేయాలని కూడా నిర్ణయించుకున్నారు. అట్లా ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ పనగారియ సారథ్యంలో (2015 జూలై) కమిటీని వేశారు. పార్లమెంటులో అడిగిన ఒక ప్రశ్నకు జవాబిస్తూ పనగారియా కమిటీ దాదాపుగా తనకు అప్పగించిన పనిని పూర్తిచేసిందని కేంద్ర ప్రభుత్వం సమాధానం కూడా ఇచ్చింది. ఇంతగా ఊరించి చివరికి 45 లక్షల పైచిలుకు పేర్లు ఎందుకూ పనికిరావని స్వయంగా సుప్రీంకోర్టుకు కేంద్రం తెలియచేసింది. ప్రజలు ఇచ్చిన సమాచారం ఆధారంగా ప్రామాణిక కులాల జాబితాను తయారుచేయలేమనీ కనీసం బీసీల సంఖ్యను కూడా తేల్చలేమని ఒక అఫిడవిట్‌ను సమర్పించింది. తమ దగ్గర ఉన్న జాబితా తప్పులతడక అని కేంద్రమే స్వయంగా చెప్పటంతో ఎస్ఈసీసీ నివేదిక కావాలని మహారాష్ట్ర ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. రూ. 5,000 కోట్లకు పైగా ఖర్చుపెట్టి చేసిన దేశవ్యాప్త కులగణన ఎందుకూ పనికిరాకుండా పోయింది. అయితే కులాన్ని మినహాయించి ఆర్థిక, సామాజిక పరిస్థితులపై ఎస్ఈసీసీలో లభ్యమైన సమాచారం.. ప్రభుత్వ పథకాల అమలుకు బాగా పనికివస్తుందని పేర్కొంటూ దాన్ని అందరికీ అందుబాటులో ఉంచింది. ప్రజలు తమ కులం ఏదో తమంతట తాము చెప్పేదాన్నే పరిగణనలోకి తీసుకోవటం వల్ల ఎస్ఈసీసీ విఫలమైందని గట్టిగా వాదించిన కేంద్రం మరి ఇప్పుడు అదే విధానాన్ని ఎందుకు అవలంబిస్తోందన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. కృత్రిమమేధతో పాటు సంక్లిష్ట సమాచారాన్ని విశ్లేషించటానికి ఇప్పుడున్న సాంకేతిక పరిజ్ఞానంతో ఆ తరహా చిక్కుముడుల నుంచీ గట్టెక్కుతామని కేంద్ర అధికారులు చెబుతున్నారు.

భవిష్యత్తులో చిక్కుముడులు వీడతాయా? చరిత్ర పునరావృతం అవుతుందా? అన్నది సాంకేతిక పరిజ్ఞానంపైనే ఆధారపడి ఉండదు. రాజకీయ ప్రయోజనాలే సమాచార విశ్లేషణలను నిర్దేశిస్తాయి. కులగణను చాలా కాలం బీజేపీతో పాటు ఆరెస్సెస్ కూడా తీవ్రంగా వ్యతిరేకించింది. 2024 లోక్‌సభ ఎన్నికల నాటికి కులగణననూ, ఆయా కులాల జనాభా సంఖ్యకు అనుగుణంగా రిజర్వేషన్లు ఉండాలనే డిమాండ్లనూ కాంగ్రెస్ పార్టీ బలంగా ముందుకు తేవటంతో బీజేపీ దృక్పథంలో మార్పు వచ్చింది. అనూహ్యంగానే కేంద్ర మంత్రివర్గం జనాభా లెక్కలతో పాటు కులగణనను కూడా చేపట్టాలని నిర్ణయించింది. అంతకుముందు కేరళలో జరిగిన ఆరెస్సెస్ సమావేశంలో కూడా కులగణనపై సాగిన సానుకూల చర్చలూ అందుకు దోహదం చేశాయి. హిందూత్వ భావన పునాదిగా ప్రజల్లో ఏకీకరణ రావటానికి కులాలు అడ్డంకిగా ఉన్నాయన్న అంచనా ఆరెస్సెస్‌లో ఒకప్పుడు బలంగా ఉండేది. కులంపోవాలి.. మతం మిగలాలి.. ప్రజల మధ్య సాంస్కృతిక ఐక్యత మతం ఆధారంగా జరగాలి.. అన్నదే సంఘ్ పరివార్ సిద్ధాంత భూమికగా చలామణి అయింది.

# విద్యలో డిజిటల్ అంతరాన్ని తగ్గించాలి

డిజిటల్ ఇండియా కార్యక్రమం 2026 జూలై 1 నాటికి విజయవంతంగా పదకొండు సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ కాలంలో దేశవ్యాప్తంగా డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) గణనీయంగా విస్తరించింది. గ్రామీణ బ్రాడ్‌బ్యాండ్ సేవల విస్తరణ, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, ఈ–పాలన, దేశీయ ఎలక్ట్రానిక్ తయారీ వంటి రంగాల్లో విశేష పురోగతి సాధించింది. ఈ విజయాలు ప్రశంసనీయమైనవే. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలోనూ, కోట్లాది మంది పౌరులను డిజిటల్ వ్యవస్థలో భాగస్వాములను చేయడంలోనూ ఇవి కీలక పాత్ర పోషించాయి. తెలుగు రాష్ట్రాలు కూడా డీపీఐని వినియోగించుకోవడంలో గణనీయమైన పురోగతిని సాధించాయి. డిజిటల్ పాలన, ఆర్థిక సమ్మిళితత, ఇంటర్నెట్ అనుసంధానాన్ని విస్తరించడంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ముందడుగు వేశాయి. అయినా, నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం ఈ రెండు రాష్ట్రాల్లోనూ డిజిటల్ వ్యవస్థ ప్రధానంగా



పట్టణ ప్రాంతాల్లోనే కేంద్రీకృతమై ఉంది. తెలంగాణలో డిజిటల్ అభివృద్ధి ఎక్కువగా నగరాలకే పరిమితమవగా, ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్నెట్ వినియోగం పెరిగినా గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ విద్యా ఫలితాల్లో అసమానతలు కొనసాగుతున్నాయి. ఇంకా అనేక ప్రభుత్వ పాఠశాలల్లో తగిన కంప్యూటర్ ల్యాబ్‌లు, విశ్వసనీయమైన ఇంటర్నెట్ సౌకర్యం, ఆధునిక డిజిటల్ అభ్యాస వనరులు అందుబాటులో లేవు. ఈ పరిస్థితిని వెంటనే సరిదిద్దకపోతే గ్రామీణ విద్యార్థులు ఉన్నత విద్య, ఉపాధి అవకాశాల్లో మరింత వెనుకబడే ప్రమాదం ఉంది.

అందుబాటులో ఉన్న అన్ని మార్గాలనూ వినియోగించి విద్యార్థులకు డిజిటల్ సౌకర్యాలు కల్పించేందుకు రెండు రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి. ప్రజా గ్రంథాలయాలు, డిజిటల్ అభ్యాస కేంద్రాలు, కమ్యూనిటీ కంప్యూటర్ కేంద్రాలు విస్తృత స్థాయిలో ఏర్పాటు చేస్తే మరింత మంది విద్యార్థులకు సాంకేతికత అందుబాటులోకి వస్తుంది. ప్రైవేటు సంస్థలు, విశ్వవిద్యాలయాలు, సేవా సంస్థల భాగస్వామ్యంతో వెనుకబడిన ప్రాంతాల్లో డిజిటల్ మౌలిక సదుపాయాలను వేగంగా అభివృద్ధి చేయవచ్చు. అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యాసంస్థలకు అధిక వేగం గల ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించాలి. అలాగే డిజిటల్ తరగతి గదులు, స్మార్ట్ బోర్డులు, ఆన్‌లైన్ అభ్యాస వేదికలను ప్రోత్సహించాలి. ఈ పరికరాలు ఏడాది పొడవునా వినియోగంలో ఉండేలా వాటి నిర్వహణకు కూడా తగిన ప్రాధాన్యం ఇవ్వాలి.

విద్యా సంస్థలు ప్రాంతీయ భాషల్లో డిజిటల్ పాఠాలు, వీడియోలు, వర్చువల్ ల్యాబ్‌లు, పరస్పర క్రియాశీల అభ్యాస మాడ్యూళ్లను అభివృద్ధి చేయాలి. స్థానిక అవసరాలకు అనుగుణమైన డిజిటల్ విద్యా కంటెంట్ లేకపోవడం కూడా సాంకేతికతను బోధన–అభ్యాసన ప్రక్రియలో సమర్థవంతంగా వినియోగించడంలో ప్రధాన అవరోధంగా ఉంది. ప్రస్తుతం చాలా తక్కువ మంది ఉపాధ్యాయులే డిజిటల్ సాంకేతికతను అర్థవంతంగా తరగతి గదుల్లో వినియోగిస్తున్నారు. వీరిలో కూడా చాలామంది తగిన శిక్షణ, అనుభవం లేకపోవడం వల్ల దానిని బోధనలో సమర్థవంతంగా అనుసంధానించలేకపోతున్నారు. అందువల్ల ఉపాధ్యాయులకు నిరంతర వృత్తిపరమైన డిజిటల్ శిక్షణా కార్యక్రమాలను నిర్వహించి, నైపుణ్యాలను అందించాలి. డిజిటల్ అంతరాన్ని తగ్గించడానికి ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, ప్రైవేటు రంగం, పౌర సమాజం సమష్టిగా, దీర్ఘకాలిక దృష్టితో కృషి చేయాలి.

# ఎవరికీ పట్టని ప్రజారోగ్య భద్రత!

కాలం కలిసిరాక పెద్ద జబ్బు ఏదైనా చేసిందంటే, ఆరోగ్యం బాగుపడేసరికి కష్టార్జితాలు హరించుకుపోయి అప్పులు మిగులుతాయని ఎంతోమంది బెంగటిల్లుతుంటారు. అదే ప్రభుత్వ వైద్య వ్యవస్థ పటిష్ఠంగా ఉండి ఉంటే సామాన్యులు ఇంతగా భయపడరు. కానీ, దురదృష్టవశాత్తు దశాబ్దాలుగా దేశీయ సర్కారీ ఆసుపత్రులు మౌలిక వసతుల కొరతతో కునారిల్లుతున్నాయి. దాంతో మరో గత్యంతరం లేక ప్రాణం మీదకొచ్చినప్పుడు ప్రైవేట్ హాస్పిటళ్లను ఆశ్రయిస్తున్న కుటుంబాలెన్నో ఆర్థికంగా చితికిపోతున్నాయి. దీనిపై పార్లమెంటరీ స్థాయీసంఘమూ తాజాగా తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. జాతీయ నమూనా సర్వే ప్రకారం- ప్రభుత్వాసుపత్రులతో పోలిస్తే, ప్రైవేట్‌లో వైద్యానికి ఎనిమిది రెట్లు ఎక్కువగా ఖర్చవుతోంది. మిగిలిన రాష్ట్రాల్లో కంటే తెలంగాణలో సగటు వైద్య వ్యయభారం అధికంగా ఉన్నట్లు అధికారిక నివేదికలు పేర్కొంటున్నాయి. తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర, ఏపీ వంటి చోట్లా చికిత్సల ఖర్చులు





తడిసిమోపెడవుతున్నాయి. వాటివల్ల ఏటా అనేక కుటుంబాలు పేదరికంలోకి జారిపోతున్నాయి. ఈ దురవస్థను తప్పించాలంటే, పార్లమెంటరీ కమిటీ సూచించినట్లు- ప్రజారోగ్య భద్రతకు కేటాయింపులు పెంచి, ప్రభుత్వాసుపత్రులను బలోపేతం చేయాలి!

జాతీయ నమూనా సర్వే ప్రకారం 201718లో పదిహేను రోజుల వ్యవధిలో ఏదో ఒక రుగ్మత బారినపడినవారు దేశవ్యాప్తంగా 7.5శాతం మంది ఉంటే, 2025లో అలాంటివారి సంఖ్య 13.1శాతానికి చేరింది. వాతావరణ విపరిణామాలు, జీవనశైలి మార్పులతో కొన్నేళ్లుగా వ్యాధుల ముట్టడి తీవ్రతరమైంది. అలా నానాటికీ పెరుగుతున్న రోగుల తాకిడిని తట్టుకునే స్థాయికి మన వైద్య వ్యవస్థ నేటికీ ఎదగలేదు. ప్రపంచ ఆరోగ్యసంస్థ లెక్కల ప్రకారం ప్రతి వెయ్యి మందికి 3.5 పడకలు ఉండాలి. ఇండియాలో అవి 1.3కే పరిమితమయ్యాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనైతే అవి 0.79 దగ్గరే ఉన్నాయి. అందుకే, ఒకే బెడ్డుపై ఇద్దరు ముగ్గురికి చోటుకల్పించాల్సిన దౌర్భాగ్య పరిస్థితులు తాండవిస్తున్నాయి. ఇంకోపక్క గ్రామీణ భారతంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో నిపుణులకు దాదాపు 80శాతం కొరత నెలకొంది. బీదసాదలకు, వయోధికులకు వైద్య బీమా రక్షణ కల్పించేందుకు ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేసున్నారు. కానీ, ప్రైవేట్‌లో ప్రీమియంలు దిగువ మధ్యాదాయ వర్గాలకు అలవిగాకుండా ఉంటున్నాయి. ఒకవేళ బీమా ఉన్నా ఆసుపత్రి బిల్లులకు పూర్తిస్థాయిలో కవరేజీ దక్కట్లేదు. వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఔషధాలకు రోగులు సొంతంగా భారీగా వెచ్చించాల్సి వస్తోంది. సర్కారీ వైద్యాలయాల రాత మారనంతకాలం జనం జేబులకు ఇలా చిల్లుపడుతూనే ఉంటుంది!

జీడీపీలో కనీసం 2.5శాతం మొత్తాన్ని ప్రజారోగ్యానికి కేటాయించాలని జాతీయ ఆరోగ్య విధానం ఏనాడో సూచించింది. 202122లో అది 1.84శాతానికి చేరితే ఆ తరవాతి ఏడాదిలో 1.43శాతానికి తరిగిపోయింది. ప్రభుత్వ ఆసుపత్రుల దైన్యం కారణంగానే మొత్తం వైద్యఖర్చుల్లో 43శాతాన్ని ప్రజలు సొంతంగా భరించాల్సి వస్తోంది. ప్రపంచ సగటు 20శాతంతో పోలిస్తే ఇది చాలా ఎక్కువ! సాధారణ కుటుంబాల స్థితిగతులను తలకిందులు చేస్తున్న ఈ బరువు తగ్గాలంటే సర్కారీ వైద్యాలయాల్లో పోస్టులన్నింటినీ భర్తీ చేయాలి. వాటిలో అత్యాధునిక పరికరాలనూ ప్రయోగశాలలను ఏర్పాటు చేసి, అవి సక్రమంగా పనిచేసేలా జాగ్రత్త వహించాలి. అత్యవసర ఔషధాలను అనునిత్యం అందుబాటులో ఉంచాలి. ప్రైవేట్‌లో చికిత్సలు, ల్యాబ్ పరీక్షల ధరలు అదుపులో ఉండేలా చూడాలి. వీటితోపాటు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే నకిలీ వైద్యులపై ఉక్కుపాదం మోపడమూ అత్యావశ్యకమే!

# ఎక్కడ చూసినా అదే అవినీతి!

'భారతదేశానికి ఉక్కుచట్రం వంటివి సివిల్ సర్వీసులు' అన్నారు సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్. ఆయన ఆశయాలకు అనుగుణంగా, రాజకీయాలకు అతీతంగా, దేశ ప్రగతికి వెన్నెముకలా నిలవాల్సిన అఖిల భారత సర్వీసులు క్రమేణా కళావిహీనం అవుతున్నాయి. సర్కారీ పదవులనూ అధికారాలనూ అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా కోట్లు సంపాదించేవారి సంఖ్య పెరిగిపోతోంది. దేశవ్యాప్తంగా పలువురు ఉన్నతాధికారులే లక్ష్యంగా సీబీఐ, ఈడీ, రాష్ట్రాల అవినీతి నిరోధక శాఖలు ఇటీవల చేస్తున్న దాడులే ఈ అవినీతి క్యాన్సర్ విశ్వరూపాన్ని బట్టబయలు చేస్తున్నాయి.దేశంలో అవినీతి మహమ్మారి చాపకింద నీరులా ఉన్నతస్థాయి అధికారగణంలోనూ విస్తరిస్తోంది. వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలకు చెందిన 1,281 మంది ఉద్యోగులపై లంచం, అవినీతి ఆరోపణల కింద సీబీఐ కేసులు పెట్టిందని కేంద్రం లోగడ రాజ్యసభలో వెల్లడించింది. ఒక్క సీబీఐ దగ్గరే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు సంబంధించి 110కి పైగా అవినీతి కేసులు పెండింగ్‌లో ఉన్నట్టు లెక్కలు చెబుతున్నాయి. ఈ అవినీతి జాడ్యం తెలుగు రాష్ట్రాలు సహా దేశమంతటా పాకినట్లు ఇటీవల వెలుగుచూస్తున్న ఘటనలే నిర్ధారిస్తున్నాయి. రాజస్థాన్‌లో జల్‌జీవన్ మిషన్ టెండర్ల కుంభకోణంలో ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు రావడంతో ఒక రిటైర్డ్ ఐఏఎస్ అధికారిని ఏసీబీ అరెస్టు చేసింది. ప్రజలకు తాగునీటిని అందించే పథకాన్నిసైతం వదలకుండా... ప్రైవేటు సంస్థలు నకిలీ సర్టిఫికెట్లతో



కాంట్రాక్టులు దక్కించుకునేలా చేసేందుకు భారీగా లంచాలు తీసుకున్నారన్నది ఆయనపై అభియోగం. ఛత్తీస్‌గఢ్‌లో ఆర్థిక నేరాల విచారణ సంస్థ, ఏసీబీ కలిసి సస్పెండ్ అయిన ఓ ఐఏఎస్ అధికారిపై దర్యాప్తు సాగించాయి. గనులు, ఖనిజాలశాఖ డైరెక్టర్‌గా ఉన్నప్పుడు ఆయన బొగ్గు పన్నుల పేరిట వసూళ్ల మాఫియాను, మనీలాండరింగ్ నెట్‌వర్క్‌ను నడిపినట్లు ఆరోపణలు వచ్చాయి. బిహార్‌లో కాంట్రాక్టుల కోసం కమీషన్లు వసూలు చేస్తున్న ఒక పెద్ద నెట్‌వర్క్‌ను స్పెషల్ విజిలెన్స్ విభాగం బట్టబయలు చేసింది. ఈ వ్యవహారంలో ఇద్దరు ఐఏఎస్ అధికారులు సస్పెండ్ అయ్యారు. హరియాణాలో సుమారు రూ.504 కోట్ల నిధుల దుర్వినియోగం కేసులో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేసిన ఓ ఐఏఎస్ అధికారిని సీబీఐ అరెస్టు చేసింది.

నీరుగారిపోతున్న చట్టాలు

ఇండియన్ పోలీస్ సర్వీస్ సైతం అవినీతి మహమ్మారికి మినహాయింపు కాదు. పంజాబ్‌లోని రోపర్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా పనిచేసిన ఐపీఎస్ అధికారి ఒకరు సీబీఐ వలలో చిక్కారు. ఒక పాత కేసును సెటిల్ చేయడానికి తుక్కు డీలర్ నుంచి మధ్యవర్తి ద్వారా రూ.8లక్షల లంచం తీసుకుంటూ పట్టుబడ్డారాయన. తరవాత ఆ అధికారి నివాసంలో జరిగిన దాడుల్లో రూ.5కోట్ల నగదు, కిలోన్నర బంగారం, అక్రమ ఆయుధాలు లభ్యమయ్యాయి! మధ్యప్రదేశ్‌లో ఇటీవల ఒక పెద్ద కుంభకోణం వెలుగుచూసింది. కొందరు సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కలిసి ఒకే గ్రామంలో, ఒకేసారి రెండు వేల హెక్టార్ల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసినట్లు వెల్లడైంది. వారు భూములు కొన్న 16 నెలలకే, వాటికి కేవలం 500 మీటర్ల దూరంలో రూ.3,200 కోట్ల వ్యయంతో హైవే బైపాస్ నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తమకున్న ముందస్తు అధికారిక సమాచారంతో ఆ భూములను కొని వారు రూ.5060 కోట్ల మేర లాభం ఆర్జించారు. కొద్దిరోజుల క్రితం తెలంగాణలో ఏసీబీ బృందాలు ఓ డీఎస్పీ ఇంట్లోనూ, మరికొన్ని ప్రాంతాల్లో దాడులు చేసి రూ.200 కోట్ల విలువైన ఆస్తులను గుర్తించాయి. ఏపీ దేవాదాయ శాఖలో సహాయ కమిషనర్‌గా ఉన్న ఓ వివాదాస్పద మహిళా అధికారి అక్రమాస్తుల చిట్టా కూడా కొద్దినెలల క్రితం బయటపడింది. రాష్ట్రాలకు అతీతంగా పలు ప్రభుత్వ విభాగాల్లో ఇలాంటి అధికారులు ఎంతోమంది ఉన్నారు. అందరూ కలిసి ప్రజాప్రయోజనాలకు పాతరేస్తున్నారు.

వ్యవస్థల పతనం, చిన్న వయసులోనే విశేషాధికారాలను అప్పజెప్పడం, మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేరనే ధీమా తదితరాలు వినాశకర అవినీతికి కారణమవుతున్నాయి. అవినీతి నిరోధక చట్టానికి సవరణలు చేసి పదునుతేల్చినప్పటికీ సివిల్ సర్వీస్ అధికారులను విచారించడానికి అనుమతులు పొందాల్సి రావడం, యూపీఎస్సీ ద్వారా నియమితులైన అధికారుల మీద రాష్ట్రాలకు సరైన నియంత్రణ లేకపోవడం, సుదీర్ఘమైన విచారణ ప్రక్రియల వల్ల ఫలితం లేకుండా పోతోంది. నిజాయతీగల అధికారులను వేధింపుల నుంచి కాపాడటానికి ఉద్దేశించిన చట్టపరమైన రక్షాకవచం... దురదృష్టవశాత్తూ అవినీతిపరులకు బలమైన కోటలా మారుతోంది. పైగా కొంతమంది రాజకీయ నాయకులు, అధికారుల మధ్య ఏర్పడిన అపవిత్ర బంధం వల్ల మాట వినే వారికి కీలక పోస్టింగులు, లీగల్ మినహాయింపులు లభిస్తుంటే... నిజాయతీపరులైన అధికారులకు నిరంతర బదిలీలు ఎదురవుతున్నాయి!

అడ్డుకట్ట వేసే మార్గాలు...

ఉన్నతస్థాయిలో వేళ్లూనుకున్న అవినీతి జాడ్యానికి అడ్డుకట్ట పడాలంటే... పైపై విజిలెన్స్ దాడులు, నామమాత్రపు సస్పెన్షన్లు సరిపోవు. నిర్మాణాత్మకమైన, సమూలమైన మార్పులు అవసరం. ఖర్చుపెట్టే ప్రజాధనంలో ప్రతి పైసానూ పారదర్శకంగా ట్రాక్ చేయడానికి 'బ్లాక్‌చైన్ ఆధారిత పబ్లిక్ లెడ్జర్స్' ద్వారా పరిపాలనా డేటాను పూర్తిగా ప్రజాస్వామ్యీకరించాలి. ప్రభుత్వ టెండర్లు, పబ్లిక్ వర్క్స్ కేటాయింపుల్లో మానవ జోక్యాన్ని నిరోధించడానికి ఏఐ ఆధారిత స్వయంచాలక ప్రొక్యూర్‌మెంట్ వ్యవస్థలను తీసుకురావాలి. ఉన్నతాధికారుల అవినీతి బాగోతాలను విచారించేందుకు రాజకీయ అనుమతులతో పనిలేని వ్యవస్థను ఏర్పరచాలి. ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను విరివిగా కొలువుతీర్చాలి. అవినీతిని బయటపెట్టే వారిపై కక్షసాధింపు చర్యలకు తావులేకుండా, వారికి చట్టపరమైన రక్షణను కట్టుదిట్టం చేయాలి. వలసపాలన నాటి ఉద్యోగస్వామ్య సంస్కృతిని పారదోలేందుకు సివిల్ సర్వీస్ శిక్షణ అకాడమీలను ఆధునిక, నైతిక పరిపాలనా చట్రంలోకి మళ్లించాలి. బదిలీలు, పోస్టింగుల ప్రక్రియను రాజకీయ జోక్యంలేని స్వతంత్ర బోర్డుల పరిధిలోకి తీసుకురావాలి. అప్పుడే నిజాయతీకి తగిన గుర్తింపు లభిస్తుంది. ప్రజాప్రయోజనాలను దెబ్బతీస్తున్న అవినీతికి అడ్డుకట్ట పడే అవకాశమూ ఉంటుంది.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
ఆదివారం ⁞ అనంతపురం ⁞ 23.08.2026 ⁞ 01

# ఈవీఎం గోడౌన్ వద్ద పటిష్టమైన భద్రత ఉండాలి

**జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**
**ఈవీఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్..**

**అనంతపురం, ఆగస్టు 22 :అనంత జనశక్తి న్యూస్**



ఈవీఎం గోడౌన్ వద్ద పటిష్టమైన భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. శనివారం అనంతపురం నగరంలోని పాత ఆర్డీఓ కార్యాలయం కాంపౌండ్ పక్కనున్న ఈవీఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు నెలవారీ తనిఖీల్లో భాగంగా ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్ ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేయడం జరిగింది. ఈవీఎం గోడౌన్ వద్ద భద్రతా చర్యలను, లాగ్ బుక్ లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం గోడౌన్ వద్ద లోటుపాట్లు లేకుండా భద్రతా చర్యలను చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మాలోల, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ కనకరాజ్, సీనియర్ అసిస్టెంట్ శామ్యూల్, పాల్గొన్నారు.

# గ్రామంలో త్రాగునీరు, స్మశాన వాటిక సమస్యలను పరిష్కరించాలి...!!



**- బడన్నపల్లి, గొల్లపల్లి గ్రామాల్లో పర్యటించిన టీడీపీ నేతలు**
**- త్రాగునీరు,స్మశాన వాటికలో కంప చెట్లు తొలగించాలని ప్రజలు విన్నపం**

**ధర్మవరం రూరల్ ఆగస్టు 22 , అనంత జనశక్తి న్యూస్:**

మండల పరిధిలోని బడనపల్లి గ్రామ ఎస్సీ కాలనీలో తీవ్రంగా ఉన్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు క్లస్టర్ ఇన్చార్జ్ మహేష్ చౌదరి మరియు మండల టీడీపీ నాయకులు శనివారం గ్రామంలో పర్యటించారు. ఇటీవల ఎస్సీ కాలనీవాసులు తమ తాగునీటి ఇబ్బందులను క్లస్టర్ ఇన్చార్జ్ మహేష్ చౌదరి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే ఈ విషయాన్ని పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకువెళ్లారు. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించిన శ్రీరామ్ ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బందితో కలసి బడనపల్లి గ్రామంతో పాటు ఎస్సీ కాలనీలలో విస్తృతంగా పర్యటించి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు టీడీపీ నాయకులకు తమ పలు విన్నపాలను అందించారు: ఎస్సీ కాలనీతో పాటు గ్రామంలో తీవ్రంగా ఉన్న తాగునీటి ఎద్దడిని తక్షణమే పరిష్కరించాలి. గొల్లపల్లి గ్రామంలో దశాబ్దాల క్రితం వేసిన పాత తాగునీటి పైప్లైన్ పూర్తిగా పాడైపోయినందున, నూతన పైప్లైన్ నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలి. స్మశాన వాటికలో దట్టంగా పెరిగిన కంప చెట్లను తక్షణమే తొలగించి బాట సౌకర్యం కల్పించాలి.

**రజకుల సంక్షేమం కోసం గ్రామంలో నూతనంగా ధోబీ ఘాట్ను నిర్మించాలి.**

ప్రజల సమస్యలపై సానుకూలంగా స్పందించిన టీడీపీ నేతలు, వెంటనే మండల స్థాయి అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. గ్రామంలో ఎదురవుతున్న తాగునీటి సమస్యతో పాటు ఇతర సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సింగిల్ విండో చైర్మన్ మేకల రామాంజనేయులు, మాజీ మండల కన్వీనర్ గొట్లూరు శ్రీనివాసులు, మండల ప్రధాన కార్యదర్శి విజయ్ సారధి, ఏలుకుంట్ల రమణ, బడనపల్లి టీడీపీ నేతలు రామాంజనేయులు, జనార్ధన్, అదేప్ప, గొల్లపల్లి ఆది, లక్ష్మీనారాయణ, నాగరాజు, మల్లికార్జున, నాగప్ప, అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# మచ్చా దత్త రెడ్డి సూపర్ అర్థ సెంచరీ

**- విజయనగరంలో జరుగుతున్న సీనియర్స్ రాష్ట్రస్థాయి ప్రాబబుల్స్ పోటీల్లో**

**విజయనగరం ఆగస్టు 22, అనంత జనశక్తి న్యూస్**



విజయనగరంలో జరుగుతున్న సీనియర్స్ రాష్ట్రస్థాయి ప్రాబబుల్స్ క్రికెట్ మ్యాచ్ లో అనంతపురం జిల్లాకు చెందిన రంజీ క్రికెటర్ మచ్చా దత్త రెడ్డి అద్భుత బ్యాటింగ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నా రు అర్ధ సెంచరీ పూర్తి చేశారు ఆంధ్ర రంజి జట్టును ఎంపిక చేయటానికి జరుగుతున్న పోటీలలో ఈరోజు ఆంధ్ర డి జట్టుతోవిజయనగరంలో జరుగుతున్న సీనియర్స్ ప్రాబ్లమ్స్ పోటీలలో మచ్చ దత్త రెడ్డి అద్భుత బ్యాటింగ్ ప్రదర్శనతో 70 పరుగులు సాధించారు మూడు సిక్సర్లు ఎనిమిది ఫోర్లు గ్రౌండ్ నలుమూలల కొట్టారు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరంలోఆగస్టు 31 వరకు పోటీలు జరుగుతాయి విజయనగరంలో లోని నార్త్ జోన్ క్రికెట్ అకాడమీ నందు జరుగుతున్నసీనియర్స్ రాష్ట్రస్థాయి ప్రాబ్లమ్స్ క్రికెట్ పోటీలలో ఆంధ్ర ఏ జట్టుకు ఆంధ్ర డీ జట్లకు జట్ల మధ్య పోటీ ప్రారంభమైంది ఆంధ్ర బి జట్టు ఆంధ్ర సి జట్ట మధ్య మ్యాచులు ప్రారంభమయ్యాయిప్రతి మ్యాచ్ మూడు రోజులపాటు నిర్వహించడం జరుగుతుంది. మొత్తం ఈ పోటీలు ఆగస్టు 31 వరకు నిర్వహిస్తారు

# ప్రభుత్వం కేటాయించిన భూమి రైతుకే... దక్కదా...?




**- 81 సెంట్ల భూమిపై నాలుగు నెలలుగా తేలని వివాదం.**
**- అధికారుల చుట్టూ తిరుగుతున్న బాధిత రైతు**
**- సర్వేలో హక్కు స్పష్టమైనా స్వాధీనం అప్పగించడంలో జాప్యం ఎందుకు?**
**- దళిత రైతు నరసింహులు ఆవేదన.**

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 22, అనంత జనశక్తి న్యూస్:**

ప్రభుత్వ రికార్డుల్లో భూమి తనదేనని ఆధారాలున్నా.. క్షేత్రస్థాయి సర్వేలో తన భూమి వేరొకరి సాగులో ఉన్నట్లు తేలినా.. హక్కుదారుడైన రైతుకు మాత్రం ఆ భూమి దక్కని పరిస్థితి నెలకొంది. అధికారుల నిర్లక్ష్యం, ఫైళ్ల చుట్టూ తిరిగే వ్యవస్థ మధ్య ఓ రైతు న్యాయం కోసం నెలల తరబడి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని కనగానపల్లి మండలం ముక్తాపురం రెవెన్యూ పొలానికి సంబంధించి ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రైతు ఎం. నరసింహులుకు 1991లో ప్రభుత్వం 13 121 లెటర్ ద్వారా ఐదు ఎకరాల భూమిని కేటాయించినట్లు ఆయన చెబుతున్నారు. అయితే అందులోని 81 సెంట్ల భూమి పక్కనే ఉన్న కుర్లపల్లి తండాకు చెందిన మరో రైతు సాగులో ఉందని నరసింహులు ఆరోపిస్తున్నారు.

**సర్వే చేయించడంతో బయటపడిన అసలు విషయం....**

ఇన్నాళ్లుగా విషయం తన దృష్టికి రాకపోయినా, కొంతకాలంగా అనుమానం రావడంతో నరసింహులు సుమారు నాలుగు నెలల క్రితం ప్రభుత్వ సర్వే చేయించారు. సర్వేలో తనకు కేటాయించిన భూమిలోని 81 సెంట్లు పక్క పొలానికి చెందిన రైతు సాగులో ఉన్నట్లు అధికారులు గుర్తించారని ఆయన పేర్కొంటున్నారు. దీంతో తన భూమిని తనకు అప్పగించాలని నరసింహులు రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు. కానీ సర్వే జరిగి నెలలు గడుస్తున్నా సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రికార్డులు ఒకటి చెబుతున్నాయి.. సర్వే మరో విషయాన్ని స్పష్టం చేస్తోంది.. అయినా భూమి మాత్రం హక్కుదారుడి చేతికి ఎందుకు రావడం లేదు? అన్న ప్రశ్న ఇప్పుడు తలెత్తుతోంది.

**అధికారుల చుట్టూ ప్రదక్షిణలు... పరిష్కారం మాత్రం శూన్యం.**

తనకు న్యాయం చేయాలని కోరుతూ రైతు నరసింహులు వీఆర్వో, ఆర్డీవోలకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అలాగే 6 జులై 2026 న పోలీస్ ప్రొడక్షన్ కల్పించాలని కోరినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో డీఎస్పీ ఆదేశాల మేరకు కనగానపల్లి ఎస్సై కూడా ఎమ్మార్వోను సంప్రదించినట్లు నరసింహులు చెబుతున్నారు. అయితే సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ యంత్రాంగం మాత్రం అంటి ముట్టనట్లు వ్యవహరిస్తోందని ఆయన ఆరోపిస్తున్నారు. ఒక రైతు తన భూమికోసం అధికారుల గడపలు తొక్కల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నార్థకంగా మారింది.

**హక్కు తేలినా... స్వాధీనం ఎందుకు ఆలస్యం...?**

భూమి విషయంలో వివాదాలు ఉంటే రికార్డులు, సర్వే నివేదికలు, సంబంధిత పత్రాలను పరిశీలించి చట్టపరమైన విధానంలో సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. కానీ ఇక్కడ సర్వే జరిగినప్పటికీ తదుపరి చర్యలు ఆలస్యం కావడం



బాధితుడిలో అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వం కేటాయించిన భూమిపై హక్కు కోసం రైతు కార్యాలయాల చుట్టూ తిరగాలా? సర్వే ద్వారా వాస్తవ పరిస్థితి వెలుగులోకి వచ్చినా ఫైలు ఎందుకు కదలడం లేదు? సర్వే ద్వారా వాస్తవ పరిస్థితి వెలుగులోకి వచ్చినా ఫైలు ఎందుకు కదలడం లేదు? బాధితుడి గోడు విన్నవించేందుకు ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని వరకు వేచి చూడాల్సిదేనా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**ఉన్నతాధికారుల జోక్యం తప్పనిసరి....**

ఈ వ్యవహారంలో సంబంధిత రెవెన్యూ రికార్డులు, 1991లో జారీ చేసిన కేటాయింపు పత్రం, సర్వే నివేదిక, ప్రస్తుత సాగు పరిస్థితిని సమగ్రంగా పరిశీలించి వాస్తవాలు తేల్చాల్సిన అవసరం ఉంది. రైతు ఆరోపణలు నిజమైతే నిబంధన ప్రకారం సమస్యను పరిష్కరించి అతనికి న్యాయం చేయాల్సిన బాధ్యత అధికారులదే. రైతు భూమి విషయంలో నిర్లక్ష్యానికి తావు లేకుండా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, 81 సెంట్ల వివాదానికి శాశ్వత పరిష్కారం చూపాలని నరసింహులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఆరుతడి పంటలకు నీరివ్వండి!



**- హెచ్ఎల్సీ అధికారులతో ఎమ్మెల్యే కాలవ సమీక్ష.**

**రాయదుర్గం ఆగస్టు 22 అనంత జనశక్తి న్యూస్**

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ (హెచ్ఎల్ఎంసీ) పరిధిలోని ఆయకట్టుకు ఆరుతడి పంటల సాగుకు నీరు అందించే అవకాశాలను పరిశీలించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. అనంతపురం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం హెచ్ఎల్సీ ఎస్ఈ సుధాకర్ రావు, ఈఈ శ్రీనివాస్ నాయక్ వారి సిబ్బందితో నీటి లభ్యత, అవసరాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాభావం వల్ల ఈ ఏడాది ఆరంభంలో తుంగభద్ర ప్రాజెక్టులో తీవ్రమైన నీటి కొరత ఏర్పడిందన్నారు. దాంతో హెచ్ ఎల్ ఎం సి పరిధిలో రైతులు సకాలంలో పంటలు వేసుకోలేకపోయారని గుర్తు చేశారు. తదనంతరం వర్షాలు కురవడంతో డ్యాములో నీరు చేరుతోందన్నారు. ప్రాజెక్టులో నీటి లభ్యత దృష్ట్యా ఈ ఏడాది హెచ్ఎల్సీకి 16 టీఎంసీల నీటి వాటా లభించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా మరో 4 టీఎంసీల నీరు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని, తద్వారా హెచ్ఎల్సీ, హంద్రీనీవా ద్వారా మొత్తం సుమారు 20 టీఎంసీల నీరు లభించవచ్చని సూచించారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో నీటి లభ్యత, ఇప్పటికే జరిగిన వినియోగం, తాగునీటి అవసరాలు, నీటి వృథా తదితర అంశాలపై సమగ్రంగా లెక్కలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి అవసరాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూనే, మిగులు నీటిని ఆరుతడి పంటల సాగుకు వినియోగించే అవకాశాలను పునః సమీక్షించాలని కోరారు. నీటి లభ్యత ఆధారంగా ఆరుతడి పంటలకు సాగునీరు అందిస్తే తీవ్ర వర్షాభావంతో ఇబ్బందులు పడుతున్న రైతులకు కొంత ఊరట లభిస్తుందని పేర్కొన్నారు. అంతేకాకుండా పశుగ్రాస సమస్య కూడా కొంతవరకు అధిగమించేందుకు అవకాశం ఉంటుందన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సానుకూల నిర్ణయం తీసుకునే విధంగా నీటి లభ్యతపై వాస్తవిక అంచనాలు రూపొందించాలని అధికారులకు సూచించారు. త్వరలో జరగనున్న ఐఏబీ సమావేశంలో నీటి లభ్యత, తాగునీటి అవసరాలు, సాగునీటి అవకాశాలపై సమగ్రంగా చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. సాధ్యమైనంత మేరకు రైతులకు ప్రయోజనం కల్పించేందుకు ప్రభుత్వం అన్ని అవకాశాలను పరిశీలిస్తుందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు.

# నిరుపేద వైద్యానికి సీఎంఆర్ఎఫ్ చేయూత

**- మంత్రి కందుల దుర్గేష్**
**- నిడదవోలు క్యాంపు కార్యాలయంలో రూ. 48.39 లక్షల విలువైన 45 సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ఓసీలు పంపిణీ చేసిన మంత్రి దుర్గేష్**
**- నిడదవోలు నియోజకవర్గంలో ఇప్పటివరకు 1,092 మందికి రూ. 7.66 కోట్ల లబ్ధి చేకూర్చామని వెల్లడి**

**నిడదవోలు ఆగస్టు 22, అనంత జనశక్తి న్యూస్**



నిరుపేద ప్రజల ఆరోగ్య భద్రతకు సీఎంఆర్ఎఫ్ కొండంత అండగా నిలుస్తోందని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. శనివారం నిడదవోలులోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 45 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 48,39,268 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ఓసీ పత్రాలను మంత్రి దుర్గేష్ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ..ఇవాళ 39 మందికి రూ. 25,53,383 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఆరుగురికి రూ. 22,85, 886 విలువైన ఎల్వోసీ పత్రాలు అందించామన్నారు. "నిడదవోలు నియోజకవర్గంలో ఇప్పటివరకు సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసీ, ప్రత్యేక ఆర్థిక సాయం ద్వారా మొత్తం 1092 మంది బాధితులకు రూ. 7,66,07,826 ఆర్థిక లబ్ధి చేకూర్చాం."అని మంత్రి కందుల దుర్గేష్ వివరాలు వెల్లడించారు. "ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. పేద ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. అర్హులైన నిరుపేదలకు ప్రతి 15 రోజులకు ఒకసారి నిరంతర ప్రక్రియగా ఈ ఆర్థిక సాయం అందజేస్తున్నాం." అని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.తీవ్ర అనారోగ్యం, అనుకోని ప్రమాదాలు సంభవించినప్పుడు నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా చిన్నాభిన్నం కాకుండా సీఎంఆర్ఎఫ్ భరోసానిస్తోందని, కార్పొరేట్ వైద్యం పేదవాడికి భారం కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ సహాయాన్ని అందిస్తోంది అని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. బాధితుల కళ్ళల్లో నిండిన ఆనంద భాష్పాలే...

ఈ ప్రభుత్వ పాలనకు నిజమైన ఆశీస్సులు అని అన్నారు.రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు.. కేంద్ర సహకారంతో హెల్దీ వెల్దీ హ్యాపీ ఆంధ్రప్రదేశ్ కు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు బాటలు వేస్తున్నారని అన్నారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్న కూటమి ప్రభుత్వంలో సహాయం పొందుతున్న ప్రతి లబ్ధిదారు కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు.

సకాలంలో నిధులు విడుదల చేస్తూ పేదలను ఆదుకుంటున్నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆపత్కాలంలో తక్షణ ఆర్థిక సాయం అందించి ఆదుకున్నందుకు లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి, స్థానిక శాసనసభ్యులు, మంత్రి దుర్గేష్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# రిజర్వేషన్లపై వ్యతిరేక వ్యాఖ్యలు సరికాదు

**- సామాజిక, ఆర్థిక అసమానతలు కొనసాగినంతకాలం రిజర్వేషన్లు కొనసాగాలి: డాక్టర్ పోతుల నాగరాజు**

**అనంతపురం ఆగస్టు 22, అనంత జనశక్తి న్యూస్**

రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడే ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి నాయకుడు డాక్టర్ పోతుల నాగరాజు అన్నారు. దేశంలో సామాజిక, ఆర్థిక అసమానతలు పూర్తిగా తొలగే వరకు రిజర్వేషన్లు కొనసాగాల్సిందేనని స్పష్టం చేశారు.దేశంలో నెలకొన్న ఆర్థిక అసమానతలు, దోపిడీ, అవినీతి, అక్రమాలు, అనైతిక రాజకీయాలకు రిజర్వేషన్లు కారణం కాదని ఆయన పేర్కొన్నారు. దేశ అభివృద్ధికి అవరోధంగా ఉన్న అసలు కారణాలపై ప్రశ్నించకుండా రిజర్వేషన్లను లక్ష్యంగా చేసుకోవడం సరికాదన్నారు.దేశంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక అసమానతలు, అణగారిన వర్గాలపై వివక్షపై ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. వెనుకబడిన వర్గాలకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను వ్యతిరేకించే వ్యాఖ్యలు బహుజన సమాజాన్ని, రాజ్యాంగ వ్యవస్థను అవమానపరిచేలా ఉన్నాయని విమర్శించారు.జెన్ జి ఉద్యమంలోకి కొందరు అసాంఘిక శక్తులు చొరబడి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని, ఇలాంటి వ్యాఖ్యలు సమాజంలో మరింత విభజనకు దారితీయవచ్చని నాగరాజు అన్నారు.దేశంలో కుల, సామాజిక, ఆర్థిక అసమానతలు కొనసాగుతున్నంతకాలం రిజర్వేషన్ల అవసరం ఉంటుందని తెలిపారు. అసమానతలు పూర్తిగా తొలగిన తర్వాతే రిజర్వేషన్లపై చర్చించాల్సిన అవసరం ఉంటుందని పేర్కొన్నారు. రిజర్వేషన్లను వ్యతిరేకించే వారు బాధ్యతాయుతంగా మాట్లాడాలని ఆయన హెచ్చరించారు.



# నేడే యాడికి లో ఉచిత మెగా గుండె , కంటి వైద్య శిబిరం

**యాడికి , ఆగష్టు 22, అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రంలో ఉన్న మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సౌజన్యంతో, కిమ్స్సవేరా ఆస్పత్రి యాజమాన్యం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం భారీ ఉచిత గుండె ,కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. మండలంలోని కోన రోడ్డులో ఉన్న శ్రీ వివేకానంద ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఈ శిబిరానికి విచ్చేసే రోగులకు నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ఉచితంగా రక్త చక్కెర పరీక్షలు, రక్తపోటు పరీక్షలు, ఈసీజీ , టుడి ఎకో వంటి ఆధునిక గుండె సంబంధిత పరీక్షలు ఉచితంగా నిర్వహించబడునని తెలిపారు.ఛాతీలో నొప్పి, గుండెదడ, ఆయాసం, కళ్లు తిరగడం, కాళ్ల వాపులు రావడం, రాత్రి వేళల్లో నిద్రలో తీవ్రమైన ఆయాసంతో లేచి కూర్చోవడం, గుండెలో మంట అధికంగా చెమటలు పట్టడం వంటి వివిధ రకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. పరిసర ప్రాంతాల ప్రజలు, గ్రామీణులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ సేవలను వినియోగించుకోవాలని మనవి చేశారు. ఈ ఉచిత వైద్య పరీక్షలు కేవలం మెడికల్ క్యాంపులో మాత్రమే అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. శిబిరానికి వచ్చే బాధితులు వారి సహాయకులు తప్పని సరిగా ముఖానికి మాస్కు ధరించి రావాలని తెలిపారు. ఈ శిబిరానికి సంబంధించి ఏవైనా సందేహాలు ఉన్నా లేదా ఇతర వివరాల కోసం ప్రాంతీయ ఫోన్ నంబర్లు అయిన 08554251234, 99120 99782, 86868 08333 , 91335 66441 సంప్రదించవచ్చని తెలిపారు.

# విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ఎస్‌కేయూ-నిర్మాణ్ భాగస్వామ్యం




**- ఉచిత శిక్షణ, ధ్రువపత్రాలు, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అవగాహన ఒప్పందం**

**అనంతపురం, ఆగస్టు 22:అనంత జనశక్తి న్యూస్**

విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్‌కేయూ), నిర్మాణ్ సంస్థ, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సహకారంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. హబ్ అండ్ స్పోక్ విధానంలో విద్యార్థులకు ఉచితంగా ఉపాధి, సాంకేతిక నైపుణ్యాలపై శిక్షణ అందించనున్నారు.ఈ కార్యక్రమం ద్వారా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ, ధ్రువపత్రాలు, పరిశ్రమలతో అనుసంధానం, ఉద్యోగ నియామక కార్యక్రమాలు, ఉద్యోగ మేళాలు, శిక్షణా ఉద్యోగావకాశాలు తదితర ప్రయోజనాలను విద్యార్థులకు కల్పించనున్నారు. పరిసర ప్రాంతాల్లోని ఇతర కళాశాలల విద్యార్థులకు కూడా ఈ శిక్షణను విస్తరించనున్నారు.శిక్షణ కార్యక్రమాన్ని పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తామని, విద్యార్థులు లేదా కళాశాల యాజమాన్యం నుంచి ఎలాంటి రుసుము వసూలు చేయబోమని అధికారులు తెలిపారు.విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతికుమార్ మాట్లాడుతూ నిర్మాణ్ సంస్థ, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సహకారంతో చేపడుతున్న ఈ కార్యక్రమం విద్యార్థులకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు, ధ్రువపత్రాలు, ఉపాధి అవకాశాలు పొందేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ఈ భాగస్వామ్యం మంచి ముందడుగు అని పేర్కొన్నారు.కార్యక్రమానికి సంబంధించిన ఉద్యోగ నియామక కార్యకలాపాలను ప్లేస్‌మెంట్ అధికారి డా. అనిత సమన్వయం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్.జ్యోతికుమార్, రిజిస్ట్రార్ డా. ఇ. రమేష్‌బాబు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. రామచంద్ర, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డా. సోమశేఖర్, ప్లేస్‌మెంట్ అధికారి డా. అనిత, పీఆర్వో డా. బి. సత్యనారాయణ పాల్గొన్నారు.నిర్మాణ్ సంస్థ తరఫున అనంతపురం విభాగం మేనేజర్ మద్దన ఆదర్శ్, బృంద సభ్యుడు హరిప్రసాద్ టి. పాల్గొన్నారు. ఇరు సంస్థల ప్రతినిధులు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు.విద్యార్థుల భవిష్యత్ ఉపాధి అవకాశాలను మెరుగుపరచడంలో ఈ భాగస్వామ్యం కీలకంగా నిలుస్తుందని విశ్వవిద్యాలయ అధికారులు తెలిపారు.

# మెరుగైన ఆరోగ్యం కొరకు పరిసరాల పరిశుభ్రతను పాటించాలి



**- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి వీరపాండ్యన్**

**అనంతగిరి, ఆగష్టు 22:అనంత జనశక్తి న్యూస్**

ఆరోగ్యకరమైన జీవనానికి పరిసరాల పరిశుభ్రత ఎంతో దోహదం చేస్తుందని రాష్ట్ర ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి జి.వీర పాండ్యన్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతి నెల మూడో శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అరకు మండలం గన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా కలెక్టర్ నిషాంతి.టి, జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ, పాడేరు ఐటీడీఏ పీవో ఆదిత్య వర్మలతో కలిసి సంయుక్తంగా శాశ కార్యక్రమంలో పాల్గొన్నారు.జిల్లాలో ఈ శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణ ఆంధ్ర' కార్యక్రమం గన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహించడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా జిల్లా అధికారులతో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లో భాగంగా పి హెచ్ సి ఆవరణలో మొక్కలు నాటి, అధికారులు, ఉద్యోగులతో పరిశుభ్రత ప్రతిజ్ఞ చేయించారు.
అనంతరం మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఇతర చెత్తతో కలపకుండా వేరు చేసి, నిర్దేశిత విధానంలో పారవేయాలని తెలిపారు. పరిశుభ్రమైన వాతావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొంటూ, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పిహెచ్ సీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచిన స్థానిక పంచాయతీ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమం ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోనల్ ప్రాంతీయ చైర్మన్ సియ్యాది దొన్నుదొర, గ్రామ స్వర్ణలయాల నోడల్ అధికారి పిఎస్ కుమార్, జిల్లా అధికారులు, మండల అధికారులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళా జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు

**- పోక్సో చట్టం, బాల్య వివాహాలు, సైబర్....**

**- మోసాలపై విద్యార్థినులకు అవగాహన....**

**ధర్మవరం ఆగస్టు 22 అనంత జనశక్తి న్యూస్ :**




ధర్మవరం మహిళా జూనియర్ కళాశాలలో వన్‌టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప సూచనల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోక్సో చట్టం, బాల్య వివాహాల నిరోధం, చిన్నారులు, మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ మోసాలు, సోషల్ మీడియా వినియోగం తదితర అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.
కళాశాలకు వచ్చేటప్పుడు, తిరిగి ఇంటికి వెళ్లేటప్పుడు విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా ఆకతాయిలు వేధించినా, సతాయించినా భయపడకుండా వెంటనే పోలీసులకు లేదా కళాశాల ప్రిన్సిపాల్‌కు సమాచారం అందించాలని సూచించారు. సోషల్ మీడియాను జాగ్రత్తగా వినియోగించాలని, అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, ఓటీపీ, పాస్‌వర్డ్‌లు వంటి సమాచారాన్ని పంచుకోవద్దని హెచ్చరించారు. సైబర్ మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. విద్యార్థినుల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# కాటిగానికాల్వలో క్యూఆర్ కోడ్ ద్వారా ఇంటింటి చెత్త సేకరణకి శ్రీకారం..

**- ప్రయోగాత్మకంగా క్యూఆర్ కోడ్ ద్వారా ఇంటింటి చెత్త సేకరణను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**

**- పారిశుధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు నూతనంగా QR కోడ్ స్కాన్ ఆధారిత చెత్త సేకరణ విధానాన్ని ప్రారంభించాం..**

**- గ్రామీణ ప్రాంతాల్లో శుభ్రతను నిరంతరం కొనసాగించడమే లక్ష్యం**

**- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**

**అనంతపురం, ఆగస్టు 22 : అనంత జనశక్తి న్యూస్**




అనంతపురం రూరల్ మండలంలోని కాటిగానికాల్వ గ్రామంలో క్యూఆర్ కోడ్ ద్వారా ఇంటింటి చెత్త సేకరణకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో ప్రయోగాత్మకంగా క్యూఆర్ కోడ్ ద్వారా ఇంటింటి చెత్త సేకరణను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ లాంఛనంగా ప్రారంభించారు. ప్రతినెల మూడవ శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం "ఆరోగ్యవంతమైన పాఠశాలలు ఆరోగ్యవంతమైన ఆంధ్ర" థీమ్ తో ఈ కార్యక్రమం నిర్వహించగా.. ఇందులో ప్రతి ఇంట్లో క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేపట్టగా, జిల్లా కలెక్టర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా క్లాప్ మిత్రలు, మహిళలు, ప్రజలతో జిల్లా కలెక్టర్ మాట్లాడి చెత్త సేకరణలో ఇబ్బందులను, గ్రామంలో ఉన్న ఇళ్లకు చెత్త తీసుకోవడానికి ఎంత సేపు పడుతుంది, రోజువారి చెత్త సేకరణ, క్యూఆర్ కోడ్ ద్వారా చెత్త సేకరణలో మార్పులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాలలో వస్తువులన్నీ ఉన్నాయా ఆరా తీసి, అక్కడే ఏర్పాటు చేసిన రూఫ్ టాఫ్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ ను పరిశీలించారు. పాఠశాల ఆవరణంలో మొక్కలను నాటారు. తదనంతరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నుంచి అంగన్వాడీ కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించగా, అక్కడ మానవహారం ఏర్పాటు చేసి అందరి చేత స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఆ తర్వాత అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు నూతనంగా QR కోడ్ స్కాన్ ఆధారిత చెత్త సేకరణ విధానాన్ని ప్రయోగాత్మకంగా (పైలట్ ప్రాజెక్ట్) ప్రారంభించడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో శుభ్రతను నిరంతరం కొనసాగించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టామన్నారు. గ్రామీణ ప్రజలు మరియు క్లాప్ మిత్రులు/సిబ్బంది ఇద్దరూ కలిసి భాగస్వామ్యంతో పనిచేసినప్పుడే గ్రామంలో సంపూర్ణ పారిశుధ్యం సాధ్యమవుతుందన్నారు. కర్ణాటకలోని బెంగళూరు సమీపంలోని ఒక చిన్న గ్రామంలో ప్రతి ఇంటికి QR కోడ్ ఏర్పాటు చేసి, చెత్త సేకరణ పర్యవేక్షిస్తున్న విధానాన్ని తెలుసుకుని, అక్కడికి వెళ్లి పరిశీలించిన తర్వాత ఈ నమూనాను ఇక్కడ పైలట్ ప్రాజెక్ట్‌గా స్వీకరించడం జరిగిందన్నారు. "సిబ్బంది సరిగా రావడం లేదు" అని ప్రజలు, "ప్రజలు చెత్త ఇవ్వడం లేదు" అని సిబ్బంది చెప్పే పరస్పర ఫిర్యాదులకు చెక్ పెట్టడానికి ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందన్నారు. 6 రూపాయల అతి తక్కువ వ్యయంతో ప్రతి ఇంటికి QR కోడ్ కేటాయించబడుతుందన్నారు. సిబ్బంది ప్రతి ఇంటికీ వచ్చి స్కాన్ చేయడం ద్వారా వారు వచ్చినట్లు, అలాగే ప్రజల నుండి చెత్త సేకరించినట్లు ఆన్‌లైన్ డేటా మరియు ఫోటో ఆధారాలతో పక్కాగా నమోదు అవుతుందన్నారు. సమయభావన లేదా ఇతర కారణాల వల్ల చెత్త ఇవ్వలేకపోతున్న వారిలో మార్పు తెచ్చేందుకు ఐఈసి ప్రచార కార్యక్రమాలు మరియు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. నిరంతర పర్యవేక్షణ చేసి గ్రామసభలు, క్షేత్రస్థాయి వివరాల ఆధారంగా పారిశుధ్య లోపాలను గుర్తించి ఎప్పటికప్పుడు సరిదిద్దుతామన్నారు. ప్రత్యేక పర్యవేక్షణ విధానాలపై మాత్రమే ఆధారపడకుండా, నిబంధనల ప్రకారం అందుబాటులో ఉన్న క్రమబద్ధమైన పర్యవేక్షణ వ్యవస్థల ద్వారానే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు, గ్రామస్తులకు పిలుపునిచ్చారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడంలో అధికారులతోపాటు ప్రతి ఒక్క పౌరుడి భాగస్వామ్యం ఎంతో అవసరం అన్నారు. గ్రామ ప్రజలందరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యతను స్వయంగా తీసుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరూ పరిశుభ్రతను తమ దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకున్నప్పుడే స్వచ్ఛమైన, ఆరోగ్యవంతమైన స్వర్ణాంధ్ర నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రతి మండలంలో ఒక పంచాయతీని ఎంపిక చేసి క్యూఆర్ కోడ్ ద్వారా ఇంటింటి చెత్త సేకరణ కోసం ప్రణాళికలను రూపొందించాలని డిపీఓని ఆదేశించారు.ఈ సందర్భంగా రాష్ట్ర బ్యూటిఫికేషన్ డైరెక్టర్ లక్ష్మీదేవమ్మ మాట్లాడుతూ ఇంటింటికి క్యూఆర్ కోడ్ ఉపయోగించి చెత్తను సేకరించడం చాలా ఉపయోగంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిశుభ్రత బాగా ఉంచుకోవాలన్నారు.ఈ సందర్భంగా డిపిఓ నాగరాజు నాయుడు మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటికీ ఒక క్యూఆర్ కోడ్ కేటాయించబడుతుందని, క్లాప్ మిత్రలు చెత్త సేకరణ సమయంలో ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తారని, ప్రజలు తడి చెత్త మరియు పొడి చెత్తను వేర్వేరుగా ఇస్తున్నారా లేదా అనేది ఈ యాప్/సిస్టమ్ ద్వారా నమోదు చేయబడుతుందన్నారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇస్తే ఒక రకమైన ఆప్షన్, రెండూ కలిపి ఇస్తే మరొక రకమైన ఆప్షన్, అసలు చెత్త ఇవ్వకపోతే (ఇల్లు లాక్ చేసి ఉన్నా లేదా వేరే ఊరు వెళ్లినా) దానికి తగిన ఆప్షన్ స్కాన్ ద్వారా నమోదవుతుందన్నారు. ఈ విధానం ద్వారా గ్రామంలో ఏ కుటుంబాలు చెత్తను సక్రమంగా ఇస్తున్నాయి, ఎక్కడ అవగాహన లోపించింది అనే సమాచారం వారానికోసారి స్పష్టంగా తెలుస్తుందని, చెత్త సరిగా వేరు చేయని వారికి మళ్లీ అవగాహన కల్పిస్తామన్నారు. కర్ణాటకలోని విజయవంతమైన నమూనాను పరిశీలించి,
జిల్లాలోని ఎంపిక చేసిన గ్రామంలో దీనిని పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రజల భాగస్వామ్యంతో ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైన తర్వాత, జిల్లాలోని అన్ని గ్రామాలు మరియు చిన్న చిన్న గ్రామ పంచాయతీల్లోనూ ఈ QR కోడ్ విధానాన్ని విస్తరించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలందరూ అధికారులకు సహకరించాలని కోరారు. అనంతరం ఎన్జీవో ఆధ్వర్యంలో బట్టసంచులను, డస్ట్ బిన్లను గ్రామస్తులకు జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డిడిఓ శకుంతల, తహసిల్దార్ ఉదయ్ కుమార్, ఎంపీడీవో దివాకర్, సాస డిసి సౌజన్య, డిప్యూటీ ఎంపీడీవో

# ప్రాణ రక్షణే ప్రథమ కర్తవ్యం

**- ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నదే లక్ష్యం**

**- రాష్ట్ర విపత్తు స్పందన అగ్నిమాపక శాఖ ఇన్ చార్జి డిజి, డైరెక్టర్**

**- పి .వెంకటరమణ**

**అనంతపురం, ఆగస్టు 22:అనంత జనశక్తి న్యూస్**




అత్యవసర సమయాల్లో అగ్నిమాపక శాఖ ద్వారా ప్రజల ప్రాణ రక్షణ ప్రథమ కర్తవ్యంగా పనిచేయాలని, ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యమని రాష్ట్ర విపత్తు స్పందన అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ పి. వెంకటరమణ తెలిపారు.
శనివారం ఉదయం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా అనంతపురం ప్రధాన కేంద్రంలోని జిల్లా అగ్నిమాపక శాఖ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా శాఖ ద్వారా అందిస్తున్న సేవలుగురించి అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు.
అనంతరం పాత్రికేయ బృందం తో ప్రెస్ మీట్ నిర్వహించి అగ్నిమాపక శాఖ పని తీరుపై పలు విషయాలను వెల్లడించారు.
ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం అగ్నిమాపక శాఖను అన్ని విధాల బలోపేతం చేయడానికి అవసరమైన మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యంగా రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కొక్క అగ్నిమాపక కేంద్రం సుమారు రూ .2. 25 కోట్ల వ్యయంతో 17 కొత్త అగ్నిమాపక కేంద్రాల భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి ఇప్పటికే 6 దాకా భవన నిర్మాణాలు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. మరో 36 అగ్నిమాపక కేంద్రాల ఆధునీకరణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. తొలి దశలో సుమారు రూ .33 కోట్లతో 65 వాహనాలు రెండవ దశలో 58 వాహనాలను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. అలాగే భవిష్యత్తు ప్రణాళికలు చర్యల్లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో మొత్తం రూ. 252. 86 కోట్లతో అగ్నిమాపక శాఖను బలోపేతం చేయడం జరుగుతున్నట్లు తెలిపారు.
రాష్ట్రంలో పలు ప్రాంతాలలో 25 అధునాతనఅగ్నిమాపక వాహనాలు ఏర్పాటు చేయడం జరిగిందని ముఖ్యంగా గ్రామీణ ,అటవీ ప్రాంతాల కోసం వీటి సేవలు వినియోగించడం జరుగుతున్నట్లు తెలిపారు. ఇటీవల కాలంలో గౌరవ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అమరావతిలోని ఉండవల్లి సీడ్ యాక్సెస్ రోడ్ వద్ద సుమారు రూ. 40 కోట్ల వ్యయంతో కొనుగోలు చేసిన 58 నూతన ఆధునిక అగ్నిమాపక వాహనాలను ప్రారంభించడం జరిగిందని గుర్తు చేశారు.అగ్ని ప్రమాదంలో ప్రాణంతో పాటు ఆస్తిపరంగా కూడా నష్టం జరగకుండా నివారించేందుకు జాతీయ ప్రయోజనాలకు మరియు రక్షణకు ఉపయోగపడే పనిలో తమ శాఖ అధికారులు సిబ్బంది విధులు నిర్వర్తించడం జరుగుతున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల కాలంలో అగ్నిమాపక చర్యల్లో భాగంగా ఎంతో ప్రయోగాత్మకంగా అధికారులకు, క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని అలాగే అగ్ని ప్రమాదాలు, ప్రకృతి సహజమైన సంఘటనలు భూకంపాలు, తుఫాను, ప్రైవేటు, ప్రభుత్వ ఆస్తులలో ఎక్కువగా ఫైర్ మరియు కిచెన్,ఎలక్ట్రికల్ ప్రమాద సంఘటనలు లాంటివి వచ్చినప్పుడు ప్రజలు, విద్యార్థులు ,రైతులు, ఉద్యోగులు తదితర సమూహాలు తీసుకోవలసిన జాగ్రత్తలపై రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో తమ శాఖ ద్వారా విస్తృతంగా అగ్ని ప్రమాదాల నివారణ రక్షణ చర్యలకు సంబంధించిన అంశాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.
ప్రస్తుతం అనంతపురము జిల్లాకు అగ్నిమాపక సేవల సిబ్బందికి సంబంధించి వివిధ స్థాయిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడం జరుగు తుందన్నారు. జిల్లా లోని కళ్యాణ్ దుర్గం లో ని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో తాత్కాలికంగా నిర్వహించబడుతున్న ప్రాంతంలో అదనంగా నూతనంగా 60 సెంట్ల స్థలంలో ఫైర్ స్టేషన్ భవనం నిర్మాణం కోసం 16వ ఆర్థిక సంఘం కింద రూ . 2.25 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. అలాగే గుత్తి ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో 0.50 ఎకరాల భూమిని గూటి ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు సమకూర్చడం జరిగిందని, పూర్వ అనంతపురం జిల్లాలోని అగ్నిమాపక సేవల సిబ్బందికి పంపిణీ చేయడానికి ఆపిల్ ఇండస్ట్రీ సంస్థ తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ పిఎస్ఆర్ కార్యక్రమం కింద ₹ 240 ప్రతినిధించే జాకెట్లను ప్రజల సేవార్థం అగ్నిమాపణ శాఖకు అందించడం జరిగిందన్నారు. అలాగే సాగర్ సిమెంట్స్ తాడిపత్రి సంస్థ ద్వారా 50 డెలివరీ హోసులు అదనంగా ఆర్జాస్ స్టీల్ మరియు అల్ట్రాటెక్ సిమెంట్స్ తాడిపత్రి సంస్థల నుండి సిఎస్ఆర్ కార్యక్రమం కింద 100 డెలివరీ హోసులు త్వరలో అందనున్నట్లు పేర్కొన్నారు. అస్ట్రో బేస్ స్పేస్ టెక్నాలజీస్ కళ్యాణ్ దుర్గం మరియు కేఎన్ఆర్ కాంట్రాక్టర్స్ సంస్థల ద్వారా సిఎస్సార్ కింద 50 మెటల్ సింగల్ కాట్లు మరియు పరుపులు అందించడం జరిగిందని అదనంగా ఎస్ఐఎంఎస్ అనంతపురం నుండి సిఎస్ఆర్ కార్యక్రమం కింద 50 మెటల్ సింగల్ కార్డులో మరియు పరుపులు త్వరలో అందరూ ఉన్నట్లు తెలిపారు. సింగనమల రాప్తాడు గుత్తి ప్రాంతాలలో నూతన ఫైర్ స్టేషన్ లో ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని తెలిపారు. అలాగే అగ్నిమాపక శాఖలో 35 పోస్టుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్లు తెలిపారు. పాత వాహనాల స్థానాల్లో మార్పిడి చేసి అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వాహనాలను సమకూర్చామని తెలిపారు. డయల్ 112 నెంబర్ కు ఫైర్ పోలీసు అంబులెన్స్ సౌకర్యాలను అనుసంధానం చేస్తున్నామని స్పష్టం చేశారు. తద్వారా అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే చర్యలు తీసుకునేందుకు గ్రామ మండల స్థాయిలో విస్తృత సేవలు ఇతర ఏర్పాట్లు సులభతరం అవుతాయని చెప్పారు.రాష్ట్ర వ్యాప్తంగా వనరులు కార్యకలాపాలు అవసరాలు మరియు ప్రగతి గురించి వివరిస్తూ అనంతపురం జిల్లా నందు ఫైర్ టెండర్లు 8 కాగా ప్రత్యేక వాహనాలు 7 ఇందులో 1 వాటర్ బౌజర్, 2 క్విక్ రెస్పాన్స్ వాహనాలు, 2 మిస్ట్ జీపులు02 మిస్ట్ బుల్లెట్లు, ఉన్నాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 49 అవగాహన కార్యక్రమాలు 192 మాక్ డ్రిల్స్ నిర్వహించినారనీ, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేటు భవనాలు, పరిశ్రమల్లో కూడా అగ్ని ప్రమాదాల నివారణ చర్యల అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, సుమారు 1000 కి పైగా ప్రైవేటు, ప్రభుత్వ వాహనాలను ఆర్టీసీ మరియు రోడ్డు ట్రాన్స్పోర్ట్ శాఖ ల అధికారుల సహకారాల తోతనిఖీ చేసి అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. గతం కంటే మిన్నగా అగ్నిమాపక శాఖ ప్రజలకు చేరువగా సేవలందిస్తున్నదని ప్రాణ ఆస్తి నష్టాలను కాపాడుతున్నట్లు పేర్కొన్నారు.అలాగే ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి పునస్కారాలను అందిస్తూ ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం డెమో ద్వారా అవగాహన కల్పించి ఉత్తమ సేవలు అందించిన అధికారులకు ఉద్యోగులకు మెడల్స్ ను బహుకరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# మంత్రి నారాయణ సేవలు నెల్లూరు ప్రజలకు వరం..

**- తాళ్లపాక అనురాధ**

**- ఇంటి ముంగిటకే కార్పొరేట్ వైద్యం..**

**- నెల్లూరులో దిగ్విజయంగా నారాయణ ఆన్ వీల్స్**

**- బడి పిల్లల ఆరోగ్యానికి కొండంత అండ..**

**- ఆర్ ఎస్ ఆర్ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం**

**నెల్లూరు ఆగస్ట్ 22, అనంత జనశక్తి న్యూస్**




నెల్లూరు ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా మంత్రి నారాయణ సొంత నిధులతో నిర్వహిస్తున్న నారాయణ ఆన్ వీల్స్ వైద్య సేవా యజ్ఞం దిగ్విజయంగా కొనసాగుతోంది. సామాన్యుల ఇంటి ముంగిటకే కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని చేరువ చేయడమే కాకుండా, శనివారం పూట పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తూ వారి భవిష్యత్తుకు కొండంత అండగా నిలుస్తున్నారు. మంత్రి నారాయణ ఆధ్వర్యంలో సుమారు 3 కోట్ల వ్యయంతో అందుబాటులోకి వచ్చిన నారాయణ ఆన్ వీల్స్ మొబైల్ క్లినిక్ ద్వారా నిరుపేదలకు ఉచిత వైద్య సేవలు నిరంతరాయంగా అందుతున్నాయి. వారంలో 2 రోజులు సిటీ, 2 రోజులు రూరల్ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తుండగా,నారాయణ నేత్ర జ్యోతి ద్వారా ఇప్పటివరకు 11,800 మందికి కంటి పరీక్షలు చేసి, 6,900మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. చూపు కోల్పోయే ప్రమాదంలో ఉన్న 175 మందికి నారాయణ ఆసుపత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించి తిరిగి దృష్టిని ప్రసాదించడమే కాకుండా, నారాయణ దంత సురక్ష ద్వారా 7800 మందికి ఉచితంగా దంత వైద్య సేవలు అందించారు.ఈ సేవా యజ్ఞంలో భాగంగా శనివారం 8వ డివిజన్, స్టోన్ హౌస్ పేట ఆర్ ఎస్ ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ ఆకస్మికంగా పరిశీలించి విద్యార్థుల చదువు, కంటి మరియు దంత ఆరోగ్య సమస్యల గురించి ఆత్మీయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మంత్రి నారాయణ ఒక ఎమ్మెల్యేగా అభివృద్ధి సంక్షేమంతో పాటు ప్రజలు, పిల్లల ఆరోగ్య రక్షణను బాధ్యతగా తీసుకుని కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నారని కొనియాడారు. విద్యార్థులకు ఎలాంటి కంటి లేదా దంత ఆరోగ్య సమస్యలు ఉన్నా మంత్రి దృష్టికి తీసుకెళ్లి ఉచితంగా శస్త్రచికిత్సలు, వైద్య సదుపాయాలు కల్పిస్తామని ఆమె స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ సతీష్, డివిజన్ వైస్ ప్రెసిడెంట్ శేఖర్, బిఎల్పి మల్లికార్జునరావు, సెక్రటరీలు అమర్ ,అజయ్ స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

# పాముకాటుతో.. దెబ్బతిన్న కిడ్నీలు...

- కిమ్స్ కడల్స్ లో విజయవంతంగా చికిత్స
- డయాలసిస్‌తో ఎనిమిదేళ్ల బాలుడికి పునర్జన్మ
- సకాలంలో పీఐసీయూ చికిత్సతో సాధారణ స్థితికి వచ్చిన బాలుడు

**కర్నూలు, ఆగస్టు 22, అనంత జనశక్తి న్యూస్**

పాముకాటుతో తీవ్ర స్థాయిలో కిడ్నీలు దెబ్బతిని, మూత్రం తగ్గిపోవడంతో ప్రాణాపాయ స్థితికి చేరుకున్న ఎనిమిదేళ్ల బాలుడికి సకాలంలో అత్యవసర వైద్యం అందించి వైద్యులు ప్రాణాలు కాపాడారు కిమ్స్ కడల్స్ కర్నూలు వైద్యులు. ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు చికిత్సనందించిన కన్సల్టెంట్ పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్ డాక్టర్ పి. వి. రవి కిరణ్.కర్నూలు జిల్లా సంజమల గ్రామానికి చెందిన రితిక్ (8) బాలుడు ఇంటి ఆవరణంలో ఆడుకుంటున్న సమయంలో ఎడమకాలుకి పాముకాటు వేసింది. కాటు వేసిన ప్రాంతానికి సమీపంలో కొన్ని గంటల పాటు టోర్నికెట్ (గట్టిగా కట్టే వస్త్రం) వేశారు. అనంతరం స్థానికంగా లభించే నాటు వైద్యం కూడా అందించారు. అయితే ఆసుపత్రికి వచ్చే ముందు 24 గంటల్లో బాలుడికి మూత్రం బాగా తగ్గిపోయింది. శరీరంలో వాపు రావడంతో పాటు వేగంగా శ్వాస తీసుకోవడం గమనించారు. అప్పటికే బాలుడికి రక్తంలో క్రియాటినిన్ 7.5 mg/dL, యూరియా 170 mg/dLకు చేరినట్లు గుర్తించాం. దీంతో కిడ్నీల పనితీరు తీవ్రంగా దెబ్బతిన్నదని వెంటనే పీఐసీయూలో చేర్చి కొద్దిరోజుల పాటు హీమోడయాలసిస్, రక్తపోటు నియంత్రణతో చికిత్స అందించగా క్రమంగా కిడ్నీల పనితీరు సాధారణ స్థితికి చేరుకుంది. అధికంగా ఉన్న రక్తపోటును మందులతో నియంత్రించారు.పీఐసీయూలో ప్రత్యేక పర్యవేక్షణ,హీమోడయాలసిస్‌తో పాటు అవసరమైన చికిత్స అందించడంతో బాలుడి ఆరోగ్యం క్రమంగా మెరుగుపడింది. మూత్రం ఉత్పత్తి సాధారణ స్థితికి చేరుకోవడంతో పాటు కిడ్నీల పనితీరు కూడా క్రమంగా సాధారణమైంది. అనంతరం బాలుడిని ఆరోగ్యకరమైన స్థితిలో ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. పాముకాటు వల్ల కేవలం కాటు ప్రాంతానికే కాకుండా శరీరంలోని ఇతర అవయవాలపైనా తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు.ముఖ్యంగా పిల్లల్లో మూత్రం తగ్గడం, శరీరంలో వాపు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, రక్తపోటులో మార్పులు, నరాల బలహీనత, రక్తం కారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి తీసుకురావాలని సూచించారు."పాముకాటుకు గురైన పిల్లలకు వీలైనంత త్వరగా వైద్య పరీక్షలు, చికిత్స అందించాలి. స్థానిక వైద్యం లేదా నిరూపణ లేని చికిత్సల కోసం సమయం వృథా చేయడం వల్ల



పరిస్థితి మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. ఈ బాలుడి విషయంలో కిడ్నీల పనితీరు తీవ్రంగా దెబ్బతినడంతో సకాలంలో పీఐసీయూలో చేర్చి డయాలసిస్ అందించడం ద్వారా ప్రాణాపాయం నుంచి బయటపడేయగలిగాం" అని డాక్టర్ రవి కిరణ్ తెలిపారు. పాముకాటు జరిగిన వెంటనే బాధితుడిని సమీపంలోని అత్యవసర వైద్య సదుపాయాలున్న ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు.కాటు వేసిన ప్రాంతానికి గట్టిగా టోర్నికెట్ కట్టడం వంటి పద్ధతులను వైద్యుల సూచన లేకుండా పాటించకూడదని తెలిపారు. ఇలాంటి పద్ధతులు రక్తప్రసరణపై ప్రతికూల ప్రభావం చూపి అదనపు సమస్యలకు దారితీసే అవకాశం ఉందని వివరించారు.ఈ ఘటన పాముకాటుకు గురైన పిల్లల్లో సకాలంలో ఆసుపత్రికి తీసుకురావడం, అవయవాల పనితీరును నిరంతరం పర్యవేక్షించడం, అవసరమైనప్పుడు పీఐసీయూ చికిత్స, డయాలసిస్ వంటి అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండటం ఎంత కీలకమో తెలియజేస్తోంది.

# ఎల్ నీనో ప్రభావంపై కలెక్టర్ సమీక్ష

- రక్షక తడులు, ప్రత్యామ్నాయ సాగుపై రైతులు దృష్టి సారించాలి

**పుట్టపర్తి, ఆగస్టు 22: అనంత జనశక్తి న్యూస్**

ఎల్ నీనో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతాంగానికి ప్రభుత్వం అండగా ఉంటుందని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. రైతులు రక్షక తడులు, ప్రత్యామ్నాయ సాగు పద్ధతులపై దృష్టి సారించాలని సూచించారు.పుట్టపర్తిలోని సాయి ఆరామం ప్రాంగణంలో ఎల్ నీనో పరిణామాలపై నిర్వహించిన కార్యాచరణ సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు సాధారణ సాగు విస్తీర్ణంలో 45 శాతం మేర మాత్రమే పంటలు సాగయ్యాయని, వర్షపాతం 57 శాతం వరకు లోటుగా నమోదైందని తెలిపారు.వర్షాభావ పరిస్థితుల్లో పంటకు అవసరమైన మేరకే నీటిని అందిస్తూ నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని రైతులకు సూచించారు. అర్హులైన రైతులందరినీ ఇప్పటికే పంటల బీమా పరిధిలోకి తీసుకువచ్చామని చెప్పారు. రానున్న రోజుల్లో వర్షాలు కురిస్తే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు 80 శాతం



రాయితీపై పంపిణీ చేయడానికి 16 వేల క్వింటాళ్ల విత్తనాలను సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించారు.పశుగ్రాస కొరత రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా 1,000 ఎకరాల్లో సామూహిక పశుగ్రాసం పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.జిల్లాలో ఇప్పటికే 94 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటలు సాగు చేసి మంచి ఫలితాలు సాధించామని పేర్కొన్నారు. ఈ విధానాన్ని మరోసారి విస్తరించి 2 లక్షల ఎకరాలకు తీసుకెళ్లాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.కురిసే ప్రతి వర్షపు చుక్కను ఒడిసి పట్టుకునేలా రైతులు తమ పొలాల్లో పొలం కుంటలు తప్పనిసరిగా తవ్వుకోవాలని కలెక్టర్ సూచించారు. వర్షాభావ సమయంలో పంటలకు రక్షక తడి అందించడంలో పొలం కుంటలు కీలకంగా ఉంటాయని వివరించారు. బోరు సౌకర్యం ఉన్న రైతులు బిందు సేద్య పరికరాలను వినియోగించి నీటి వృథాను అరికట్టాలని కోరారు.సమావేశంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన మట్టి నమూనా పరీక్ష కిట్ పనితీరును రైతులకు ప్రత్యక్షంగా ప్రదర్శించారు.

నూనెగింజల పరిశోధన స్థానం రూపొందించిన నూతన ఆముదం విత్తనాలను ప్రయోగాత్మక సాగు కోసం ఎంపిక చేసిన రైతులకు పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయం, ఆధునిక సేద్య పద్ధతుల్లో ఆదర్శంగా నిలిచిన పలువురు ప్రగతిశీల రైతులను కలెక్టర్ సన్మానించారు.కార్యక్రమంలో నామ్ శాస్త్రవేత్తలు రమేష్ నాయక్, సురేష్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి కృష్ణయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీడబ్ల్యూఎంఏ పీడీ విజయకుమార్, ఏపీఎంఐపీ పీడీ దేవానంద, పట్టు పరిశ్రమ శాఖ అధికారిణి శోభారాణి, జిల్లా మార్కెటింగ్ అధికారి హాఫిజుల్లా, వ్యవసాయ శాస్త్రవేత్తలు భాస్కర్‌రెడ్డి, చంద్రాయుడు, రామసుబ్బయ్యతో పాటు వ్యవసాయ శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# ఎరువుల కొరత సృష్టిస్తే సహించేది లేదు.. అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- వంద శాతం పంటల బీమా చెల్లింపులు జరగాలి
- గ్రామగ్రామాన అవగాహన కల్పించాలి

**కోటబొమ్మాళి ఆగస్టు 22, అనంత జనశక్తి న్యూస్**

జిల్లాలో ఏ ఒక్క రైతు ఇబ్బందులు పడకుండా వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందుబాటులో ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.జిల్లాలో 4,08,995 ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణానికి గాను ఇప్పటి వరకు 3,65,604 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఈ సాగు విస్తీర్ణానికి రెండో దశ వరకు 26,440 టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటివరకు 25,860 టన్నుల యూరియాను సరఫరా చేసినట్లు తెలిపారు. ఇందులో సుమారు 12,000 టన్నుల యూరియాను రైతు సేవా కేంద్రాలు, సహకార సొసైటీల ద్వారా రైతులకు అందించినట్లు పేర్కొన్నారు.ప్రస్తుతం జిల్లాలో మరో 11,659 టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులకు ఎలాంటి కొరత లేదని అధికారులు వెల్లడించారు. అదేవిధంగా 3,707 టన్నుల డీఏపీ నిల్వలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరానికి



అనుగుణంగా ఎరువుల సరఫరాను కొనసాగించాలని అధికారులకు మంత్రి సూచించారు.

**అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు**

ప్రైవేటు ఎరువుల డీలర్లు యూరియా, డీఏపీని ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు విక్రయిస్తే కఠినంగా వ్యవహరించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. రైతులకు అవసరం లేని ఇతర ఎరువులను బలవంతంగా అంటగట్టే ప్రయత్నం చేసినా ఉపేక్షించరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘించే డీలర్లపై తక్షణమే చర్యలు తీసుకుని, అవసరమైతే వారి లైసెన్సులు రద్దు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ఎరువుల విషయంలో రైతులు ఒక్క రూపాయి కూడా అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే వెంటనే తనిఖీలు నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.ప్రైవేట్ డీలర్ల వద్ద అందుబాటులో ఉన్న ఎరువుల నిల్వలను కూడా గుర్తించి, ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. డీలర్ల వద్ద ఉన్న స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఎరువులను సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**వంద శాతం పంటల బీమా చెల్లింపులు జరగాలి**

జిల్లాలో అర్హులైన రైతులందరికీ నూటికి నూరు శాతం పంటల బీమా అందేలా వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మంత్రి ఆదేశించారు. ఒక్క అర్హత కలిగిన రైతు కూడా బీమా ప్రయోజనం కోల్పోకుండా గ్రామస్థాయిలో వివరాలను పరిశీలించి, అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. పంటల బీమా, ఎరువుల సరఫరా, సాగు విధానాలు, రైతులకు అందుతున్న ప్రభుత్వ పథకాలపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖ అధికారులపై ఉందన్నారు. అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా ప్రతి గ్రామానికి వెళ్లి రైతులతో నేరుగా మాట్లాడాలని, వారి సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

**కాలువ చివరి భూముల్లో ఆరుతడి పంటలను ప్రోత్సహించాలి**

కాలువల చివరి ప్రాంతాల్లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలను ప్రోత్సహించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ రైతులకు అధిక ప్రయోజనం కలిగే పంటల సాగుపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామస్థాయిలో రైతులకు పంటల ఎంపిక, సాగు పద్ధతులు, ఎరువుల వినియోగంపై వ్యవసాయ శాఖ అధికారులు సూచనలు ఇవ్వాలని తెలిపారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచడంతో పాటు, నకిలీ విత్తనాలు, అధిక ధరలకు ఎరువుల విక్రయాలు, అక్రమ నిల్వలు వంటి వాటిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.

**ప్రతి గ్రామానికీ వెళ్లి రైతులకు అవగాహన కల్పించాలి**

ప్రతి గ్రామాన్ని వ్యవసాయ శాఖ అధికారులు సందర్శించి రైతులకు ప్రభుత్వ పథకాలు, పంటల బీమా, ఎరువుల లభ్యత, ఆరుతడి పంటల సాగు తదితర అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని మంత్రి స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని, సమస్యలు ఉత్పన్నమైన తరువాత స్పందించడం కాకుండా ముందుగానే వాటిని గుర్తించి పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో రైతు సంక్షేమానికి సంబంధించి ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని మంత్రి స్పష్టం చేశారు. రైతులకు అందాల్సిన ప్రతి ప్రభుత్వ ప్రయోజనం సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు కృష్ణారావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు

# నల్లమల సాగర్ కు కృష్ణా జలాలు

- 31న సీఎం చేతుల మీదుగా వెలిగొండ ప్రారంభోత్సవం.
- నిర్వాసితులకు నేడు మరో 250 కోట్లు పరిహారం పంపిణీ.
- జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు.

**అమరావతి ఆగస్టు 22, అనంత జనశక్తి న్యూస్**

వెనుకబడిన, ఫ్లోరైడ్ భాదిత ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల మూడు దశాబ్దాల కల వెలిగొండ ప్రాజెక్టును ఈనెల 31న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. ఈ ప్రాజెక్టు ఫేజ్ 1 ప్రారంభం ద్వారా 10.7 టిఎంసిల కృష్ణమ్మ జలాలను నల్లమల సాగర్ కు ప్రవహింపజేయబోతున్నామని ఆయన వివరించారు.వెలిగొండ నిర్వాసితులకు సంబంధించి మూడవ విడతగా శనివారం ఉదయం 250 కోట్ల రూపాయలను ముఖ్యమంత్రి పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సీఎం క్యాంప్ కార్యాలయం వద్ద రామానాయుడు మీడియాతో మాట్లాడారు.ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు ఉద్దేశించిన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభంతో ఈ జిల్లాల ప్రజల దశ, దిశ మారబోతోందని ఆయన అన్నారు. 1996లో అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు వెలిగొండకు శ్రీకారం చుట్టారని, మళ్లీ ఆయనే, నేడు ముఖ్యమంత్రిగా వెలిగొండను ప్రారంభించబోతుండటం ఒక చరిత్రగా రామానాయుడు అభివర్ణించారు. ఈ ప్రాజెక్టు వల్ల 4.47 లక్షల ఎకరాలకు సాగు, 23 లక్షల మందికి త్రాగు నీరందుతుందని ఆయన చెప్పారు. అలాగే వెలిగొండ నిర్వాసితులకు మూడు దశల్లో కేవలం 40 రోజుల వ్యవధిలో 760 కోట్ల రూపాయలను అందజేయటం, నిర్వాసితుల పట్ల ముఖ్యమంత్రికి ఉన్న బాధ్యతకు,ఆదరాభిమానాలకు నిదర్శనం అన్నారు. వెలిగొండ కు భూములు ఇచ్చిన త్యాగధనులకు పరిహారం ఇచ్చాకే, నీళ్ళు వదలాలని చంద్రబాబు చెప్పిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాగే ప్రతిష్టాత్మక పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు 2250 కోట్లు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఈ రెండేళ్లలో ఇచ్చిన సంగతి కూడా ఆయన తెలియజేశారు. మొత్తం మీద కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ రెండేళ్ళలోనే, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వాసితులకు 3 వేల కోట్లు పరిహారం అందజేశామన్నారు.వెలిగొండ ప్రాజెక్టు లో అర్హత ఉన్న ఆఖరి నిర్వాసితుడి వరకు న్యాయం చేస్తామని రామానాయుడు హామీ ఇచ్చారు. కాగా నాడు గొడ్డలి పార్టీ ప్రభుత్వ హయాంలో వెలిగొండ పనులు పూర్తవ్వకుండా, జగన్ జాతికి అంకితం చేసి ప్రకాశం జిల్లా ప్రజలను మోసం చేశాడన్నారు. ఎల్ నినో వంటి క్లిష్ట సమయం లో నల్లమల సాగర్ కు 10.7 టీఎంసీ ల కృష్ణా జలాలను తీసుకొస్తున్నా మంటే చంద్రబాబు ముందుచూపుకి, దార్శనికతకు నిదర్శనం అని అన్నారు. భవిష్యత్ లో వెలిగొండ నీళ్లతో



ప్రకాశం జిల్లా సస్యశ్యామలం కాబోతోంది అన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు తో పాటు ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసుల రెడ్డి, ఎమ్మెల్యేలు కందుల నారాయణ రెడ్డి, ఉగ్రనరసింహారెడ్డి, అశోక్ రెడ్డి, యర్రగొండపాలెం టిడిపి ఇంఛార్జ్ ఎరిక్షన్ బాబు, వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులు పాల్గొన్నారు.

# చిన్న వయసు నుంచే వ్యక్తిగత పరిశుభ్రత నేర్చుకోవాలి



- విద్యార్థులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచన
- రాజేంద్ర మున్సిపల్ స్కూల్లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం
- ఎంపీ అంబికాతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి

**అనంతపురం ఆగస్ట్ 22, అనంత జనశక్తి న్యూస్**

చిన్న వయసు నుంచే వ్యక్తిగత పరిశుభ్రత నేర్చుకోవాలని.. విద్యార్థులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. రాజేంద్ర మున్సిపల్ స్కూల్లో జరిగిన స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి పాల్గొన్నారు. ముందుగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక టీడీపీ నాయకులు, మున్సిపల్ అధికారులతో కలిసి స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. విద్యార్థులకు పరిశుభ్రతపై ఎమ్మెల్యే, ఎంపీ అధికారులు అవగాహన కల్పించారు. భోజనంకి ముందు, తర్వాత చేతులు బాగా కడగాలని.. ప్రతి రోజు స్నానం చేయాలన్నారు. మీ ఇంట్లో కానీ, పాఠశాలలో కానీ చెత్తను బుట్టల్లో మాత్రమే వేయరాదని.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మీ ఇంటి వద్ద, పాఠశాలలో మొక్కలను సంరక్షించాలని.. పరిశుభ్రతపై ఇంట్లో తల్లిదండ్రులకు కూడా మీరు చెప్పాలని ఎమ్మెల్యే దగ్గుపాటి సూచించారు. అనంతరం విద్యార్థుల విద్యార్థులతో స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శాఖ ఎస్ఈ, ఇంచార్జ్ కమిషనర్ రాజశేఖర్, MHO రాజారవీంద్ర, కార్పొరేషన్ డైరెక్టర్లు రంగాచారి, పి ఎల్ ఎన్ మూర్తి, బెస్త పవన్ కుమార్, పోతుల లక్ష్మీనరసింహులు, పరమేశ్వర్, కడియాల కొండన్న, టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, టిడిపి నాయకులు పుల్లన్న, సాకే లక్ష్మీనరసింహ, మారుతి కుమార్ గౌడ్, సున్నం శ్రీనివాసులు, కదిరప్ప, గోపాల్ గౌడ్, వన్నురప్ప, దాడి రమేష్, సికిందర్, మనోహర్ నాయుడు, బిల్డర్ రాము, వంశీ, డిష్ నాగరాజు, యమున, జైనుభి, సుజాతమ్మ, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్



- కొత్తపేట మున్సిపల్ హైస్కూల్‌లో పరిశుభ్రతపై అవగాహన.....

**ధర్మవరం ఆగష్టు 22 అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ శనివారం ధర్మవరం పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, పారిశుధ్యాన్ని పాటించడం, పరిసరాల పరిశుభ్రత పై విద్యార్థులు, ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి అంశాలకు ప్రాధాన్యతనిచ్చారు.స్వచ్ఛత అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించి, పాఠశాలలు, నివాస ప్రాంతాలు, బహిరంగ ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రేపు అమీనా ఆప్టికల్స్ లో ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరం

**యాడికి, ఆగష్టు 22,అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రంలో ఉన్న అమీనా ఆప్టికల్స్ నందు సోమవారం అమీనా ఆప్టికల్స్ సౌజన్యంతో ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరంను నిర్వహిస్తున్నట్టు శనివారం నిర్వాహకుడు క్యాంప్ ఇన్చార్జి తిప్పేస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1గంటల వరకు అమీనా ఆప్టికల్స్ నందు కర్నూలు కు చెందిన శాంతి రామ్ ఐ కంటి ఆసుపత్రి సిబ్బంది చే కంటి శిబిరం నిర్వహించబడునని తెలిపారు. కంటిలో శుక్లములు ఉన్నవారికి పరీక్షలు చేసి, ఆపరేషన్లు పూర్తిగా ఉచితంగా చేయబడునని తెలిపారు. ఈ శిబిరములో కంటి ఆపరేషన్లు అర్హులైన వారికి శాంతి రామ్ ఐ కంటి ఆసుపత్రి కి తీసుకెళ్ళి. ఉచితముగా కంటి ఆపరేషన్లు చేయించి, తిరిగి తీసుకొనిరావడం జరుగునని తెలిపారు. కంటి నిపుణుల సలహాలతో, కళ్ళలో ఉచిత లెన్స్ కూడా అమర్చబడునని, ఆపరేషన్ల కొరకు వెళ్ళిన వారికి భోజనము, వసతి, ఇతర సౌకర్యములు ఉచితం గా కల్పించబడునని తెలిపారు. కంటి ఆపరేషన్లు మా శిబిరంలో చేయించుకున్న వారికి కంటి అద్దములు ఉచితముగా ఇవ్వబడునని తెలిపారు. ఎంప్లాయిస్ హెల్త్ కార్డ్ ద్వారా శుక్లం ఆపరేషన్ ఉచితంగా చేయబడునని, ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న వారికి కంటి ఆపరేషన్ ఉచితంగా చేయబడునని తెలిపారు. శిబిరమునకు వచ్చువారు తలస్నానం చేసి, శుభ్రమైన బట్టలు ధరించి రావలయునని, కంటి పరీక్షలు, ఆపరేషన్లకు అవసరమగు వారు ప్రతి ఒక్కరూ మీ వారి ఫోన్ నెంబరు, రెండు రేషన్ కార్డు లేదా రెండు ఓటర్ కార్డు, రెండు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, 2 ఫోటోలు తప్పకుండా తీసుకొని రావలెనని తెలిపారు. ఈ అవ కాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.వివరాల కోసం 77994 84948, 63028 30308 సంప్రదించవచ్చు అని తెలిపారు.

అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం
ఆదివారం | అనంతపురం
23.08.2026



# ఆరోగ్య వ్యవస్థను డిజిటలైజేషన్, పారదర్శకంగా రోగులకు సేవలు

- రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్య సేవలను సంజీవని కార్యక్రమం ద్వారా డిజిటలైజేషన్
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జి.వీర పాండ్యన్.

**అనంతగిరి,ఆగష్టు22:అనంత జనశక్తి న్యూస్**

ఆరోగ్య వ్యవస్థలో నూతనqఅధ్యాయం, రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్య సమాచార డిజిటలైజేషన్ ప్రజలందరికీ మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య రంగాన్ని డిజిటలైజ్ చేస్తూ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమం కింద రాష్ట్రంలోని ప్రతి పౌరుడి పూర్తి ఆరోగ్య వివరాలను (Medical History) డిజిటల్ రూపంలో నిక్షిప్తం చేయడం జరుగుతోందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జి వీర పాండ్యన్ వెల్లడించారు.శనివారం ఉదయం అరకువ్యాలీ మండలం, గన్నెల పంచాయతీ, గన్నెల పిహెచ్ సి ను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. పీహెచ్ సి నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంజీవని కార్యక్రమాన్ని ప్రారంభించనున్న సందర్భంగా ఆయన జిల్లా కలెక్టర్ నిశాంతి టి,జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీ పూజ, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ లతో కలిసి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాటులను పరిశీలించి, స్వర్ణ గ్రామ సచివాలయ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా, మండల స్థాయి అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా గిన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను పరిశీలించి, నిర్వహణ ఏర్పాట్లును ప్రతి ఒక్క విషయాన్ని డాక్టర్లను, అధికారు లను వివరాలు అడిగి తెలుసుకుని తగు సూచనలు సలహాలను అందించారు. ఈ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వినూత్న ప్రక్రియలో భాగంగా డిజిటల్ చేసిన కార్యక్రమాన్ని గన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి తక్షణ వైద్య సమాచారం,రోగుల గత వైద్య చరిత్ర, మందుల వివరాలు, మందుల లభ్యత, డాక్టర్ నిర్వహించిన వైద్య పరీక్షల నివేదికలు డిజిటల్ విధానంలో అందుబాటులో ఉండటం వల్ల వైద్యులు మరింత సమర్ధవంతంగా సేవలు అందించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు.రోగులకు మెరుగైన చికిత్స, నాణ్యతతో కూడిన వైద్యం, ఈ కార్యక్రమం కేవలం ఒక సాఫ్ట్‌వేర్ ప్రక్రియ మాత్రమే కాకుండా, రోగులకు లభించే వైద్య చికిత్స నాణ్యతను మరింత పెంచడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని



ఆయన వివరించారు.

డిజిటలైజేషన్ వలన అత్యవసర సేవలు & మందుల సరఫరా, మందుల కొరత లేకుండా చూడటం, రవాణా ఆలస్యం లేదా డ్రైవర్ల లభ్యత సమస్యల వల్ల అత్యవసర వైద్య సేవలకు అవరోధం కలగకుండా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని తెలియజేశారు. ఆసుపత్రులలో వైద్యుల పనితీరు, ఇతర సేవలు నిరంతర పర్యవేక్షణ తోపాటు రాష్ట్రంలోని ఒక జిల్లా నుండి మరొక జిల్లాకు సమాచార మార్పిడి సులభతరం చేస్తూ, మారుమూల ప్రాంతాల ప్రజలకు కూడా నిపుణులైన వైద్యుల సలహాలు అందుబాటులోకి తెస్తున్నామన్నారు.వచ్చే వారం గౌరవ ముఖ్యమంత్రి వర్యుల చేతుల మీదుగా ప్రారంభంకానున్న ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం వేగవంతం చేసిందని జిల్లా అధికారులందరూ వారికి కేటాయించిన పనులన్నీ త్వరతగా పూర్తి చేయాలని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాటుకు సంబంధించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హెలిపేడ్ , ప్రజా నివేదిక ఏర్పాట్లు, పీహెచ్సీ సంబంధించిన వివరాలు, సి ఏం పర్యాటన ఏర్పాట్లను వివరిస్తూ అధికారులకు నిర్దేశించిన విధంగా జిల్లాకు సంబంధించిన వారి వారి శాఖల యొక్క ప్రగతి నివేదిక ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ చూచించారు. ఈ పర్యటన కార్యక్రమంలో విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ దున్నదొర, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మి, రెవెన్యూ డివిజనల్ అధికారి భుజంగ రావు, జిల్లా వైద్యారోగ్య అధికారి , వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ,పిడి డ్వామా, పిడి డిఆర్డిఏ, అటవీశాఖ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, జిల్లా మండల స్థాయి అధికారులు, రెవిన్యూ వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ...



- నిరంతరం పటిష్టమైన నిఘా ఉండాలి.
- శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్.

**శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, ఆగష్టు 22, అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం జిల్లాకు సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్ వద్ద 24 గంటలూ, ఏడు రోజులూ నిరంతరం పటిష్టమైన నిఘా కొనసాగించాలని జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న నెలవారీ తనిఖీల్లో భాగంగా శనివారం ధర్మవరం పట్టణంలోని మార్కెట్ యార్డులో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోడౌన్ వద్ద ఏర్పాటు చేసిన భద్రతా చర్యలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరాల నిఘా, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను పరిశీలించి, ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఈవీఎంల భద్రత, నిర్వహణకు సంబంధించి రాజకీయ పార్టీ ప్రతినిధులు అడిగిన పలు సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, ధర్మవరం తహసీల్దార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల ధర్నా...



- 'నేతన్న సేవ' పథకం డబ్బులు అందలేదని కలెక్టర్ కు మొరపెట్టుకున్న కార్మికులు.....

**ధర్మవరం ఆగష్టు 22, అనంత జనశక్తి న్యూస్ :**

ధర్మవరం 'నేతన్న సేవ' పథకంలో భాగంగా తమకు అందాల్సిన ఆర్థిక సాయం ఖాతాల్లో జమ కాలేదని ఆరోపిస్తూ చేనేత కార్మికులు ధర్మవరం మార్కెట్ యార్డు ఎదురుగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా తమ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, అర్హత ఉన్నప్పటికీ పథకం ప్రయోజనం అందని కార్మికులకు న్యాయం చేయాలని మొరపెట్టుకున్నారు. పథకం అమలులో తమకు అన్యాయం జరిగిందని, అర్హులైనప్పటికీ కొంతమందికి నగదు అందలేదని కార్మికులు కలెక్టర్‌కు వివరించారు. దీని పై స్పందించిన జిల్లా కలెక్టర్ అర్హులైన ప్రతి కార్మికుడికి 'నేతన్న సేవ' పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పథకం అమలులో అక్రమాలకు పాల్పడినట్లు తేలితే సంబంధిత అధికారుల పై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అర్హులైన చేనేత కార్మికులకు ప్రభుత్వ పథకం అందేలా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఆదేశించారు.

## క్షయ వ్యాధి నిర్ధారణ కోసం పరీక్షలు.

**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 22 అనంత జన శక్తి న్యూస్.**

క్షయ వ్యాధి నిర్ధారణ కొరకు డాక్టర్ గాయత్రి ఆధ్వర్యంలో శనివారం పరీక్షలను నిర్వహించారు.

టి.బి.ముక్త భారత్ అభియాన్ 2.0 కార్యక్రమం లో పుట్టపర్తి మండల పరిధిలోని రాచువారి పల్లె మార్లపల్లి గ్రామం లో క్షయ వ్యాధి నిర్ధారణ కోసం "హ్యాండ్ హెల్డ్ ఎక్స్ రే "పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్ష చక్కెర వ్యాధి గ్రస్తులకు , 60 ఏళ్లు పైబడిన వారికి, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు , ధూమపానం,పొగాకు సేవించు వారికి, ఇటుక బట్టీ లు, పరిశ్రమలలో పని చేయు వారికినిర్వహించారు. ఈ పరీక్ష ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా రిపోర్ట్ ను రెండు నిమిషాల లో తెలియజేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో టీవీ సూపర్వైజర్ అబీబ్ భాషా, సిహెచ్ .ఓ కె.శివరాం, హెల్త్ సూపర్ వైజర్లు ఆర్ .చంద్ర కళ, బి.వి.రమణ, యం. యల్ .హెచ్ .పి జి. విజయ భాస్కర్ , టి.బి. సూపర్ వైజర్ అబీద్ బాషా, ల్యాబ్ సూపర్ వైజర్ ఎరికలప్ప , ఏ.యన్.యం కే.బి.సుగుణమ్మ, ఆశా కార్యకర్తలు జానకి , రత్నమ్మ , మహేశ్వరి , సునందమ్మ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# చిన్నారుల్లో వైకల్యాలను గుర్తించడంపై అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ



**రాప్తాడు, ఆగస్టు 22 అనంత జనశక్తి న్యూస్**

జ్ఞాన జ్యోతి ట్రైనింగ్ 120లో భాగంగా మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు రెండో విడత శిక్షణా కార్యక్రమం శనివారం నిర్వహించారు. మండల ఎం.ఈ.ఓ. మల్లికార్జున, ఐసీడీఎస్ సీడీపీఓ ఉమాశంకరమ్మ, ఆదేశాల మేరకు ఈ శిక్షణ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా చిన్నారుల్లో పుట్టుకతోనే లేదా ఎదుగుదల సమయంలో కనిపించే వివిధ రకాల వైకల్యాలను ముందుగానే గుర్తించే విధానాలపై అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. మొత్తం 21 రకాల వైకల్యాలపై శిక్షణ ఇచ్చారు. ఇందులో అంధత్వం, తక్కువ దృష్టి, వినికిడి లోపం, భాషా లోపం, శారీరక వైకల్యం, బుద్ధిమాంద్యం, అభ్యసనా వైకల్యం, మెదడు పక్షవాతం, ఆటిజం, బహుళ వైకల్యం, కుష్టు వ్యాధి, మరుగుజ్జుతనం, దీర్ఘకాలిక నరాల సమస్యలు, కండరాల క్షీణత, బహుళ నాడీ బలహీనత, మానసిక రుగ్మత, యాసిడ్ దాడి బాధితుల్లో ఏర్పడే వైకల్యం, తలసేమియా, రక్తం గడ్డకట్టని స్థితి, రక్తహీనత తదితర అంశాలపై వివరించారు.

చిన్నారుల్లో ఇలాంటి లక్షణాలను పుట్టినప్పటి నుంచే గుర్తించి, అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేయించడంతో పాటు 'భవిత' సెంటర్లకు రెఫర్ చేయాలని సూచించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను వివక్షకు గురిచేయకుండా గౌరవించాలని, ఇతర పిల్లలతో సమానంగా విద్యా అవకాశాలు కల్పించాలని సూచించారు.

జ్ఞాన జ్యోతి 120 శిక్షణకు హాజరైన అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి పుస్తకాలను కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ డీఆర్పీలుగా రామ్మూర్తి, సూర్యనారాయణ, వెంకట్ నాయుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లీలావతి, శ్రీవాణితో పాటు మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నోటీసు పొందిన ఓటర్లు తమకు కేటాయించిన తేదీన తప్పనిసరిగా విచారణకు హాజరుకావాలి

- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..

**అనంతపురం, ఆగస్టు 22 : అనంత జనశక్తి న్యూస్**

అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో శనివారం ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పై జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ప్రెస్ మీట్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత రెండు నెలలుగా జిల్లాలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాలు జరుగుతున్నాయని, నెల రోజుల పాటు డోర్‌టుడోర్ క్యాంపెయిన్ నిర్వహించి ఎన్యుమరేషన్ ఫారాలు సేకరించి, డ్రాఫ్ట్ పబ్లికేషన్ పూర్తి చేయడం జరిగిందన్నారు. ప్రధాన రాజకీయ పార్టీలన్నింటికీ ఓటర్ల జాబితా (ఎలక్టోరల్ రోల్స్) కాపీలను అందజేశామన్నారు. ప్రతి బూత్ పరిధిలో ఆబ్సెంట్ (Absent), షిఫ్టెడ్ (Shifted), డెత్ (Death), డబుల్ (Double) మరియు ఇతర కేటగిరీల ఓటర్ల వివరాలను పంచాయతీలు మరియు ఇతర బహిరంగ ప్రదేశాలలో అందుబాటులో ఉంచామన్నారు. మ్యాపింగ్ లేనివి మరియు సమాచార లోపాలున్న కేటగిరీలలో జిల్లా వ్యాప్తంగా 3,83,391 మందికి నోటీసులు జారీ చేయాల్సి ఉండగా, ఇప్పటికే 3,11,788 మందికి నోటీసులు సర్వ్ చేయడం జరిగిందని, మిగిలిన దాదాపు 70,000 నోటీసులను రాబోయే 34 రోజులలో (రోజుకు 10,000 నుండి 15,000 చొప్పున) పూర్తి చేస్తామన్నారు.ఇప్పటివరకు 1,06,967 మందికి సంబంధించి విచారణ (హియరింగ్) ప్రక్రియ పూర్తయిందని, వీటిలో 83,376 మంది వివరాలను పరిశీలించి, సరైనవిగా నిర్ధారించుకుని ఫైనల్ పబ్లికేషన్ కోసం ఖరారు చేశామన్నారు. ఇది కాకుండా, డ్రాఫ్ట్ నోటీసుల ఆధారంగా దాదాపు 3,94,000 మంది ఓటర్లను ఈఆర్ఓ / ఏఈఆర్ఓల పరిశీలన ద్వారా ఫైనల్ చేయడం జరిగిందని, రాబోయే 10 నుండి 15 రోజుల్లో ఈ ప్రక్రియ అంతా పూర్తి చేస్తామన్నారు. రోజుకు దాదాపు 15,000 విచారణలు (హీరింగ్స్) జరుగుతున్నాయన్నారు. ప్రతి ఈఆర్ఓ పరిధిలో 10 నుండి 25 మంది ఏఈఆర్ఓలను నియమించడం జరిగిందన్నారు. శింగనమలలో 30,000 వరకు ఉండగా, అనంతపూర్ అర్బన్ అసెంబ్లీ పరిధిలో అత్యధికంగా 90,000 కి పైగా నోమ్యాపింగ్/తప్పులు ఉన్నందున అక్కడ 25 మంది ఏఈఆర్ఓలను నియమించామని, తక్కువ ఉన్న చోట్ల అయితే 10 నుంచి 15 వరకు ఏఈఆర్ఓలను నియామకం చేయడం జరిగిందన్నారు. నోటీసు పొందిన ఓటర్లు తమకు కేటాయించిన తేదీన తప్పనిసరిగా విచారణ (హీరింగ్)కు హాజరుకావాలన్నారు. ఒకవేళ కేటాయించిన తేదీన హాజరుకాలేని పక్షంలో, స్థానిక బిఎల్ఓని సంప్రదించి ప్రత్యామ్నాయ తేదీల్లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. విచారణకు హాజరుకాకపోతే ఓటరు అక్కడ లేనట్లుగా భావించి, ఆ ఓటును తొలగించే అవకాశం ఉంటుంది కావున ఓటర్లందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

**- ఈనెల 23 మరియు 29, 30 తేదీలలో స్పెషల్ క్యాంపైన్ డేస్...:**

ఎస్ఐఆర్ లో భాగంగా క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాల కోసం ఆగస్టు 22, 23 మరియు 29, 30 తేదీలలో (శనివారాలు మరియు ఆదివారాలు) ప్రత్యేక ప్రచార దినాలు(స్పెషల్ క్యాంపైన్ డేస్)గా నిర్ణయించడం జరిగిందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ తెలిపారు. ఈరోజు శనివారం స్పెషల్ క్యాంపైన్ డే నిర్వహించామన్నారు. ఈ ప్రత్యేక ప్రచార రోజులలో, ప్రతి పోలింగ్ స్టేషన్ యొక్క బూత్ లెవెల్ ఆఫీసర్, రాజకీయ పార్టీలచే నియమించబడిన బూత్ లెవెల్ ఏజెంట్‌లతో కలిసి ఆయా పోలింగ్ స్టేషన్లలో



ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు.పోలింగ్ కేంద్రంలో జాబితాలను పరిశీలించడానికి, దరఖాస్తులను స్వీకరించడానికి, దరఖాస్తుదారులకు మార్గనిర్దేశం చేయడానికి మరియు వారి సందేహాలను నివృత్తి చేయడానికి, ముసాయిదా ఓటర్ల జాబితాలు పరిశీలించడానికి / ASDD (ఆబ్సెంట్, షిఫ్ట్, డెత్, డబుల్) జాబితాలకు సంబంధించి జాబితాలు BLOలకు అందుబాటులో ఉంచాలన్నారు. కొత్తవారు ఓటరుగా నమోదు కోసం ఫామ్ 6 అప్లయి చేయాలి. మార్పులు, చేర్పులకు సంబంధించి ఫామ్ 8 దరఖాస్తులు చేయవచ్చును. స్పెషల్ క్యాంపైన్ డేస్ పై విస్తృత ప్రచారం కల్పించాలని, దీనిని అందరూ ఉపయోగించుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మలోల, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సమ్మె నోటీసు ఇచ్చిన కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు

- జిల్లా కేంద్రం నుంచి పీ.హెచ్.సీలకు సమ్మె ప్రభావం
- వెంటనే డిమాండ్లు పరిష్కరించాలన్న అధ్యక్షురాలు శ్రీదేవి

**అనంతపురం ఆగస్ట్ 22, అనంత జనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ నర్సులు స్ట్రైక్ నోటీసులు ఇచ్చారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం శుక్రవారం నుంచి నుంచి దశలవారీ ఆందోళనలు, సమ్మె నోటీసుల బాట పట్టారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నిరసనలు ప్రారంభమయ్యాయి. గత జూన్ 17న విజయవాడలో పెద్ద ఎత్తున నిరసన తెలిపినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి



సానుకూల స్పందన రాకపోవడంతో సిబ్బంది ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇందులో ఏపీ గవర్నమెంట్ కాంట్రాక్టు నర్సెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవితో పాటు ఇతర సభ్యులు స్ట్రైక్ నోటీసులు ఇచ్చారు. జిల్లా సర్వజనాసుపత్రిలోని సూపరింటెండెంట్, ఆర్ఎంఓ, వైద్య కళాశాల ప్రిన్సిపల్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డిప్యూటీ సుప్రిండెంట్ గారికి,వివిధ డిపార్ట్మెంట్లలోని హెచ్ఓడీలు, పీహెచ్.సీలోని మెడికల్ ఆఫీసర్లకు నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న నర్సులు, ఇతర సిబ్బందిని రెగ్యులర్ చేయాలన్నారు. శాశ్వత ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నందున, వేతనాల వ్యత్యాసాన్ని తొలగించాలన్నారు.

విధి నిర్వహణలో మరణించిన ప్రతి కాంట్రాక్ట్ ఉద్యోగి కుటుంబానికి 50 లక్షల ఎక్స్ గ్రేషియా అందిస్తూ, వారి కుటుంబంలో ఒకరికి కాంట్రాక్ట్ ఉద్యోగం కల్పించాలని, ఈపీఎఫ్ పరస్పర బదిలీలు వంటి వాటిని పరిష్కరించాలన్నారు. జేఏసీ నిర్ణయం మేరకు సమ్మె బాటలోకి వెళ్లామని.. ప్రభుత్వం ఇప్పటికైనా దిగి వచ్చి తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ గా ప్రశాంతి, ఉపాధ్యక్షులుగా సుజాత, శ్రీకాంత్ వెంకటేష్ నాయక్, జేఏసీ కన్వీనర్ లావణ్య తదితర స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

# వేరుశనగ కాయల పంపిణీలో అవకతవకలపై విచారణకు డిమాండ్..

**గాండ్లపెంట, ఆగస్ట్,22, అనంత జనశక్తి న్యూస్,**

మండల పరిధిలోని తుపల్లి పంచాయతీలో రైతులకు వేరుశనగ కాయల పంపిణీలో అవకతవకలు జరిగాయని రైతులు ఆరోపించారు. గత జూలై నెలలో అతియా ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతులకు వేరుశనగ కాయలను పంపిణీ చేసినట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో కటకం గంగిరెడ్డి, కటకం శ్రీనాథరెడ్డి మాట్లాడుతూ తమ పంచాయతీలోని కొంతమంది రైతులకు వేరుశనగ కాయలు అందగా, మరికొందరికి ఇప్పటివరకు అందలేదని పేర్కొన్నారు. తుపల్లి పంచాయతీకి చెందిన పది మంది రైతులు కలిసి శ్రీ ఆంజనేయ గ్రూపు పేరుతో నమోదు చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం కదిరి



ఎస్‌బీఐ బ్యాంకులో ఒక్కో రైతు రూ.2,000 చొప్పన మొత్తం రూ.20,000లను అతియా కంపెనీ పేరుతో డిపాజిట్ చేసినట్లు వివరించారు. అయితే, నగదు జమ చేసిన రైతులందరికీ వేరుశనగ కాయలు పంపిణీ చేయాల్సి ఉండగా, కొంతమందికి మాత్రమే పంపిణీ చేసి, మరికొందరికి ఇవ్వలేదని వారు ఆరోపించారు. వేరుశనగ కాయల పంపిణీకి సంబంధించి రైతుల నుంచి తీసుకున్న నగదు, గ్రూపుల నమోదు, రైతుల జాబితా, కేటాయించిన వేరుశనగ కాయల పరిమాణం, పంపిణీ చేసిన రైతుల వివరాలను అధికారులు పరిశీలించాలని కోరారు. అర్హత ఉన్నప్పటికీ వేరుశనగ కాయలు అందని రైతులను గుర్తించి వారికి వెంటనే పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. కదిరి నియోజకవర్గ వ్యాప్తంగా అతియా ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ద్వారా వేరుశనగ కాయల పంపిణీ జరిగిన అన్ని గ్రామాల్లోనూ సమగ్ర విచారణ చేపట్టాలని వారు కోరారు. ఏయే గ్రామాల్లో ఎంతమంది రైతులు నమోదు చేసుకున్నారు, ఎంత మొత్తంలో నగదు జమ చేశారు, ఎంతమంది రైతులకు వేరుశనగ కాయలు పంపిణీ చేశారు అనే వివరాలను గ్రామాల వారీగా సేకరించాలని తెలిపారు. రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. పంపిణీ ప్రక్రియలో అవకతవకలు జరిగినట్లు విచారణలో తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు, నష్టపోయిన రైతులందరికీ న్యాయం చేయాలని కటకం గంగిరెడ్డి, కటకం శ్రీనాథరెడ్డి డిమాండ్ చేశారు. రైతులకు అందాల్సిన పథకాల ప్రయోజనాలు పారదర్శకంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం..



**గాండ్లపెంట, ఆగస్ట్, 22, అనంత జనశక్తి న్యూస్,**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర (సాసా) కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యవంతమైన పాఠశాలలుఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి మోహనరావు అధ్యక్షతన వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, చేతులు శుభ్రంగా కడుక్కోవడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా మండల ఎంపీడీవో రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. భోజనానికి ముందు, అనంతరం చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం అలవాటుగా మార్చుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా అనేక రకాల వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంతో పాటు విద్యార్థులు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పాటించాలని సూచించారు విద్యార్థులు తమ ఇళ్లలోనూ, గ్రామాల్లోనూ పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని అధికారులు తెలిపారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించి, పరిశుభ్రత పాటించాలని ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో వీఆర్డీ సునీత, ఎంఈఓ శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు వసుంధర, డాక్టర్ మహేష్ మారుతి, సూపర్వైజర్ ఉపేంద్రరెడ్డి, నాగేష్, పలువురు అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# టీచింగ్ నాన్ టీచింగ్ యూనివర్సిటీకి రెండు కళ్ళు



**- ఎస్కేయూ ఉపకులపతి ప్రొఫెసర్ జ్యోతి కుమార్**

**ఎస్కేయూ ఆగస్టు 22 , అనంత జనశక్తి న్యూస్**

టీచింగ్ నాన్ టీచింగ్ యూనివర్సిటీ కి రెండు కళ్ళని ఉపకులపతి ప్రొఫెసర్ జ్యోతి కుమార్ పేర్కొన్నారు. శనివారం టైం స్కేల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉపకులపతి ప్రొఫెసర్ జ్యోతి కుమార్ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబులను ఘనంగా సన్మానించారు. సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ జ్యోతి కుమార్ మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి అభివృద్ధికి యూనివర్సిటీ కట్టుబడి ఉందని, ప్రతి ఉద్యోగి కష్టపడి యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. కేడర్వైజ్ టైం స్కేల్ ఉద్యోగులకు పాలకమండలి సమావేశంలో ఆమోదించినందుకు ఉపకుల పతికి ఉద్యోగుల కృతజ్ఞతలు తెలిపారు. టైం స్కేల్ సంఘ నాయకులు మాట్లాడుతూ మొత్తం 150 కుటుంబాలకు లబ్ధి చేకూడిందని యూనివర్సిటీ కి రుణపడి ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టైం స్కేల్ ప్రెసిడెంట్ కె. చంద్రశేఖర్ నాయుడు, వైస్ ప్రెసిడెంట్ బి. శివయ్య, సెక్రటరీ హెచ్. బి. సంజీవప్ప, ఆర్గనైజేషన్ సెక్రటరీ బి. నారాయణప్ప, ట్రెజరర్ కే. రమేష్, గౌరవ అధ్యక్షుడు టి. హనుమంతప్ప ఉద్యోగులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయులకు గాయాలు

**కళ్యాణదుర్గం ఆగస్టు 22, అనంత జనశక్తి న్యూస్**

కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి సోలార్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు ఉపాధ్యాయులకు గాయాలయ్యాయి. కుందుర్పి మండలం ఎనుములదొడ్డి , పరిసర గ్రామాల ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు విధులు ముగించుకుని తుఫాన్ వాహనం (ఏపీ 02 TC 6218)లో అనంతపురం వైపు వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన కర్ణాటక రాష్ట్రానికి చెందిన షిఫ్ట్ డిజైర్ కారు (కె ఎ 51 ఎమ్ ఎల్ 3023) ఢీకొన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారిని స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అంబులెన్సుల ద్వారా కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన కొందరిని మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించినట్లు సమాచారం. కర్ణాటక కారు డ్రైవర్ అజాగ్రత్తగా వాహనం నడుపుతూ ఉపాధ్యాయులు ప్రయాణిస్తున్న తుఫాన్ వాహనం కుడి వెనుక భాగాన్ని ఢీకొట్టడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. అయితే ప్రమాదానికి అసలు కారణం పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ప్రమాదంపై ఇప్పటివరకు పోలీస్ స్టేషన్‌కు ఎవరూ ఫిర్యాదు చేయలేదని కళ్యాణదుర్గం రూరల్ సీఐ గంగాధర్ తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి, ప్రమాదానికి దారితీసిన కారణాలపై సమగ్ర దర్యాప్తు చేపడతామని ఆయన పేర్కొన్నారు.



# చాటింగ్ చేస్తోందని భార్యను చంపేసి.. మృతదేహాన్ని నదిలో విసిరేసి..

యానాం: అనంత జనశక్తి న్యూస్

పరాయి వ్యక్తితో చాటింగ్ చేస్తోందనే అనుమానంతో భార్యను చంపేసి నదిలో పడేశాడో వ్యక్తి. ఈ ఘటన యానాంలో (yanam) చోటు చేసుకుంది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. యానాం పరిధి కనకాలపేటకు చెందిన చెక్కా అప్పారావు(29), భీంనగర్‌కు చెందిన పువ్వల రేఖ (26) ఆరేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి నాలుగేళ్ల బాబు, రెండేళ్ల పాప ఉన్నారు. అప్పారావు చేపలు వేటాడుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వేరేవాళ్లతో రేఖ చాటింగ్ చేస్తోందని వారిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి.

శుక్రవారం రాత్రి 8.30కు ఇంటికొచ్చిన అప్పారావు కుమారుడికి తన చరవాణి ఇచ్చి స్నానానికి వెళ్లాడు. తిరిగొచ్చేసరికి ఆ ఫోన్ నుంచే భార్య చాటింగ్ చేస్తూ కనిపించింది. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆవేశంతో భార్య ముఖంపై పిడిగుద్దులు గుద్దాడు. కిందపడిపోయిన భార్య ఛాతీపై కూర్చుని గొంతు నులమడంతో ఊపిరాడక ఆమె చనిపోయింది. రాత్రి 11 గంటలు దాటిన తర్వాత అప్పారావు తన సోదరుడికి చెందిన ఆటోలో మృతదేహాన్ని తీసుకెళ్లి మెట్టకూరు గణపతినగర్ వద్ద వంతెనపై నుంచి కోరింగ నదిలో విసిరేశాడు. శనివారం పోలీసుస్టేషన్‌కు వెళ్లి తన భార్య కనిపించట్లేదని ఫిర్యాదు చేశాడు. పొంతన లేకుండా మాట్లాడుతున్న అప్పారావును పోలీసులు తమ శైలిలో విచారించగా నిజాన్ని ఒప్పుకొన్నాడు. ఎస్సై పట్టాభిరామయ్య, పోలీసులు నిందితుడిని వెంటబెట్టుకుని నదిలో గాలించారు. వంతెన నుంచి సుమారు 300 మీటర్ల దూరంలో రేఖ మృతదేహం లభించగా యానాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



# నగరపాలక సంస్థలో ఫైల్స్ ఎక్కడ పెండింగ్ లో ఉండకూడదు

**- నగరపాలక సంస్థ ఎస్ ఈ కి ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశాలు**

**- క్యాంపు కార్యాలయంలో ఎస్.ఇ తో సమావేశం.. పలు అంశాలపై సమీక్ష**

**అనంతపురం ఆగస్ట్ 22, అనంత జనశక్తి న్యూస్**

నగరపాలక సంస్థలో పన్నుల బకాయిలపై ప్రత్యేకంగా దృష్టి సారించి ఆదాయం పెరిగే విధంగా చూడాలని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మున్సిపల్ SEను ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆయన తన క్యాంపు కార్యాలయంలో SE, టౌన్ ప్లానింగ్ అధికారితోపాటు ఇతర అధికారులతో సమావేశం అయ్యారు. నగర పాలక సంస్థల సిబ్బంది పనితీరు, హాజరు శాతం, పెండింగ్ లో ఉన్న ఫైళ్ల గురించి ఆరా తీశారు. ఆస్తి పన్ను, నీటి పన్ను, దుకాణాల లైసెన్స్ ఫీజుల వసూళ్ల గురించి ఆరా తీశారు. దీర్ఘకాలిక బకాయిలను వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఫైల్స్ ఎక్కడ పెండింగ్లో ఉండకూడదని సూచించారు. ప్రజా ఫిర్యాదుల పోర్టల్ ద్వారా వచ్చే అర్జీలను కూడా నిర్ణీత గడువులోగా పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. కార్యాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదేశించారు.

# భూ రీసర్వేలో నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యం

**- ఈ-కేవైసీ, వెక్టోరైజేషన్ పనుల్లో వేగం పెంచాలి**

**- ఫేజ్–4, ఫేజ్–5 గ్రామాల రీ-సర్వే పురోగతిపై సమీక్ష**



**పుట్టపర్తి, ఆగస్టు 22: అనంత జనశక్తి న్యూస్**

భూ రీసర్వే పనుల్లో నాణ్యత, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఫేజ్-4, ఫేజ్-5 కింద ఎంపిక చేసిన గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే పనుల పురోగతి, డిజిటల్ విధానాల అమలు, పనుల నాణ్యతపై మమ్మిళ్లకుంట క్రాస్‌లోని ఎస్.జి. కన్వెన్షన్ హాల్‌లో సమీక్షా సమావేశం, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు, ఆర్డీఓలు, ఆర్ఎస్‌డీటీలు, మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారాలపై అధికారులతో చర్చించారు. గ్రామ సర్వేయర్ భాస్కర్, ఆర్ఎస్‌డీటీలు యూనస్, యశ్వంత్ క్షేత్రస్థాయి సిబ్బందికి నూతన సాంకేతిక విధానాలపై ప్రాయోగిక శిక్షణ ఇచ్చారు. జీటీ నోటీసు ఈకేవైసీ, జీటీ హాజరు ఈకేవైసీ నమోదు, వీఎస్, వీఆర్వో, తహసీల్దార్ లాగిన్ ద్వారా భూ రికార్డుల నమోదు, గుడ్ ఫర్ ప్రింటింగ్ ప్రక్రియను వేగవంతం చేయడం, రాజముద్ర కలిగిన భూ హక్కు పుస్తకాలను సకాలంలో ముద్రించి భూ యజమానులకు అందించే విధానాలపై అవగాహన కల్పించారు.కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ, ప్రతి భూ యజమాని, రైతు రీసర్వే ప్రక్రియపై పూర్తి సంతృప్తి చెందేలా పనులు చేపట్టాలని సూచించారు. క్షేత్రస్థాయిలో గ్రౌండ్ ట్రూతింగ్ నిర్వహించే రోజే జీటీ ఈకేవైసీ, జీటీ హాజరు ఈకేవైసీ ప్రక్రియలను పూర్తి చేయాలని ఆదేశించారు.రీసర్వే పూర్తయ్యే నాటికి గ్రామాల్లో చుక్కల భూములు, వివాదాస్పద రికార్డులు మిగలకుండా పరిష్కరించాలని సూచించారు. గ్రౌండ్ ట్రూతింగ్‌తో పాటు మ్యాపింగ్, వెక్టోరైజేషన్ పనులను సమాంతరంగా పూర్తి చేయాలని ఆదేశించారు. భవిష్యత్తులో రిజిస్ట్రేషన్ల సమయంలో రైతులు, భూ కొనుగోలు దారులకు ఇబ్బందులు తలెత్తకుండా పాత, కొత్త రికార్డుల అనుసంధాన ప్రక్రియను ఖచ్చితంగా నిర్వహించాలని తెలిపారు. గుడ్ ఫర్ ప్రింటింగ్ శాతాన్ని గణనీయంగా పెంచి భూ హక్కు పత్రాల పంపిణీకి మార్గం సుగమం చేయాలని, భూ హక్కు పుస్తకాల పంపిణీలో పూర్తి పారదర్శకత పాటిస్తూ భూ యజమానులకు అవసరమైన సమాచారాన్ని అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.కలెక్టర్ మార్గదర్శకత్వంలో రీసర్వే పనులను నిర్ణీత కాలపరిమితిలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, పెనుకొండ ఆర్డీఓ ఆనంద్ కుమార్, మడకసిర ఆర్డీఓ నాగలక్ష్మి, రీసర్వే ఏడీ విజయశాంతి, డీటీలు, ఆర్ఎస్‌డీటీలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో విద్యార్థి ప్రతిభ.

**- అమరావతి హాకీ రాష్ట్రస్థాయి ఎంపికలో యశోద ప్రైమరీ స్కూల్ విద్యార్థి సామర్థ్యం.**

**- కరస్పాండెంట్ మల్లికార్జున.**

ధర్మవరం ఆగస్టు 22, అనంత జనశక్తి న్యూస్;

అమరావతి హాకీ రాష్ట్రస్థాయి ఎంపికలో యశోద ప్రైమరీ స్కూల్ విద్యార్థి వై చందనకుమార్ ప్రతిభ కనబరిచి ఎంపిక కావడం జరిగిందని కరస్పాండెంట్ మల్లికార్జున తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... చందన కుమార్ మా పాఠశాలలో ఐదవ తరగతి చదువుతూ అటు చదువులోనూ అటు క్రీడల్లోనూ మంచి పట్టు ఉన్న విద్యార్థి అని తెలిపారు. శ్రీ సత్య సాయి జిల్లా హాకీ జట్టుకు ఎంపిక కావడం నిజంగా సంతోషించే తగ్గ విషయమని తెలిపారు. ఆగస్టు 24 నుండి 27వ తేదీ వరకు తిరుపతిలో జరగనున్న రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో సత్యసాయి జిల్లా జట్టు తరఫున పాల్గొంటున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థి చందన్ కుమార్ కి కరెస్పాండెంట్ మల్లికార్జున ,డైరెక్టర్ పృథ్వీరాజ్, ప్రిన్సిపాల్ మీనా, పిఈటి నరేష్ తో పాటు ఉపాధ్యాయ బృందం అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు.



# రాష్ట్రస్థాయి సైకిల్ పోలో పోటీలు ప్రారంభం

**- యశోద పాఠశాల డైరెక్టర్ ఎం. పృథ్విరాజ్.**

**ధర్మవరం ఆగస్టు 22, అనంత జనశక్తి న్యూస్:**

ధర్మవరం పట్టణంలోని ఎల్ సి కె పురంలోని యశోద ఇంగ్లీష్ మీడియం స్కూల్లో క్రీడా ప్రాంగణంలో మొదటి ఆంధ్రప్రదేశ్ జూనియర్ బాలబాలికల రాష్ట్రస్థాయి సైకిల్ పోలో పోటీలను స్కూల్ డైరెక్టర్ పృథ్వీరాజ్ ప్రారంభించారు. క్రీడాకారులను ఉద్దేశించి క్రీడల్లో పాల్గొనడం వల్ల మనిషికి శారీరిక మానసిక ఆరోగ్యం పెంపొందడం జరుగుతుంది ముఖ్యంగా గెలుపోటములు సహజము వాటిని స్వీకరించాలని తెలిపారు సైకిల్ పోలో వంటి క్రీడల్లో పాల్గొనడం వల్ల అనేక రంగాలలో ఉద్యోగ అవకాశాలను పొందడం జరుగుతుంది మరియు రాష్ట్ర సైకిల్ పోలో కార్యదర్శి డి రేవంత్ మాట్లాడుతూ.... ఈ పోటీలకు సంబంధించి రాష్ట్రంలోని సుమారు 11 జిల్లాల క్రీడాకారులు బాలబాలికలు పాల్గొన్నారు ఈ యొక్క పోటీల్లో ఇక్కడ నిర్వహించుకోవడానికి తోడ్పాటు అందించినటువంటి యశోద స్కూల్ యాజమాన్యానికి సూర్య స్కూల్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలుపుతూ ఇక్కడ గెలుపొందిన వారు జాతీయ స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుంది. ఎంపికైన క్రీడాకారులు నవంబర్ నెలలో రాజస్థాన్ రాష్ట్రంలోని జోధ్పూర్ లో పాల్గొనడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో సూర్య స్కూల్ కరస్పాండెంట్ నరేందర్ ఎర్రజోడు చంద్రశేఖర్ వైఎస్సార్ ఎంటర్ప్రైజెస్ ఎండిరాష్ట్ర సైకిల్ పోలో కోశాధికారి డి సునీల్ రాష్ట్ర సైకిల్ బోలో ఉపాధ్యక్షులు ఎర్రన్న, విక్టర్ చిన్నప్ప, హ్యాండ్ బాల్ అసోసియేషన్ సెక్రెటరీ శివశంకర్, అశోక్ సైకిల్ పోలో అనంతపూర్ జిల్లా సెక్రెటరీ ఖాశీం, ప్రశాంత్ కుమార్, మరియు స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు సిబ్బంది అందరూ పాల్గొనడం జరిగింది.



# పలు దేవాలయాల్లో పోటెత్తిన,భక్తాదులు

**అమడగూరు ఆగస్టు 22 అనంత జనశక్తి న్యూస్**



అమడగూరు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో రెండవ శ్రావణ,శనివారం సందర్భంగా, శ్రీ చౌడేశ్వరి దేవాలయంలో ,ఎంతో భక్తి శ్రద్ధలతో శ్రావణమాసం సందర్భంగా పలు దేవాలయాల్లో ఘనంగా పూజా కార్యక్రమాలు తీర్థ ప్రసాదాలు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. భక్తధులు ఉపవాసంతో వేకువ జామనే ఆమడగూరు ఆంజనేయస్వామి, ఏ కొత్త పల్లి, కోదండ రామస్వామి శ్రీ చౌడేశ్వరిదేవి మామిడి మాకుల పల్లి ఆంజనేయ స్వామి, దేవాలయాల్లో,స్వాముల వారికీ ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అనంతరం శ్రావణమాసం సందర్భంగా, అమావాస్య రోజు అన్ని శుభాలు జరుగుతాయని భక్తుల నమ్మకం. శ్రావణమాసం 2,వ శనివారం , సందర్భంగా పండ్లు పల హారాలతో పాటు , ప్రత్యేక పూలతో,నూతన వస్త్రాలు అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు పూజలు చేసుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు,అమడగూరు గుండువారిపల్లి, ఏ కొత్తపల్లి, గాజులపల్లి మండలంలోని,వివిధ గ్రామాలలో పలువురు భక్తులు, మాట్లాడుతూ శ్రావణమాసంలో పూజలు నిర్వహిస్తే భక్తులకు వాళ్ళ కుటుంబ సభ్యులకు మంచి జరుగుతుందని ప్రతి సమచరం అన్న దాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది ని భక్తుల నమ్మకం.ఈ ఉదయం నుంచి ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించరు ఈ కార్యక్రమంలో భక్తాదులుకు పలు దేవాలయాల్లో, అన్నదాన,కార్యక్రమం భారీగా నిర్వహించడం జరిగింది ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



**నల్లచెరువు ఆగస్టు 22 అనంత జనశక్తి న్యూస్**

మండల కేంద్రమైన నల్లచెరువు పాత రైల్వే స్టేషన్ సమీపంలో వెలసిన పురాతనమైన శ్రీ పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి దేవస్థానంలో
శ్రావణ మాసం రెండవ శనివారం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు వారి ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు మరియు విశ్రాంత ఉద్యోగుల ఆర్థిక సహాయ సహకారాలతో భక్తులకు ఘనంగా అన్నదాన నారాయణ సేవ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఆనవాయితీగా నిర్వహిస్తున్న ఈ సేవలో భాగంగా ఈ ఏడాది సేకరించిన మూడు లక్షల రూపాయల విరాళాన్ని టీడీపీ మండల కన్వీనర్ రాజశేఖర్ గ్రామ పెద్దల సమక్షంలో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కు అందజేశారు.ఈ స్వచ్ఛంద కార్యక్రమంలో ఏపీజీబీ రీజినల్ మేనేజర్ శ్రీ ప్రహ్లాద్,విశ్రాంత అసిస్టెంట్ మేనేజర్ కె. గోవిందు,ఇతర కార్యనిర్వాహక సభ్యులు మరియు బ్యాంకు సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేశారు .ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ శ్రీ ప్రహ్లాద్ మాట్లాడుతూ... అన్నదాన కార్యక్రమానికి సంపూర్ణ సహకారం అందించిన దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కు ఆలయ సిబ్బందికి మరియు పాలపాటిదిన్నె గ్రామ పెద్దలకు ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంకు యాజమాన్యం మరియు ఉద్యోగుల తరపున ప్రత్యేక హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

# ఫార్మా కంపెనీలో ప్రమాదం



**(మొదటిపేజీ తరువాయి)**

ఈ దుర్ఘటనలో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరో తొమ్మిది మంది తీవ్ర అగ్నిగాయాల పాలయ్యారు.

**పేలిన రియాక్టర్....**

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..... శుక్రవారం రాత్రి దాదాపు 10:30 గంటల ప్రాంతంలో ఫార్మా పరిశ్రమలో ఉన్నట్లుండి భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. పరిశ్రమలోని రియాక్టర్ పేలిపోవడమే ఈ భారీ ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. పేలుడు తీవ్రతకు కర్మాగారంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి దట్టమైన పొగ అలుముకుంది.
ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే జిల్లా అగ్నిమాపక శాఖ అధికారులు సమర్థవంతంగా స్పందించారు. చౌటుప్పల్ నుంచి ఒక ఫైర్ ఇంజిన్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి మరో రెండు అగ్నిమాపక వాహనాలను వెంటనే ఘటనా స్థలానికి తరలించారు. అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు.
ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తొమ్మిది మంది బాధితులను రెస్క్యూ సిబ్బంది వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించి అత్యవసర వైద్య చికిత్స అందిస్తున్నారు. మరణించిన ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఫైర్ ఆఫీసర్ ధృవీకరించారు.
"ఫార్మా కంపెనీలో పేలుడు జరిగిందనే కాల్ రాగానే మా బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. రియాక్టర్ పేలడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని భావిస్తున్నాం. పేలుడుకు గల ఖచ్చితమైన కారణాలపై కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు జరుపుతున్నాం" అని అగ్నిమాపక అధికారి వివరించారు. ప్రమాద సమయానికి పరిశ్రమలో ఎంతమంది విధులు నిర్వర్తిస్తున్నారనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు.

# ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందించాలి

**(మొదటి పేజీ తరువాయి)**

ముఖ్యంగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రుల్లో అందుతున్న వైద్య సేవలు, రోగులకు ఎదురవుతున్న ఇబ్బందులు, సిబ్బంది పనితీరు, ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న మౌలిక వసతులపై వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికీ మెరుగైన వైద్యం అందేలా వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించినట్లు సమాచారం.
అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులను బలోపేతం చేయడం, అవసరమైన వైద్య పరికరాలు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడటం, వైద్య సేవల నాణ్యతను పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. జిల్లాల వారీగా ఆసుపత్రుల పరిస్థితి, అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ప్రభుత్వ వైద్యంపై మరింత నమ్మకం కలిగేలా ఆసుపత్రుల్లో మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తుతో పాటు పలువురు ఉన్నతాధికారులు, అన్ని జిల్లాల డీసీహెచ్ఎస్‌లు పాల్గొన్నారు.

# రామ్‌దేవ్ స్వదేశీ ప్రచారంలోకి నకిలీ ఉత్పత్తులు



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 22, అనంత జనశక్తి న్యూస్**

ప్రముఖ యోగా గురువు బాబా రామ్‌దేవ్‌పై బీజేపీ నేత, మాజీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ సంచలన ఆరోపణలు చేశారు. స్వదేశీ నినాదంతో ప్రారంభమైన బాబా రామ్‌దేవ్‌పై ప్రచారంలోకి ఇప్పుడు కల్తీ ఉత్పత్తులు, విదేశీ వస్తువులు చేరాయని శరణ్ సింగ్ తీవ్రంగా విమర్శించాడు. గతంలో రామ్‌దేవ్ చేసిన ఉద్యమాలు సమంజసంగానే ఉన్నప్పటికీ, కాలక్రమేణా ఆయన విధానాలు మారాయని ఆరోపించాడు.
రామ్‌దేవ్ గతంలో చేపట్టిన ఆందోళనలను గుర్తు చేస్తూ.. ఈసారి ఆయన ఉద్యమం చేయదలిస్తే సింధూరం, సల్వార్ ధరించి రాకుండా ఒక మగాడిలాగా నిరసన తెలిపి... నిర్ణయాత్మక పోరాటం చేయాలని శరణ్ సింగ్ సవాల్ చేశాడు. దేశంలో విరివిగా లభిస్తున్న కల్తీ నెయ్యికి బాబా రామ్‌దేవే ప్రధాన కారణమని తీవ్ర ఆరోపణలు గుప్పించారు. అంతేకాకుండా, రామ్‌దేవ్ కంపెనీ ఇప్పుడు విదేశీ లోదుస్తులను కూడా తయారు చేస్తోందని వ్యంగాస్త్రాలు సంధించారు.
గత కొన్నేళ్లుగా వీరిద్దరి మధ్య వివాదాలు కొనసాగుతున్నాయి. 2022లో పతంజలి బ్రాండ్ పేరును ఉపయోగించవద్దని బ్రిజ్ భూషణ్ డిమాండ్ చేశారు. మహర్షి పతంజలి జన్మస్థలమైన గోండా అభివృద్ధికి వారు ఎలాంటి సేవ చేయలేదని ఆరోపించారు. మరోవైపు, 2023లో రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా ఉన్న బ్రిజ్ భూషణ్‌పై మహిళా రెజ్లర్లు లైంగిక వేధింపుల ఆరోపణలు చేసినప్పుడు బాబా రామ్‌దేవ్ రెజ్లర్లకు మద్దతుగా నిలిచారు. అప్పటి నుంచి వీరి మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది.

# మున్సిపాల్టీల్లో రూ.10,200 కోట్లతో రక్షిత తాగునీటి సదుపాయం




- రూ.5500 కోట్లతో రహదారుల నిర్మాణం
- మౌళిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత
- రాష్ట్ర పట్టణ పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ

**నెల్లూరు ఆగస్ట్ 22, అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్రవ్యాప్తంగా 123 మున్సిపాల్టీల్లో ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుందని, ఇందులో భాగంగా రహదారులు, రక్షిత తాగునీరు, కాలువలు, వీది దీపాలు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ వంటివి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పట్టణ పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. గత వైకాపా ప్రభుత్వం మున్సిపాల్టీల్లో ప్రజలు చెల్లించిన పన్నులు ఇతర అవసరాలకు మళ్లించటం జరిగిందన్నారు. వాస్తవానికి స్థానిక సంస్థలకు వచ్చిన ఆదాయాన్ని కౌన్సిల్‌లో తీర్మానం చేసి ఆయా సంస్థల అవసరాలకు ఖర్చు చేయాల్సి ఉందన్నారు. కానీ చట్టాలను వారికి వారికి ఇష్ట మొచ్చినట్లుగా మార్చేశారని ఆరోపించారు. చెత్తపై పన్నువేసిన చెత్త ప్రభుత్వమని విమర్శించారు. చెత్తపై పన్నువేసిన ప్రభుత్వం రాష్ట్రంలో 153 టన్నుల చెత్తను వదిలేసి వెళ్లిపోయిందని విమర్శించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 140 టన్నుల చెత్తను తొలగించటం జరిగిందన్నారు. 2014తెదేపా హయాంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచనల మేరకు చెత్త నుంచి విద్యుత్ తయారుచేసే ప్లాంట్‌లు సుమారు 10 వరకు ఏర్పాటు చేయగా, గత ప్రభుత్వం కేవలం విశాఖ, గుంటూరుల్లో మాత్రమే వీటిని ఉంచిందని, మిగిలిన వాటిని తొలగించిందని ఆరోపించారు. అవన్ని ప్రస్తుతం ఉంటే చెత్త ఉండేది కాదన్నారు.విశాఖపట్నం ప్లాంట్‌ను మరింత అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. చెత్తపై పన్ను వేసిన ప్రభుత్వం రూ.10లక్షల కోట్లను అప్పులు చేసి వెళ్లిపోయిందని విమర్శించారు. అయితే ప్రజలకు కనీస అవసరాలను అందించాలన్న ఉద్దేశ్యంతో కేంద్రప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని, అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యుసిఎఫ్) కింద రూ.4200 కోట్లతో యూజీడీ పనులు చేపడుతున్నామన్నారు. అలానే రక్షిత తాగునీటిని అందించేందుకు వీలుగా అమృత్ పథకం, ఇతర పథకాల ద్వారా రూ.10,200 కోట్లతో పైపులైన్ పనులు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నాయని, రానున్న రోజుల్లో ప్రతీ ఇంటికి రక్షిత తాగునీటిని అందించటమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. అలానే అన్ని మున్సిపాల్టీల్లో రహదారుల నిర్మాణం, మరమ్మతుల కోసం రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు రూ.5500 కోట్లను మంజూరు చేశారని, వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా యూజీడీ,తాగునీటిపైపులైన్ల కోసం పనులు జరుగుతున్నాయని, ఈ పనులు పూర్తైన వెంటనే రహదారుల పననులు చేపట్టటం జరుగుతుందన్నారు. ఏడాది లోగా అన్ని రకాల మౌళికసదుపాయల కల్పనను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేయటం జరిగిందన్నారు. వీఎంఆర్‌డీఏ పరిధిలోని నర్సీపట్నం, నెల్లిమర్ల, యలమంచలి, విజయనగరం, తదతర మున్సిపాల్టీలకు యూజీడీ, డ్రైనేజీ పనుల కోసం రూ.269 కోట్లను కేటాయించామని, ఎలమంచిలి రూ.24 కోట్లు, నెల్లిమర్లకు రూ.24 కోట్లు, నర్సీపట్నంకు రూ.27 కోట్లు, విజయనగరంకు రూ.194 కోట్లను కేటాయించటం జరిగిందన్నారు. అలానే ఆయా మున్సిపాల్టీల్లో రహదారుల నిర్మాణం కోసం మరో రూ.139 కోట్లను మంజూరుచేయాలని ఎమ్మెల్యేలు కోరగా, వాటిని కూడా మంజూరు చేయటం జరుగుతుందన్నారు.ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ , రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి వర్యులు నారాయణ మార్గదర్శకంలో రాష్ట్రంలోని మున్సిపాల్టీల ముఖచిత్రం మారేలా పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఇందుకోసం నిధులు కేటాయించటం జరిగిందన్నారు. రాష్ట్రంలో లోటు బడ్జెట్ ఉన్నా, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మంచి చేయాలని, సదుపాయాల కల్పించాలనే చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే
మౌళిక సదుపాయాల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయటం జరిగిందన్నారు. అన్ని మున్సిపాల్టీల్లోను యూజీడీ పనుల కోసం రూ.14200 కోట్ల మేర ప్రతిపాదనలు చేయటం జరిగిందని, కేంద్ర ప్రభుత్వం నుంచి త్వరలోనే నిధులు మంజూరు కానున్నాయని పేర్కొన్నారు.ఎలమంచిలి నియోజకవర్గంకు యూజీడీ కోసం ఇప్పటికే రూ.24 కోట్లను కేటాయించారని, రహదారులు, కాలువలు నిర్మాణం కోసం మరో రూ.24కోట్లను కేటాయించారన్నారు. ప్రజలను కష్టాలను తీర్చేలా అభివృద్ధి లోభాగంగా మౌళిక సదుపాయాల కల్పకు పెద్ద పీఠ వేసిన దేశ ప్రధాని నరేంద్ర మోదీకి, రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, రాష్ట్ర పట్టణ పురపాలకశాఖ మంత్రి శ్రీనారాయాణ కి ప్రత్యేన ధన్యవాదాములు తెలియజేస్తున్నామన్నారు.ఎలమంచిలి నియోజకవర్గంలో ఇప్పటికే రూ.10 నుంచి రూ.15 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, రక్షిత తాగునీటి పథకం పనులు జరుగుతున్నాయని, శివారు కాలనీల్లో సదుపాయాల కల్పనకు రూ.7 కోట్లను కేటాయించారని పేర్కొన్నారు. మురికినీటిశుద్ధి కేంద్రాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత నీటిని శుద్ధి చేసి మున్సిపాల్టీ పరిధిలోని మొక్కలకు ఉపయోగిస్తామని పేర్కొన్నారు.నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాదవి మాట్లాడుతూ 2009లో నెల్లిమర్లను నగర పంచాయితీగా మార్చారని, అప్పటి నుంచి మౌళిక సదుపాయాలు లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, 2014లో తెదేపా హాయంలో సదుపాయాలు కల్పిందన్నారు. అయితే 2019లో వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత అభివృద్ధిని నీరుగార్చిందని ఆరోపించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నెల్లిమర్ల పరిస్థితిని, వాస్తవికతను వివరించగా, ప్రత్యేక బృందాలను పంపించి, ప్రత్యేక కార్యాచారణ ద్వారా నిధులు మంజూరు చేయటం జరుగుతుందన్నారు. నెల్లిమర్ల నగర పంచాయితీ ప్రజల తరుపున ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు కి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి, రాష్ట్ర పట్టణ పురపాలకశాఖ మంత్రి నారాయాణ కి ప్రత్యేన ధన్యవాదాములు తెలియజేస్తున్నామన్నారు. ప్రస్తుతం ప్రజల మన్ననలు పొందుతూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఇప్పటికే రూ.6 కోట్లను మంజూరుచేశారని, ఈ నిధులతో ప్రస్తుతం పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అలానే నీటి భద్రతను కల్పిస్తూ శిధిలావస్థకు చేరుకున్న పైపులైన్లు మార్పు చేసేందుకు రూ.46కోట్లను మంజూరుచేశారని, అదేవిధంగా అమృత్ పథకంలో బాగంగా మరో రూ.2.6కోట్లను మంజూరుచేశారన్నారు. నగర పంచాయితీలో ఇంత పెద్ద మొత్తం నిధులతో పనులు జరగటం శుభపరిణామమని, నిజంగా అభివృద్ధికి ఇది బాట అని ప్రజలుచెబుతున్నారని పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం ప్రజలకుమౌళిక సదుపాయాలు కల్పనకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని, హౌసింగ్ కాలనీలకు ఇప్పుడు రహదారులు,కాలువలు నిర్మాణంతో పాటు తాగునీటిని అందించటం జరుగుతుందన్నారు. నెల్లిమర్లకు యూసీఎఫ్ కింద రూ.24 కోట్లు, వీఎంఆర్‌డీఏ/హెచ్ఎం ద్వారా మరో రూ.20 కోట్లను కేటాయించినందుకు రాష్ట్ర మంత్రి నారాయణ కి ప్రత్యేక దన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారుముందుగా వీఎంఆర్‌డీఏ శనివారం మధ్యాహ్నం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి నారాయణ , ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాదవితో కలిసి నర్సీపట్నం, విజయనగరం, నెల్లిమర్ల, ఎలమంచిలి మున్సిపాల్టీల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనుల ప్రగతిపై సమీక్షించారు. ప్రధానంగా మౌళిక సదుపాయాలు రహదారులు, కాలువలు, తాగునీరు, వీది దీపాలు ఏర్పాటు, చెత్త నుంచి సంపద సృష్టించటం వంటి అంశాలపై చర్చించారు.

# గ్రామాల ప్రతిష్ట పెరిగేలా అభివృద్ధి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు గారు
- జోరువానలోనూ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- రైతుల భూ హక్కులకు సంపూర్ణ భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నాం

**టెక్కలి, ఆగస్టు 22,అనంత జనశక్తి న్యూస్**

గ్రామాల రూపురేఖలు మార్చి, గ్రామాల ప్రతిష్ట ఇనుమడించేలా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. జోరువానను సైతం లెక్కచేయకుండా శనివారం టెక్కలి మండలం భగవాన్‌పురం, చింతలగార గ్రామాల్లో మంత్రి విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.
భగవాన్‌పురం, చింతలగార గ్రామాల్లో మొత్తం రూ.5.27 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. భగవాన్‌పురంలో డ్రైన్లు, సీసీ రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేసి, గ్రామాల్లో మెరుగైన రహదారి, పారిశుద్ధ్య సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. చింతలగారలో రూ.17.60 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో చేపట్టనున్న రక్షిత మంచినీటి పథకానికి శంకుస్థాపన చేశారు.



ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రగతికి బలమైన పునాది అని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను సమకూర్చడంతో పాటు, ప్రతి గ్రామాన్ని అభివృద్ధికి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

**రైతే ప్రభుత్వానికి వెన్నెముక**

వర్షపాతం లోటు ఉన్న పరిస్థితుల్లోనూ వంశధార నీటిని కాలువల ద్వారా చివరి ఆయకట్టు వరకు అందించి రైతాంగానికి అండగా నిలిచామని మంత్రి తెలిపారు. రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.
అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేల చొప్పున అందిస్తున్నామని, వ్యవసాయ పనులకు అవసరమైన ఆధునిక పనిముట్లను అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా. పటిష్టమైన చర్యలు చేపట్టామని తెలిపారు.
రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి సూపర్ సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమం, రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధిని సమన్వయం చేస్తూ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తామని అన్నారు.

**రైతుల భూములపై రాజకీయ ముద్రలు దుర్మార్గం**

గత ప్రభుత్వ హయాంలో రైతుల భూ హక్కుల పత్రాల పైనా, సర్వే రాళ్లపైనా రాజకీయ నాయకుల చిత్రాలను ముద్రించడం దుర్మార్గమైన చర్య అని మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా విమర్శించారు.
“రైతుల భూములు వారి హక్కు. వాటిపై రాజకీయ పార్టీల ముద్రలు వేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. గత పాలకులు రాజకీయ ప్రచారం కోసం రైతుల భూ హక్కుల పత్రాలను సైతం ఉపయోగించుకున్నారు. సర్వే రాళ్లపై కూడా తమ పార్టీ నేతల చిత్రాలను ఏర్పాటు చేసి ప్రజాధనాన్ని కోట్లాది రూపాయల మేర దుర్వినియోగం చేశారు” అని మంత్రి మండిపడ్డారు.గత ప్రభుత్వంలో ఏర్పడిన భూ సమస్యలను పరిష్కరిస్తూ రైతులకు శాశ్వత భూ హక్కుకు భరోసా కల్పించే పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నామని తెలిపారు. అనంతరం రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను మంత్రి తన చేతుల మీదుగా పంపిణీ చేశారు.
“రైతుల భూ హక్కులకు సంపూర్ణ భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం. భూమికి సంబంధించిన ప్రతి సమస్యను పరిష్కరించి రైతులకు న్యాయం చేస్తాం” అని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. కోరమండల్ రాకతో శ్రీకాకుళానికి పారిశ్రామిక ఊతం శ్రీకాకుళం జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. మూలపేటలో ప్రముఖ కోరమండల్ సంస్థ భారీ పరిశ్రమ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం 450 ఎకరాల భూమిని కేటాయిస్తూ జీవో జారీ చేసిందని వెల్లడించారు. రూ.2,250 కోట్ల భారీ పెట్టుబడులతో ఏర్పాటుకానున్న ఈ పరిశ్రమ ద్వారా స్థానిక యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు జిల్లా ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు వస్తుందని అన్నారు. పరిశ్రమల రాకతో అనుబంధ రంగాలు, రవాణా, వ్యాపార, సేవా రంగాలు కూడా విస్తరించి జిల్లా సమగ్ర అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. మహిళలు, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు టెక్కలి ఇందిరాగాంధీ కూడలి వద్ద రూ.37 లక్షల వ్యయంతో నిర్మించిన బేబీ ఫీడింగ్ రూమ్, సులభ కాంప్లెక్స్‌ను మంత్రి ప్రారంభించారు. తల్లులు తమ శిశువులకు ప్రశాంతమైన వాతావరణంలో పాలిచ్చేందుకు బేబీ ఫీడింగ్ రూమ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. సులభ కాంప్లెక్స్ ద్వారా ప్రజలు, ప్రయాణికులకు మెరుగైన పారిశుధ్య సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు.అనంతరం పట్టణంలో సుందరీకరణ పనులు జరుగుతున్న పట్టు మహాదేవ కోనేరు వద్ద స్వర్గీయ నందమూరి తారక రామారావు కాంస్య విగ్రహ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు.టెక్కలి జిల్లా ఆసుపత్రి ఆవరణలో రూ.55 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన మార్చురీ గదిని ప్రారంభించారు. మార్చురీ అందుబాటులోకి రావడంతో మృతదేహాల భద్రత, పరిరక్షణకు అవసరమైన సౌకర్యాలు మెరుగుపడ్డాయని మంత్రి తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ, అభివృద్ధి-సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. గ్రామాల నుంచి పట్టణాల వరకు అభివృద్ధి ఫలాలు అందరికీ చేరేలా చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో కోటబొమ్మాళి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ అధ్యక్షుడు బాగాది శేషగిరిరావు, ఆర్డీవో ఎం. కృష్ణమూర్తి, మండల అభివృద్ధి అధికారి అలివేలు మంగ, తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీవో రేణుక, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఎస్. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి సంఘాల మధ్య ఘర్షణ

- రాహుల్ పూణె టూర్‌కు ముందు ఉద్రిక్తతలు
- 50 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 22, అనంత జనశక్తి న్యూస్**

కాంగ్రెస్ అగ్ర నేత, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పూణె పర్యటనకు ముందు తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. రాహుల్ గాంధీ శనివారం సాయంత్రం పూణెలో విద్యార్థులతో ‘ఛాత్రోన్ కీ గూంజ్’ పేరుతో ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంది. ఈ నేపథ్యంలో శుక్రవారం అర్ధరాత్రి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, పూణె హాస్టల్ క్యాంపస్‌లో ఏబీవీపీ, ఎన్ఎస్‌యూఐ సభ్యుల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి 50 మందికి పైగా యూత్ కాంగ్రెస్ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. ఉద్రిక్తతలు తలెత్తకుండా భారీగా పోలీసులు మోహరించారు.

**అసలు వివాదం ఏంటి?**

రాహుల్ గాంధీ ‘ఛాత్రోన్ కీ గూంజ్’ కార్యక్రమానికి విద్యార్థులను ఆహ్వానించేందుకు ఎన్ఎస్‌యూఐ కార్యకర్తలు వివిధ కళాశాలల క్యాంపస్‌లను సందర్శించినట్లు సమాచారం. అయితే ఈ కార్యక్రమానికి మద్దతు ఇస్తున్న ఇద్దరు విద్యార్థినులను ఏబీవీపీ సభ్యులు బెదిరించి హాస్టల్‌లో నిర్బంధించారని ఎన్ఎస్‌యూఐ ఆరోపించింది. విద్యార్థినులను విడిపించేందుకు తాము క్యాంపస్‌లోకి వెళ్లామని ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు తెలిపారు. ఈ క్రమంలో పోలీసులు తమపై లాఠీచార్జ్ చేశారని ఆరోపించారు. మరోవైపు ఏబీవీపీ సభ్యులు మాత్రం ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు హాస్టల్ విద్యార్థులపై ఒత్తిడి తెచ్చి రాహుల్ గాంధీ కార్యక్రమానికి హాజరయ్యేలా చేస్తున్నారని ఆరోపించారు. ఈ వివాదం చివరకు ఘర్షణకు దారితీసినట్లు తెలుస్తోంది. ఘర్షణలో పలువురు కార్యకర్తలు గాయపడటంతో వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

**కాంగ్రెస్ నేతల ధర్నా**

ఘర్షణ జరిగిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత విజయ్ వాడెట్టివార్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు అర్ధరాత్రి సీవోఈపీ క్యాంపస్‌కు చేరుకున్నారు. పోలీసుల చర్యను నిరసిస్తూ ధర్నాకు దిగారు. పోలీసుల లాఠీచార్జ్‌ను కాంగ్రెస్ నేత బాలాసాహెబ్ థోరాట్ తీవ్రంగా ఖండించారు. విద్యార్థుల గొంతును అణచివేయడానికి బలప్రయోగం చేసినా ఫలితం ఉండదని అన్నారు. అనంతరం ఆసుపత్రికి వెళ్లి గాయపడిన పార్టీ కార్యకర్తలను పరామర్శించారు. కాంగ్రెస్ నేత నానా పటోలే ఈ ఘటనను ఉద్దేశపూర్వకంగా జరిగిన ఘర్షణగా అభివర్ణించారు. “ఏబీవీపీ విద్యార్థులను హాస్టల్‌లోకి పంపించారు. రాహుల్ గాంధీ కార్యక్రమాన్ని అడ్డుకోవాలనే ఉద్దేశంతోనే ఈ ఘర్షణను సృష్టించారు” అని ఆరోపించారు.

**‘ఛాత్రోన్ కీ గూంజ్’ కాదు.. ‘పైసే కీ గూంజ్’: బీజేపీ**

మరోవైపు రాహుల్ గాంధీ పూణె కార్యక్రమంపై బీజేపీ తీవ్ర ఆరోపణలు చేసింది. ‘ఛాత్రోన్ కీ గూంజ్’ కార్యక్రమాన్ని ‘పైసే కీ గూంజ్’గా అభివర్ణించింది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు డబ్బులు చెల్లించి కాంగ్రెస్ కార్యక్రమానికి జనాలను సమీకరించిందని ఆరోపించింది. బీజేపీ అధికార ప్రతినిధి నవనాథ్ బన్ ఆరోపిస్తూ.. కాంగ్రెస్ దాదాపు రూ.10 కోట్లు ఖర్చు చేసిందని.. ఒక్కో ఇన్‌ఫ్లుయెన్సర్‌కు రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు చెల్లించిందని పేర్కొన్నారు. సుమారు 3,000 మందికి డబ్బులు చెల్లిస్తే రూ.9 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు ఖర్చవుతుందని అన్నారు. “ఈ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు ఇస్తున్నారు? ఎవరి ద్వారా పంపిణీ చేస్తున్నారు? దీనికి సంబంధించిన అధికారిక ఖాతా ఏమిటి?” అని బీజేపీ నేత ప్రశ్నించారు. ఈ ఆరోపణలపై ప్రతిపక్షం తీవ్రంగా స్పందించింది. యువతలో రాహుల్ గాంధీకి పెరుగుతున్న ఆదరణను చూసి బీజేపీ భయపడుతోందని కాంగ్రెస్ నేత సచిన్ సావంత్ విమర్శించారు.

ఆదివారం | అనంతపురం
23.08.2026
అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం



# 'ప్రామాణిక కోడింగ్ లేకుండా కులగణన ప్రయోజనం ఉండదు



- కులగణన-2027పై యోగేంద్ర యాదవ్ ఆందోళన.. బీసీ సంఘాల డిమాండ్.

**అమరావతి ఆగస్టు 22 అనంత జనశక్తి న్యూస్**

కులగణన2027లో ఇతర వెనుకబడిన తరగతుల కులాల వివరాలను ప్రామాణిక కోడింగ్ వ్యవస్థ లేకుండా ఓపెన్ఎండెడ్ విధానంలో సేకరిస్తే, భారీగా గందరగోళానికి దారితీసి సామాజిక న్యాయానికి అవసరమైన విశ్వసనీయ డేటా అందకుండా పోయే ప్రమాదం ఉందని సామాజికరాజకీయ విశ్లేషకుడు, సామాజిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు.విజయవాడ లో "ఓపెన్ కాస్ట్ కాలమ్, క్లోజ్డ్ జస్టిస్: ది ఇన్‌జస్టిస్ ఇన్ సెన్సస్ 2027" అనే అంశంపై వివిధ బీసీ సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ప్రతిపాదిత విధానంలో నిర్మాణాత్మక లోపాలు ఉన్నాయని, ముందస్తు ప్రామాణిక వర్గీకరణ, కోడింగ్ విధానం లేకుండా కులాల పేర్లను మాత్రమే సేకరిస్తే భవిష్యత్‌లో ఆ డేటాను సమర్థవంతంగా వినియోగించడం కష్టమవుతుందని అన్నారు.

ఓపెన్ఎండెడ్ ప్రశ్నలతో గందరగోళం
దేశంలోని సుమారు 140 కోట్ల మంది ప్రజలను ఓపెన్ఎండెడ్ ప్రశ్న ద్వారా కుల వివరాలు అడిగితే, ఒకే కులానికి వివిధ ప్రాంతాల్లో ఉపయోగించే పేర్లు, స్థానిక పేర్లు, ఉపకులాల పేర్లు, భిన్నమైన స్పెల్లింగ్‌లు, పర్యాయపదాలు వేర్వేరు కులాలుగా నమోదయ్యే అవకాశం ఉందని యాదవ్ వివరించారు. ఫలితంగా ఒకే సామాజిక సమూహానికి సంబంధించిన వివరాలు అనేక వర్గాలుగా విడిపోయి, తుది గణాంకాలు విశ్వసనీయతను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు."కులాల పేర్లను సేకరించడం మాత్రమే సరిపోదు. సామాజిక న్యాయం, ప్రాతినిధ్యం, రిజర్వేషన్లు, ఆధారిత విధాన రూపకల్పనకు ఉపయోగపడేలా విశ్వసనీయమైన, ప్రామాణికమైన, వినియోగయోగ్యమైన డేటాను రూపొందించాలి" అని ఆయన పేర్కొన్నారు. 2011 ఎస్ఈసిసి అనుభవం పునరావృతం కాకూడదుకుల వివరాల సేకరణలో పరిపాలనా స్పష్టత లేకపోవడం గతంలో జరిగిన 2011 సామాజికఆర్థిక కులగణన అనుభవాన్ని గుర్తు చేస్తోందని యాదవ్ అన్నారు. కులాల గుర్తింపు, వర్గీకరణ, డేటా శుద్ధి విషయంలో స్పష్టమైన విధానం లేకపోతే సేకరించిన సమాచారం విధాన నిర్ణయాలకు ఉపయోగపడకపోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.ఇది కేవలం సాంకేతిక సమస్య కాదని, రాజకీయ సంకల్పానికి సంబంధించిన అంశమని యాదవ్ స్పష్టం చేశారు. సమగ్ర కుల డేటా అందుబాటులోకి వస్తే సామాజిక వెనుకబాటుతనంపై స్పష్టమైన చిత్రం వెలుగులోకి వస్తుందని, అందువల్ల బీసీ జనాభా, వారి సామాజికఆర్థిక పరిస్థితులపై నమ్మదగిన సమాచారం అందకుండా చేసే విధంగా వ్యవస్థను రూపొందించకూడదని అన్నారు.

**ఎస్సీ, ఎస్టీ తరహాలో ప్రామాణిక కోడింగ్ అవసరం**

కులగణనలో ప్రామాణిక కోడింగ్ వ్యవస్థ తప్పనిసరిగా ఉండాలని యాదవ్ సూచించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల మాదిరిగానే బీసీ కులాలకు కూడా ముందుగానే స్పష్టమైన కోడ్‌లు, వర్గీకరణ ప్రమాణాలు రూపొందించి, దేశవ్యాప్తంగా ఒకే విధానాన్ని అమలు చేయాలని అన్నారు.ఇలా చేయడం ద్వారా ప్రాంతీయ పేర్లు, పర్యాయపదాలు, భిన్నమైన స్పెల్లింగ్‌లు, ఉపకులాల వివరాలను సమర్థవంతంగా సమీకరించి, ఖచ్చితమైన కుల గణాంకాలను రూపొందించవచ్చని పేర్కొన్నారు.

**ఒక్కసారి చేసే జనగణనకు పరిమితం కాకూడదు**

కులాల సామాజిక, ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకోవడానికి పదేళ్లకోసారి జరిగే సాధారణ జనగణనలో కుల వివరాలను నమోదు చేయడం మాత్రమే సరిపోదని యాదవ్ అభిప్రాయపడ్డారు. వ్యవసాయం, ఉపాధి, ఆదాయం, విద్య, ఆర్థిక పరిస్థితులు తదితర అంశాలపై జరిగే వివిధ ప్రభుత్వ సర్వేల్లో కూడా కులానికి సంబంధించిన ప్రశ్నలను సమర్థవంతంగా అనుసంధానం చేయాలని సూచించారు. ఇలాంటి "చిన్నసి జనగణనలు" ద్వారా కాలానుగుణంగా సామాజికఆర్థిక మార్పులను అంచనా వేసే అవకాశం ఉంటుందని అన్నారు. కుల డేటాను ఒకే భారీ గణనకు పరిమితం చేయకుండా, వివిధ రంగాల గణాంకాలతో అనుసంధానం చేస్తే ప్రభుత్వ విధానాలు మరింత ఆధారబద్ధంగా రూపొందించవచ్చని పేర్కొన్నారు.

**కులగణన వాయిదా వేయాలని బీసీ సంఘాల డిమాండ్**

ఇదిలా ఉండగా, కులగణన2027లో ఓబిసి కులాల గణనను ప్రామాణిక కోడ్‌లను ఖరారు చేసే వరకు వాయిదా వేయాలని వివిధ బీసీ సంఘాలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. విజయవాడ లో జరిగిన మీడియా సమావేశంలో బీసీ ఇంటెలెక్చువల్స్ ఫోరం, ఆల్ ఇండియా ఓబిసి స్టూడెంట్స్ అసోసియేషన్ తదితర సంఘాల ప్రతినిధులు ఈ డిమాండ్ చేశారు.ప్రామాణిక కోడింగ్ లేకుండా ఓపెన్ కాస్ట్ కాలమ్ ఏర్పాటు చేస్తే భవిష్యత్‌లో కులాల వారీగా జనాభా, సామాజికఆర్థిక స్థితిగతులపై సరైన గణాంకాలను రూపొందించడం కష్టమవుతుందని వారు అన్నారు. ఈ అంశంపై కేంద్రం స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే ఉద్యమాన్ని న్యూఢిల్లీ వరకు తీసుకెళ్తామని బీసీ సంఘాల ప్రతినిధులు హెచ్చరించారు.ఈ సమావేశంలో టి. చిరంజీవులు, IAS (బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం), డా. ఎం. సురేష్ బాబు, డా. ఉద్దండం చంద్రశేఖర్, ప్రొఫెసర్ సుకుమార్ నారాయణ్, టి స్పార్క్ "ఎడిటర్ షేక్ బాబా తదితర బీసీ నాయకులు, మేధావులు ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్‌తో చర్చించారు.

# అభిమానులను సేవా మార్గంలో నడిపించిన మహోన్నత వ్యక్తి మెగాస్టార్ చిరంజీవి

- మంత్రి కందుల దుర్గేష్
- రాజమహేంద్రవరంలో పద్మ విభూషణ్ చిరంజీవి 71వ జన్మదిన వేడుకల్లో పాల్గొని భారీ కేక్ కట్ చేసిన మంత్రి కందుల దుర్గేష్
- కొత్త సినిమా 'కాకా' గ్లింప్స్ లో మెగాస్టార్ చిరంజీవి లుక్ అదిరిపోయిందని కొనియాడిన సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్

**రాజమహేంద్రవరం**
**ఆగస్టు 22 అనంత జనశక్తి న్యూస్**

అభిమానులను సేవా మార్గంలో నడిపించిన మహోన్నత వ్యక్తి మెగాస్టార్ చిరంజీవి అని మంత్రి కందుల దుర్గేష్ కొనియాడారు.శనివారం రాజమహేంద్రవరంలోని జెండా పంజా రోడ్డులో నిర్వహించిన మెగాస్టార్, పద్మవిభూషణ్ చిరంజీవి 71వ జన్మదిన వేడుకల్లో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొని భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సర్వమత ప్రార్థనల్లో మంత్రి పాల్గొని మెగాస్టార్ కు బర్త్ డే విషెస్ తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. నాటి రోజుల్లో సినిమా హీరోలంటే కేవలం థియేటర్లలో కేరింతలు కొట్టడం, విడుదల రోజే పండుగ చేసుకోవడం వరకే ఉండేదని, అందుకు భిన్నంగా అభిమానులను సమాజ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేసిన దేశ చరిత్రలోనే తొలి హీరో చిరంజీవి అని కొనియాడారు.నేత్రదానం, రక్తదానం వంటి సామాజిక కార్యక్రమాలతో తనదైన ముద్ర వేశారని, రికార్డు స్థాయిలో రక్తదానాలు చేస్తూ బ్లడ్ బ్యాంకును స్థాపించి, దశాబ్ద కాలంగా ఎందరో ఆపన్నులకు ప్రాణదానం చేస్తున్నారని తెలిపారు.మెగాస్టార్ చిరంజీవి 71వ ఏట కూడా ఎంతో ఉత్సాహంగా, యూత్‌ఫుల్ లుక్‌లో కనిపిస్తూ తన కొత్త చిత్రం 'కాకా'తో అలరించేందుకు సిద్ధమవ్వడం అభినందనీయమన్నారు. ఈ చిత్రానికి ఆల్ ది బెస్ట్ తెలుపుతూ ఆయన ఆయురారోగ్యాలతో నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు.

**ఏపీ పర్యాటక అభివృద్ధికి నాడు ప్రత్యేక నిధులు:**

నాడు కేంద్ర పర్యాటక శాఖ మంత్రిగా (స్వతంత్ర హోదా) ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోని అనేక పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ఇతోధికంగా హీరో చిరంజీవి నిధులు కేటాయించారని మంత్రి దుర్గేష్ గుర్తుచేశారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే వినయం ఆయన సొంతమని, చిత్రసీమలో లేదా సమాజంలో ఎవరికి ఆపద వచ్చినా ఆర్థికంగా ఆదుకునే గొప్ప మానవతావాది చిరంజీవి అని పేర్కొన్నారు. జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో తనకు మంత్రి పదవి లభించిందని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. నిడదవోలు ప్రజల ఆశీస్సులతో, తనకు అప్పగించిన శాఖలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, జిల్లా మంత్రిగా అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని పోతూ న్యాయం చేస్తానని పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా మెగాస్టార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించిన సభా నిర్వాహకులు రాజయ్యను మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా అభినందించారు.



**నిడదవోలు ఐటీ వింగ్ సభ్యుల రక్తదానం – ప్రత్యేక అభినందనలు:**

మంత్రి కందుల దుర్గేష్ పిలుపు మేరకు నిడదవోలు ఐటీ వింగ్ సభ్యులు బాధనాల గౌరీ శంకర్ ఆధ్వర్యంలో హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని 'చిరంజీవి బ్లడ్ అండ్ ఐ బ్యాంక్'లో 15 మంది సభ్యులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన సభ్యులను మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా అభినందించారు. కాగా, రక్తదాతలకు మెగాస్టార్ చిరంజీవి కుమార్తె కొణిదల సుస్మిత ప్రశంసా పత్రాలు అందించి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రావినేని మురళీ, భరణి, శేషురామయ్య, విజయలక్ష్మి, రంగా, శ్రీనివాస్ యాదవ్, చిన్నరాజు, అనంత లక్ష్మీ, షేక్ సుభాన్, బబ్లూ, రాజయ్య మరియు పెద్ద సంఖ్యలో మెగాస్టార్ చిరంజీవి అభిమానులు పాల్గొని వేడుకను జయప్రదం చేశారు.

# భారత్ నీటిని ఆయుధంగా వాడొచ్చు

- పాక్ మంత్రి అహ్సాన్ ఇక్బాల్ ఆరోపణ
- సింధు జలాల ఒప్పందంపై కామెంట్లు
- 2025 పహల్గామ్ దాడి తర్వాత ఒప్పందాన్ని నిలిపేసిన భారత్

**హైదరాబాద్, ఆగస్టు 22 అనంత జనశక్తి న్యూస్**

పాకిస్తాన్ మరోసారి "సింధు జలాల ఒప్పందం"పై స్పందించింది. ఆ దేశ ప్రణాళికా మంత్రి అహ్సాన్ ఇక్బాల్ ఇటీవల ఇండస్ వాటర్ ట్రీటీ, దక్షిణాసియాలో భారత్ వ్యూహాత్మక ప్రాధాన్యతపై కీలక వ్యాఖ్యలు చేశారు. సింధు నది నీటిని ఆపేయడం ద్వారా భారత్ తమ దేశానికి వ్యతిరేకంగా నీటిని ఆయుధంగా ఉపయోగించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భారత్ ఒక నదీతీర దేశమని, అక్కడి నుంచి



ప్రవహించే నదులు పాకిస్తాన్‌లోకి ప్రవేశిస్తాయని ఇక్బాల్ పేర్కొన్నారు. ఈ భౌగోళిక పరిస్థితిని భారత్ తనకు అనుకూలంగా ఉపయోగించుకుంటోందని, పాకిస్తాన్ నీటి సరఫరాను నియంత్రించే అవకాశం ఉందని ఆయన అన్నారు. పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత, భారత్ పాకిస్తాన్‌పై "ఆపరేషన్ సిందూర్" దాడులు నిర్వహించడానికి ముందు "సింధు జలాల ఒప్పందం" నిలిపేసింది. సీమాంతర ఉగ్రవాదానికి పాకిస్తాన్ మద్దతు తెలిపినంత కాలం ఈ ఒప్పందాన్ని పునరుద్ధరించేది లేదని భారత్ స్పష్టం చేసింది. అయితే, ఇది ఏకపక్ష నిర్ణయమని పాక్ ఆరోపిస్తోంది. పాకిస్తాన్ వ్యవసాయం, తాగునీటికి సింధు, దాని ఉపనదులు జీవనాడిగా ఉన్నాయి. ఈ నీటిని నియంత్రిస్తే పాకిస్తాన్ కరువుతో అలమటించడం ఖాయమని ఆ దేశంలో ఆందోళన నెలకొంది. ఇదే సమయంలో అహ్సాన్ ఇక్బార్ మరో కీలక వ్యాఖ్య చేశారు. దక్షిణాసియాలో భారత్ భౌగోళికంగా కేంద్ర స్థానంలో ఉందని, ఈ ప్రాంతం సక్రమంగా ఉండాలంటే భారత్ పాత్ర చాలా ముఖ్యమని పేర్కొన్నారు. దక్షిణాసియాలోని ఇతర దేశాలకు వివిధ మార్గాల్లో భారత్ కనెక్ట్ అయి ఉందని అన్నారు. భారతదేశ పరిమాణం, ఆర్థిక శక్తి, భౌగోళిక స్థానం కారణంగా ఈ ప్రాంత వ్యవహారాల్లో దాని ప్రాధాన్యతను విస్మరించలేమని అన్నారు. 1960లో ప్రపంచ బ్యాంక్ మధ్యవర్తిత్వంతో భారత్‌పాక్ మధ్య "సింధు జలాల ఒప్పందం" కుదిరింది. రెండు దేశాల ఉద్రిక్తతల కారణంగా మరోసారి ఈ ఒప్పందం వార్తల్లో నిలిచింది.

# ఐఏఎస్ అధికారి జ్ఞానేంద్ర కుమార్ అదృశ్యం

- ఈనెల 20న మిస్సింగ్.. పోలీసుల గాలింపు
- అధికారికంగా ఫిర్యాదు చేయని కుటుంబం

**హైదరాబాద్, ఆగస్టు 22 అనంత జనశక్తి న్యూస్**

బెంగళూరు నుంచి ఢిల్లీకి విమానంలో బయల్దేరిన కర్ణాటక ఐఏఎస్ అధికారి జ్ఞానేంద్ర కుమార్ అదృశ్యం అయ్యారు. ఈ నెల 20న అదృశ్యం అయినట్లుగా మంత్రి ప్రియాంక్ ఖర్గే శనివారం తెలిపారు. అయితే ఇప్పటి వరకు ప్రభుత్వంగానీ.. కుటుంబ సభ్యులుగానీ ఎక్కడా కూడా అధికారికంగా ఫిర్యాదు చేయలేదు. ప్రస్తుతం ఐఏఎస్ అధికారి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. ఇక ఈ ఘటన పోలీస్ శాఖలో తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది. ఆచూకీ కనుగొనేందుకు పోలీసులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్ర హోంమంత్రి ప్రియాంక్ ఖర్గే ఈ సంఘటనను అధికారికంగాధృవీకరించారు. ఐఏఎస్ అధికారి అదృశ్యమైనట్లు సమాచారం అందినప్పటికీ.. కుటుంబ సభ్యుల తరఫున ఎలాంటి అధికారిక ఫిర్యాదు నమోదు కాలేదని తెలిపారు. ఢిల్లీకి వెళ్లేందుకు విమానంలో సిద్ధమవుతుండగా అతడిని చివరిసారిగా కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో చూశారని కూడా ఖర్గే పేర్కొన్నారు. జ్ఞానేంద్ర కుమార్ ప్రస్తుతం పరిశ్రమలు, వాణిజ్య శాఖలో ఎంఎస్ఎంఈ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. జ్ఞానేంద్ర కుమార్ 2016 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో కొద్దికాలం పాటు పరీక్షల కంట్రోలర్‌గా కూడా పనిచేశారు. ఈ ఏడాది మార్చిలో ఆయన స్థానంలో మరొకరిని నియమించారు. ప్రస్తుతం కొందరు ఆయన అదృశ్యానికి కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు సంబంధం ఉందని ఆరోపిస్తున్నారు. అయితే ఈ విషయంపై ఎలాంటి కచ్చితమైన సమాచారం వెలువడలేదు. అయితే కొన్ని రోజుల క్రితం వెటర్నరీ ఆఫీసర్ రిక్రూట్‌మెంట్ పరీక్షలో జరిగినట్లు ఆరోపించబడిన కుంభకోణానికి సంబంధించి కేపీఎస్సీ సభ్యురాలు శాంతా హోస్మానీ, మరికొందరి నివాసాలపై ఈడీ దాడులు నిర్వహించింది. ఆ కేసు దర్యాప్తు కొనసాగుతుండగా జ్ఞానేంద్ర కుమార్ అదృశ్యమైనట్లు సమాచారం.



# దూసుకొచ్చిన బస్సు ఐదుగురు స్పాట్ డెడ్



- చిన్నారి పుట్టిన రోజు వేడుక
- బిహార్ పశ్చిమ చంపారన్ జిల్లాలో ఘటన

**హైదరాబాద్, ఆగస్టు 22 అనంత జనశక్తి న్యూస్**

రహదారి పక్కన నిర్వహిస్తున్న ఆర్కెస్ట్రాపైకి బస్సు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మరణించారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన బిహార్ పశ్చిమ చంపారన్ జిల్లాలోని బెట్టియా నగర సమీపంలో పరావ్ తోలా బంకట్వాలో జరిగింది. శుక్రవారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు.
మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ బస్సు ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ నుంచి బెట్టియాకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని వివరించారు. చిన్న పాప జన్మదినం సందర్భంగా ఈ ఆర్కెస్ట్రా కార్యక్రమాన్ని ఆ కుటుంబం నిర్వహించిందని పోలీసులు తెలిపారు.
అయితే ఈ ప్రమాదంలో ఆ పాప తండ్రి కూడా మరణించారని పోలీసులు చెప్పారు. మృతులందరిని గుర్తించామని పేర్కొన్నారు. అతి వేగంతో వెళ్తున్న బస్సు.. ఎదురుగా వస్తున్న ట్రక్కును తప్పించే క్రమంలో ఆర్కెస్ట్రా వైపు బస్సు దూసుకెళ్లిందని వివరించారు. ఈ కార్యక్రమం వద్ద ప్రజలు గుంపుగా ఉన్నారని పోలీసులు చెప్పారు.

# సెప్టెంబర్ 1 నుంచి కొత్త రూల్స్

- విమాన ప్రయాణికులకు అలర్ట్
- బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ కీలక నిర్ణయం

**హైదరాబాద్, ఆగస్టు 22 అనంత జనశక్తి న్యూస్**

విదేశాలకు వెళ్లే భారతీయ విమాన ప్రయాణికులకు గుడ్‌న్యూస్. బోర్డింగ్ పాస్‌లో కీలక మార్పులు జరిగాయి. సెప్టెంబర్ 1 నుంచి అంతర్జాతీయ విమానాల్లో ప్రయాణించే వారు ఇమ్మిగ్రేషన్ కౌంటర్ దగ్గర బోర్డింగ్ పాస్‌పై తప్పనిసరిగా భౌతిక స్టాంప్ వేయించుకోవాల్సిన అవసరం ఉండదు. స్మార్ట్ ఫోన్‌లో చూపించే ఈబోర్డింగ్ పాస్‌ను ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్‌కు అనుమతించనున్నారు. ఈ మేరకు బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ కీలక నిర్ణయం తీసుకుంది.

**బోర్డింగ్ పాస్ స్టాంపింగ్ ఇక ఉండదు**

భారత్ నుంచి విదేశాలకు వెళ్లే ప్రయాణికులు ఇప్పటివరకు ఇమ్మిగ్రేషన్ కౌంటర్ దగ్గర బోర్డింగ్ పాస్‌ను చూపించి స్టాంప్ వేయించుకోవాల్సి వచ్చేది. అయితే సెప్టెంబర్ 1 నుంచి ఈ విధానానికి స్వస్తి పలకనున్నారు. దేశంలోని అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాల్లో భౌతిక బోర్డింగ్ పాస్‌పై ఇమ్మిగ్రేషన్ అధికారులు స్టాంప్ వేయరు. బోర్డింగ్ పాస్‌లపై సరిగా లేదా తప్పుగా స్టాంప్ పడటం వల్ల వాటిని చదవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రయాణికులకు అసౌకర్యం కలిగిస్తున్నందున తప్పనిసరి బోర్డింగ్ పాస్ స్టాంపింగ్ విధానాన్ని తొలగించినట్లు వెల్లడించారు.

**స్మార్ట్‌ఫోన్‌లో చూపిస్తే చాలు**

కొత్త విధానం ప్రకారం.. విదేశాలకు వెళ్లే ప్రయాణికులు ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ సమయంలో తమ స్మార్ట్‌ఫోన్‌లోని ఈబోర్డింగ్ పాస్‌ను చూపించవచ్చు. అయితే ఫిజికల్ బోర్డింగ్ పాస్ తీసుకెళ్లే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. దాన్ని కూడా ఇమ్మిగ్రేషన్ అధికారులు స్వీకరిస్తారు. అయితే సెప్టెంబర్ 1 నుంచి దానిపై ఎలాంటి స్టాంప్ వేయరు. ఇదే సమయంలో ప్రయాణికుల తనిఖీల సమయంలో సీఐఎస్ఎఫ్ బోర్డింగ్ పాస్‌లపై స్టాంప్ వేయడం లేదని అధికారులు స్పష్టం చేశారు. దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికుల బోర్డింగ్ పాస్‌లపై సీఐఎస్ఎఫ్ స్టాంపింగ్ విధానాన్ని కొన్ని సంవత్సరాల క్రితమే నిలిపివేసింది. అంతర్జాతీయ ప్రయాణికులు మాత్రం ఇమ్మిగ్రేషన్ కౌంటర్ దగ్గర బోర్డింగ్ పాస్‌ను ప్రత్యేకంగా చూపించాల్సి వచ్చేది.
అంతర్జాతీయ ప్రయాణికులకు మరింత సౌకర్యం కల్పించే దిశగా బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ మరో కీలక చర్యకు సిద్ధమవుతోంది. భారతీయ పాస్‌పోర్ట్‌దారుల పాస్‌పోర్ట్‌లపై ఇమ్మిగ్రేషన్ ఎంట్రీ, ఎగ్జిట్ స్టాంపింగ్‌ను కూడా తొలగించే అంశాన్ని పరిశీలిస్తోంది. ఇందులో భాగంగా ప్రస్తుతం కొనసాగుతున్న పైలట్ ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత మరో పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. అది విజయవంతమైతే దేశంలోని అన్ని విమానాశ్రయాల్లో భారతీయ పౌరుల పాస్‌పోర్ట్‌లపై ఇమ్మిగ్రేషన్ స్టాంపింగ్‌ను తొలగించే అవకాశం ఉంది.

# డీఎంకే ఓటమికి ఎన్నో కారణాలు

- పార్టీ కార్యకర్తల పాత్ర కూడా ఉంది
- మనం మన తప్పులను దాచుకోవాల్సిన అవసరం లేదు
- ముందుగా మనం మన తప్పులను అంగీకరించాలి
- 110 రోజుల తర్వాత ఓటమికి కారణాలు వెల్లడి

**హైదరాబాద్, ఆగస్టు 22 అనంత జనశక్తి న్యూస్**

ఈ ఏడాది జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే పార్టీ ఘోర పరాజయం పాలైంది. ఇక ముఖ్యమంత్రిగా ఉన్న ఎంకే.స్టాలిన్ అయితే ఘోరంగా ఓడిపోయారు. దీంతో డీఎంకేకు భారీ ఎదురుదెబ్బ తగిలినట్లైంది. అనూహ్యంగా విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ ఘనవిజయం సాధించింది. ఎవరూ ఊహించని విధంగా నటుడు విజయ్ ముఖ్యమంత్రయ్యారు.
అయితే ఎన్నికల ఫలితాలు వెలువడిన 110 రోజుల తర్వాత ఓటమికి కారణాలు వెల్లడిస్తూ ఎంకే స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓటమికి అనేక కారణాలు ఉన్నప్పటికీ.. పార్టీ కార్యకర్తల పాత్ర కూడా అందులో ఒకటని ఎంకే స్టాలిన్ అన్నారు. "మనం మన తప్పులను దాచుకోవాల్సిన అవసరం లేదు. ముందుగా మనం మన తప్పులను అంగీకరించాలి. వాటిని బహిరంగంగా అందరి ముందు ఒప్పుకోవాలి. ఒక్క వ్యక్తి తప్పు చేసినా 75 ఏళ్ల పార్టీ దాని పర్యవసానాలను అనుభవించాల్సి వస్తుంది." అని వ్యాఖ్యానించారు. అయితే స్టాలిన్ ఎవరిని ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారో ఎవరికీ అర్థం కావడం లేదు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే ఘోర పరాజయానికి ఏ కార్యకర్త లేదా వ్యక్తి కారణమయ్యారో మాజీ ముఖ్యమంత్రి స్పష్టంగా చెప్పలేదు. అయితే స్టాలిన్ ఎవరిని ఉద్దేశించి ఆ వ్యాఖ్యలు చేశారనే దానిపై రాజకీయ వర్గాల్లో చర్చలు మొదలయ్యాయి.
ఇక ఎంకే స్టాలిన్ కుమారుడు ఉదయనిధి స్టాలిన్ కూడా ఈ మధ్య వివాదాల్లో చిక్కుకున్నారు. నటి త్రిషపై ఆయన చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు డీఎంకేను ఇబ్బందుల్లోకి నెట్టాయి. దీని తర్వాత అసెంబ్లీలో ముఖ్యమంత్రి విజయ్‌తో తీవ్ర వాగ్వాదం జరిగింది. ఇప్పుడు ఈ పరిణామాల మధ్య అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై 110 రోజుల తర్వాత ఎంకే స్టాలిన్ ఇచ్చిన ప్రతిస్పందన అనేక ఊహాగానాలకు దారితీసింది. తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో విజయ్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. సంప్రదాయ పార్టీలైన డీఎంకే, ఏఐఏడీఎంకే రెండూ భారీ ఎదురుదెబ్బను చవిచూశాయి. విజయ్ పార్టీ టీవీకే 108 స్థానాలను గెలుచుకోగా...డీఎంకే కేవలం 73 స్థానాలకే పరిమితమైంది. ఏఐఏడీఎంకే 53 స్థానాలతో సరిపెట్టుకుంది.



అనంత జనశక్తి
ఆదివారం | అనంతపురం
23.08.2026


## పండంటి మగబిడ్డకి జన్మనిచ్చిన 'కేరింత' బ్యూటీ .. అమ్మగా కొత్త ప్రయాణం మొదలు..



టాలీవుడ్ ప్రేక్షకులకు 'కేరింత' సినిమాతో ఎంతో దగ్గరైన నటి సుకృతి అంబటి అభిమానులకు శుభవార్త చెప్పారు. పండంటి మగబిడ్డకు జన్మనిచ్చినట్లు ఆమె సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. ఈ సందర్భంగా సుకృతి పంచుకున్న ఆనందకరమైన ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అభిమానులతో పాటు పలువురు సినీ ప్రముఖులు కూడా ఈ కొత్త తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. దిల్ రాజు నిర్మాణంలో వచ్చిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'కేరింత' సినిమాతో సుకృతి అంబటి తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. ఈ చిత్రంలో ఆమె పోషించిన 'భావన' పాత్ర ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. తన సహజమైన నటన, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో యూత్‌లో మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. సినిమా విజయం సాధించినప్పటికీ, ఆ తర్వాత సుకృతి సినిమాలకు కొంత దూరంగా ఉంటూ వ్యక్తిగత జీవితానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. ఢిల్లీకి చెందిన సుకృతి అంబటి, చదువుకునే రోజుల నుంచే నటనతో పాటు డ్యాన్స్‌పై ప్రత్యేక ఆసక్తి పెంచుకున్నారు. అలా సినిమా రంగంలోకి అడుగుపెట్టి 'కేరింత'తో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇక వ్యక్తిగత జీవితం విషయానికి వస్తే.. 2022 డిసెంబర్‌లో అక్షయ్ సింగ్‌ను సుకృతి వివాహం చేసుకున్నారు. వివాహం తర్వాత ఈ జంట తమ వైవాహిక జీవితాన్ని ఆనందంగా గడుపుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో తాము త్వరలో తల్లిదండ్రులు కాబోతున్నామని సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. అప్పట్లో బేబీ బంప్‌తో సుకృతి షేర్ చేసిన ఫొటోలు కూడా నెట్టింట బాగా వైరల్ అయ్యాయి. ఇప్పుడు పండంటి మగబిడ్డ జన్మించడంతో సుకృతి జీవితంలో మరో అందమైన అధ్యాయం ప్రారంభమైంది. చిన్నారి రాకతో తమ కుటుంబంలో కొత్త వెలుగులు నిండాయని ఈ జంట ఆనందం వ్యక్తం చేస్తోంది. సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ సోషల్ మీడియా ద్వారా అభిమానులతో నిరంతరం టచ్‌లో ఉంటున్న సుకృతి, ఇప్పుడు అమ్మగా తన కొత్త ప్రయాణాన్ని ఆస్వాదిస్తున్నారు. అమ్మగా కొత్త బాధ్యతలు చేపట్టిన సుకృతి అంబటికి అభిమానులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు. 'కేరింత'తో అలరించిన సుకృతి ఇప్పుడు మాతృత్వ ఆనందంతో కెరీర్‌కు మించిన జీవితంలోని మరో అందమైన పాత్రలో అడుగుపెట్టారు అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

## 'విశ్వంభర' లేట్‌గా వచ్చినా బాక్సాఫీస్ బద్దలైపోవడం ఖాయం.. డైరెక్టర్ వశిష్ఠ సంచలన కామెంట్స్





మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారీ చిత్రం 'విశ్వంభర'. సోషియో ఫాంటసీ జానర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. మెగాస్టార్ చిరంజీవి కెరీర్‌లోనే అత్యంత భారీ విజువల్ వండర్స్‌లో ఒకటిగా ఈ సినిమా నిలుస్తుందనే ప్రచారం జరుగుతోంది. . తాజాగా చిరంజీవి బర్త్‌డే వేడుకల్లో దర్శకుడు వశిష్ఠ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. విశ్వంభర సినిమా విడుదల ఆలస్యమవుతున్న విషయంపై స్పందించిన వశిష్ఠ.. ఆలస్యం అవుతున్నప్పటికీ విజువల్స్ క్వాలిటీ విషయంలో మాత్రం ఎక్కడా రాజీ పడటం లేదని స్పష్టం చేశారు. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించాలనే ఉద్దేశంతో ప్రతి అంశాన్ని అత్యంత జాగ్రత్తగా రూపొందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా వశిష్ఠ చేసిన వ్యాఖ్యలు మెగా అభిమానుల్లో జోష్ నింపుతున్నాయి. "విశ్వంభర లేట్‌గా వచ్చినా బాక్సాఫీస్ బద్దలైపోద్ది.. రాసిపెట్టుకోండి" అంటూ ఆయన ధీమా వ్యక్తం చేశారు. దర్శకుడి నమ్మకం, సినిమాపై ఆయన చూపుతున్న కాన్ఫిడెన్స్ చూసి మెగా అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విడుదల ఆలస్యమైనా, ప్రేక్షకుల ముందుకు వచ్చిన తర్వాత 'విశ్వంభర' థియేటర్లలో సునామీ సృష్టించడం ఖాయమంటూ సోషల్ మీడియాలో అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ప్రతి సంవత్సరం చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు ఏదో ఒక స్పెషల్ ట్రీట్ ఉండటం సహజం. ఈసారి కూడా 'విశ్వంభర' నుంచి కొత్త పోస్టర్, గ్లింప్స్ లేదా ఇతర సర్‌ప్రైజ్ వస్తుందని అభిమానులు ఆశించారు. ముఖ్యంగా సినిమా విడుదల ఆలస్యమవుతున్న నేపథ్యంలో చిత్రబృందం నుంచి ఒక సాలిడ్ అప్‌డేట్ వస్తుందేమోనని ఎంతో ఆసక్తిగా ఎదురుచూశారు. అయితే దర్శకుడు వశిష్ఠ తాజా వ్యాఖ్యలతో, ప్రస్తుతానికి సినిమా నుంచి పెద్ద అప్‌డేట్ ఉండకపోవచ్చనే చర్చ మొదలైంది. కానీ సినిమా క్వాలిటీ విషయంలో టీమ్ తీసుకుంటున్న జాగ్రత్తలే ఆలస్యానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. 'విశ్వంభర' చిత్రాన్ని కేవలం ఒక సాధారణ సోషియో ఫాంటసీగా కాకుండా, ప్రేక్షకులకు కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసేలా రూపొందిస్తున్నారని సమాచారం. ముఖ్యంగా విజువల్ ఎఫెక్ట్స్, గ్రాఫిక్స్ విషయంలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలనే లక్ష్యంతో చిత్రబృందం పని చేస్తున్నట్లు తెలుస్తోంది. సినిమా ఆలస్యమైనా సరే.. నాణ్యత విషయంలో రాజీ పడకూడదనే నిర్ణయంతో మేకర్స్ ముందుకు వెళ్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం అభిమానులు మరికొంత కాలం ఎదురుచూడాల్సి వచ్చినా, ఫైనల్ అవుట్‌పుట్ మాత్రం ఆ నిరీక్షణకు తగ్గట్టుగానే ఉంటుందని చిత్రబృందం నమ్మకంగా ఉంది.

## అర్జున్ రాంపాల్ రెండో పెళ్లి.. ప్రియురాలు గాబ్రియెల్లాతో రిజిస్టర్ మ్యారేజ్



బాలీవుడ్ నటుడు అర్జున్ రాంపాల్ మరోసారి పెళ్లి బంధంలోకి అడుగుపెట్టారు. 'ధురంధర్' సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో విలన్‌గా మరింత గుర్తింపు తెచ్చుకున్న అర్జున్ రాంపాల్.. తన ప్రియురాలు, మోడల్, నటి గాబ్రియెల్లా డెమెట్రియాడెస్‌ను అధికారికంగా వివాహం చేసుకున్నారు. ఎన్నో ఏళ్లుగా సహజీవనం చేస్తున్న ఈ జంట తాజాగా తమ బంధానికి అధికారికంగా మూడుముళ్ల బంధంతో ముగింపు పలికింది. అర్జున్ రాంపాల్, గాబ్రియెల్లా డెమెట్రియాడెస్‌లు శుక్రవారం (ఆగస్టు 21) సాయంత్రం ఉత్తర గోవాలోని మపుసా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ మ్యారేజ్ చేసుకున్నట్లు సమాచారం. సాయంత్రం 4 గంటల సమయంలో ఈ జంట కార్యాలయానికి చేరుకున్నట్లు తెలుస్తోంది. పెళ్లి సందర్భంగా ఇద్దరూ ఎలాంటి హంగూ ఆర్భాటాలకు వెళ్లకుండా చాలా సింపుల్‌గా సాధారణ దుస్తుల్లో కనిపించారు. రిజిస్టర్ మ్యారేజ్ సమయంలో కుటుంబ సభ్యులు, కొందరు స్నేహితులు, అత్యంత సన్నిహితులు మాత్రమే వారితో ఉన్నట్లు సమాచారం. గోవాలో అమల్లో ఉన్న యూనిఫామ్ సివిల్ కోడ్ (UCC) నిబంధనల ప్రకారం వీరి వివాహం నమోదు చేసినట్లు మపుసా సబ్-రిజిస్ట్రార్ సూరజ్ వెర్నేకర్ వెల్లడించారు. అర్జున్ రాంపాల్, గాబ్రియెల్లా డెమెట్రియాడెస్ 2018 నుంచి రిలేషన్‌షిప్‌లో ఉన్నారు. చాలా కాలంగా కలిసి జీవిస్తున్న ఈ జంట తమ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను మాత్రం పెద్దగా బయటకు వెల్లడించలేదు. అయితే సోషల్ మీడియాలో అప్పుడప్పుడు కలిసి కనిపిస్తూ తమ అభిమానులకు తమ బంధాన్ని పరిచయం చేస్తూ వచ్చారు.

## మాన్సికి రజతం.. తన్వీ, కోమల్‌లకు కాంస్యాలు




అండర్-20 ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత అమ్మాయిలు మరో మూడు పతకాలు సాధించారు. మాన్సి లాథర్ రజత పతకాన్ని.. తన్వీ మగ్దుమ్, కోమల్ కాంస్య పతకాలను గెలుచుకున్నారు. 68 కేజీల విభాగం స్వర్ణ పతక పోరులో చైనాకు చెందిన చెన్‌లింగ్ సాంగ్ చేతిలో మాన్సీ 1-2 స్వల్ప తేడాతో ఓటమి పాలై రజతంతో సరిపెట్టుకుంది. 57 కేజీల విభాగంలో తన్వి10-4తో అగ్నియా (కెనడా)ను కాంస్య పతకం దక్కించుకుంది. 59 కేజీల విభాగంలో కోమల్ 5-2తో ఎడా బాలాజ్ (హంగేరీ)ని చిత్తుచేసింది. ఈ టోర్నీలో శుక్రవారం 76 కేజీల విభాగం ఫైనల్లో కాజల్ దోచాక్ గెలిచి ఛాంపియన్‌గా నిలిచింది. తను శర్మ(72 కేజీలు), సవిత (62 కేజీలు) రజతం దక్కించుకున్నారు..

## ర్యాంకులు కాదు.. నాకు ట్రోఫీలే ముఖ్యం



శ్రీలంకతో రెండో టెస్టు కోసం టీమ్ఇండియా సన్నద్ధమవుతోంది. ఆదివారం నుంచి కొలంబో వేదికగా మ్యాచ్ మొదలుకానుంది. తొలి టెస్టులో భారీ విజయంతో భారత్ ఉత్సాహంగా ఉంది. రెండో మ్యాచ్‌నూ గెలిచి క్లీన్‌స్వీప్ చేయాలనే లక్ష్యంతో ఉంది. ఈ క్రమంలో భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడాడు. గతంలో ఎదురైన పరాభవాల గురించి ఎక్కువగా ఆలోచించనక్కర్లేదని.. జట్టు సరైన మార్గంలోనే ఉన్నట్లు స్పష్టం చేశాడు. టెస్టు క్రికెట్‌లో భారత్ ఇబ్బంది పడుతోందనే వాదనను కొట్టిపడేశాడు.

"మేం ఎప్పుడూ ఇబ్బంది పడలేదు. కొన్ని మ్యాచుల్లో ఫలితాలు అనుకూలంగా రానంత మాత్రాన జట్టు పతనమైనట్లు కాదు. ఇదంతా ట్రాన్సిషన్‌లో భాగం. ర్యాంకుల గురించి మేం పట్టించుకోం. గత ఇంగ్లాండ్ పర్యటన నుంచి మంచి టెస్టు క్రికెట్‌నే ఆడుతున్నాం. ప్రధాన కోచ్‌గా నా పని ట్రోఫీలను గెలవడం. నేను నమ్మేదీ అదే. దాని గురించే ఆలోచిస్తా" అని గంభీర్ స్పష్టం చేశాడు.

**కుల్‌దీప్ బౌలింగ్‌పై..**

"ఎప్పుడైనా సరే మ్యాచ్‌లో 20 వికెట్లను పడగొట్టేందుకు చూస్తాం. అలాంటి అత్యుత్తమ బౌలింగ్ ఎటాక్‌తో బరిలోకి దిగుతాం. కుల్‌దీప్ యాదవ్ మంచి బౌలర్. అందులో ఎలాంటి సందేహం లేదు. తుది జట్టు ఎంపికపై కొన్నిసార్లు కెప్టెన్ నిర్ణయం కూడా ఆధారపడి ఉంటుంది. క్రికెట్‌లో ఒడుదొడుకులు సహజం. మా ప్లేయర్లకు మేం మద్దతుగా ఉంటాం. ఒకటి లేదా రెండు మ్యాచుల ప్రదర్శన ఆధారంగా నిర్ణయాలు తీసుకోం"

**మూడు టెస్టుల సిరీస్ అయితే..**

"శ్రీలంకతో రెండు టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉన్నాం. అయితే, నేను మూడు టెస్టుల సిరీస్ నిర్వహణకే మొగ్గు చూపిస్తా. అందుకోసం ఎలా సిద్ధమవ్వాలో ఆటగాళ్లుగా మాకు తెలుసు. అవసరమైతే ప్రాక్టీస్ సెషన్‌లను ఆప్షనల్ చేస్తాం. బౌలర్లకు ఎక్కువగా విశ్రాంతి ఇస్తాం. ఇక గాలె మైదానం మంచి టెస్టు పిచ్. అక్కడ ఆటను ఆస్వాదించాం. కొలంబోలోనూ ఇలానే ఉంటుందని భావిస్తున్నా" అని గంభీర్ తెలిపాడు.

## 'బాయ్‌కాట్' నినాదం వేళ.. భారత్‌తో మ్యాచ్‌పై బ్రెజిల్ ఫుట్‌బాల్ స్పష్టత!

బ్రెజిల్‌తో భారత్ స్నేహపూర్వక మ్యాచ్‌ను ఆడొద్దని.. బాయ్‌కాట్ చేయాలని మాజీల నుంచి డిమాండ్ వినిపిస్తోంది. అనవసరమైన భారీ ఖర్చుతో మ్యాచ్‌ను నిర్వహించాల్సిన అవసరం లేదనేది వారి వాదన. అందుకు వెచ్చించే నిధులను భవిష్యత్తు తరాల కోసం వినియోగించాలని మాజీ కెప్టెన్ బైఛుంగ్ భూటియా సూచించాడు. ఫ్రీగా వచ్చి ఆడితే తమకు అభ్యంతరం లేదనీ అతడు వ్యాఖ్యానించాడు. ఈ క్రమంలో బ్రెజిల్ ఫుట్‌బాల్ సంఘం స్పందించినట్లు వార్తలు వస్తున్నాయి.

షెడ్యూల్ ప్రకారం భారత్ - బ్రెజిల్ జట్ల మధ్య అక్టోబర్ 3న స్నేహపూర్వక మ్యాచ్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అయితే, బాయ్‌కాట్ వ్యాఖ్యల నేపథ్యంలో బ్రెజిల్ ఫుట్‌బాల్ ఫెడరేషన్ స్పందిస్తూ.. "షెడ్యూల్ ప్రకారమే మ్యాచ్ ఆడతాం. బయట జరుగుతోన్న చర్చ మాపై ప్రభావం చూపదు" అని స్పష్టం చేసింది. దీంతో బ్రెజిల్ ఆడేందుకు సిద్ధమైన సంకేతాలను పంపినట్లైంది.

**అందుకే వస్తున్నాం..**

"అభిమానుల కోసం మేం భారత్‌కు వస్తున్నాం. గత ప్రపంచ కప్‌లో మా జట్టుకు భారతీయ ఫ్యాన్స్ మద్దతుగా నిలిచారు. అందుకు కృతజ్ఞతగానే ఈ మ్యాచ్‌ను ఆడేందుకు అక్కడికి వస్తున్నాం. అలాగే గొప్ప ప్రదర్శన ఇవ్వడానికి భారత్‌కు వెళ్లడం సముచితం" అని బ్రెజిల్ జట్టు కోఆర్డినేటర్ రోడ్రిగో వ్యాఖ్యానించారు.

## మారని తీరు.. డీఆర్ఎస్ తీసుకోవాలని ప్రత్యర్థిని రెచ్చగొట్టిన స్మిత్!

ఆస్ట్రేలియా-బంగ్లాదేశ్ జట్ల మధ్య రెండో టెస్టు ఆసక్తికరంగా సాగుతోంది. మొదటి టెస్టులో బంగ్లా విజయంతో ఈసారి ఆసీస్ ఆటగాళ్లు కాస్త అగ్రెసివ్‌గా ఆడుతున్నారు. అది మైదానంలో స్పష్టంగా కనిపించింది. రెండో టెస్టు తొలి రోజు ఆటలో బంగ్లాపై ఆస్ట్రేలియా ఆధిపత్యం ప్రదర్శించింది. ఈ క్రమంలో స్టీవ్ స్మిత్ ప్రవర్తించిన తీరు తీవ్ర విమర్శలకు దారితీసింది. అంపైర్లు కలగజేసుకొని వార్నింగ్ ఇచ్చారు.

**వారు వద్దనుకున్నా.. సరే**

స్టీవ్ స్మిత్ తన చర్యలతో ప్రత్యర్థులను బుట్టలో వేయాలని చూస్తుంటాడు. సరిగ్గా అలాంటిదే బంగ్లాతో మ్యాచ్‌లోనూ ప్రయోగించాడు. చివరికి వార్నింగ్ ఎదుర్కోవాల్సి వచ్చింది. బంగ్లా ప్లేయర్లు మాత్రం ఉచ్చులో పడకుండా తెలివిగా వ్యవహరించారు. తస్కిన్ బౌలింగ్‌లో స్మిత్ బంతిని ఎదుర్కొన్నాడు. అది ప్యాడ్లను తాకింది. బంగ్లా బౌలర్‌తోపాటు ఫీల్డర్లు అప్పీలు చేయగా అంపైర్ నాటౌట్ ఇచ్చాడు. తస్కిన్‌ను కెప్టెన్ షాంటో డీఆర్ఎస్ తీసుకుందామా? అని అడిగాడు. వద్దు.. ఆ బంతి కాస్త పైకి వెళ్తున్నట్లు అనిపిస్తోందని తస్కిన్ చెప్పాడు. అక్కడే ఆ సంభాషణను వింటోన్న స్మిత్ కలగజేసుకొని.. లేదు మీరు తీసుకోండి అన్నట్లుగా వీడియోల్లో రికార్డైంది. కానీ, బంగ్లా మాత్రం డీఆర్ఎస్ తీసుకోలేదు. కాసేపటికే ఫీల్డ్ అంపైర్లు అలా చేయొద్దంటూ స్మిత్‌కు వార్నింగ్ ఇచ్చారు. దీంతో స్మిత్ తీరుపై సోషల్ మీడియాలో కామెంట్లు వస్తున్నాయి. ఇంత సీనియర్ అయినా సరే మారలేదంటూ కొందరు వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు బంగ్లా బ్యాటింగ్ సమయంలో జోష్ హేజిల్‌వుడ్ - తస్కిన్ వ్యవహారం కూడా వివాదాస్పదంగా మారేదే. తనను క్యాచ్ పట్టనీయకుండా తస్కిన్ అడ్డుగా వచ్చాడని అంపైర్ల దృష్టికి జోష్ తీసుకెళ్లాడు. కానీ, వాళ్లు పట్టించుకోకపోవడంతో జోష్ వదిలేశాడు.

**ఆసీస్‌కు 101 పరుగుల లీడ్**

రెండో టెస్టులో బౌలర్లు చెలరేగిపోయారు. తొలుత బంగ్లాదేశ్ మొదటి ఇన్నింగ్స్‌లో 64 పరుగులకే కుప్పకూలింది. మిచెల్ స్టార్క్ 6 వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్ మొదలుపెట్టిన ఆస్ట్రేలియా తొలి రోజు ఆట ముగిసేసరికి 8 వికెట్ల నష్టానికి 165 పరుగులు చేసింది. హాఫ్ సెంచరీతో కామెరూన్ గ్రీన్ (51*) ఆసీస్‌ను ఆదుకొన్నాడు. బంగ్లా బౌలర్ షోరిఫుల్ (6/35) దెబ్బకు ఆతిథ్య టీమ్ తీవ్రంగా ఇబ్బంది పడింది. గ్రీన్ కాకుండా.. స్టీవ్ స్మిత్ (42), ట్రావిస్ హెడ్ (22) మాత్రమే కాస్త ఫర్వాలేదనిపించారు. ప్రస్తుతం ఆస్ట్రేలియా 101 పరుగుల ఆధిక్యంలో ఉంది. క్రీజ్‌లో గ్రీన్‌తోపాటు నాథన్ లయన్ (10*) ఉన్నాడు.



PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT M/S SREE VASAVI PUBLICATIONS#4/38, Main Road, Settur515, 767, Ananthapuram Dist., (A.P)
EDITOR : SHANKARAGALLU VENKATESULU. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : APTEL/2015/61314